# ప్రథమాధ్యాయము-ద్వితీయ పాదము

# విషయసూచిక

Contents

1. సర్వత్ర ప్రసిద్ధి అధికరణము: ... 3

2. అత్త్రధికరణమ్: ... 32

3.అంతరాధికరణము: ... 53

4.అంతర్యామ్యధికరణము: ... 80

5.అదృశ్యత్వాది గుణకాధికరణము: ... 93

6.వైశ్వానరాధికరణము: ... 112

నాన్నగారు: దాసోహం బావా, ఈ రోజు నుండీ మొదటి అధ్యాయంలో రెండవపాదము ప్రారంభిస్తావా!

**మామయ్య:** దాసోహమ్, దాసోహమ్, అలాగే ప్రారంభించుకుందాం. అసలు ఈరోజు, రేపు కూడా చాలా విశేషమైన రోజులు. మన సనాతన ధర్మాన్ని పునరుద్ధరించిన శంకర భగవత్పాదులు, భగవద్రామానుజుల జన్మ దినాలు. ఆ మహానుభావులను స్మరించుకుంటూ ప్రారంభించుకుందాము.

**నాన్నగారు:** మొదటి పాదములో భగవద్రామానుజులు శ్రుతులవలన తప్ప మిగతా ప్రమాణాలవలన తెలియ దుస్సాధ్యమైన పరబ్రహ్మ, సర్వజ్ఞత్వ, సత్య సంకల్పత్వాది అనంత కళ్యాణ గుణాకరుడు, అఖిల హేయ ప్రత్యనీకుడనిన్నీ, ప్రకృతి, జీవ విలక్షుణడనిన్నీ, ఆ పరబ్రహ్మే సమస్త జగత్సృష్ట్యాదులకు కారణమనిన్నీ శ్రుతులు అన్నీ ఆ విషయమే చెబుతాయనీ ప్రతిపాదించేరు. ఇంక తరువాత ఏమి చెబుతారు?

**మామయ్య:** ఉపనిషత్తులు జగత్సృష్ట్యాదులకు కారణము పరబ్రహ్మే అని చెబుతున్నా, కొన్ని ఉపనిషద్వాక్యములు ప్రకృతి, జీవ అంతర్భూతమైన వస్తు విశేష స్వరూపాన్ని తెలుపుతున్నాయేమోనని కొన్ని చోట్ల అనిపించవచ్చు. అలా జీవ చిహ్నాములు అస్పష్టముగా కనపడే ఉపనిషద్వాక్యాలను కూడా తీసుకొని, వాటిని మన సంశయనివారణ కలిగేటట్లు వివరిస్తారన్నమాట ఈ రెండవ పాదములో.

**నాన్నగారు:** ఓహో! అంటే ఏమాత్రం సంశయాలకు, సందేహాలకు తావు లేకుండా తమ సిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తున్నరన్నమాట భగవద్రామానుజులు.

**మామయ్య:** తమ సిద్ధాంతమన్న కంటే సర్వోపనిషత్సమన్వయంతో పథ్యమైన సత్యాన్ని అందిస్తున్నారంటే ఇంకా సరిగ్గా ఉంటుందేమో. ఇదంతా ఉపనిషత్తులలో ఉన్నది, ఆళ్వారాదులు ఆదరించినదే కదా.

## 1. సర్వత్ర ప్రసిద్ధి అధికరణము:

నాన్నగారు: అవును. అయితే ఇప్పుడు నువ్వు చెప్పబోయే అధికరణం పేరేమిటి?

మామయ్య: దీనిని "సర్వత్ర ప్రసిద్ధి అధికరణము" అని అంటారు. దీనిలో 8 సూత్రాలు ఉన్నాయి.

నాన్నగారు: దీనిలో ఏ ఉపనిషద్వాక్యాలను వివరిస్తున్నారు.

మామయ్య: "ఛాందోగ్యోపనిషత్ లో 3 వ అధ్యాయములో 14 వ ఖండములో శాండిల్యవిద్య అని వస్తుంది.

నేను: శాండిల్యుడు అంటే ఎవరు మామయ్యా!

మామయ్య: ఈయన కశ్యప మహర్షి మనుమడు, అసిత మహర్షి కుమారుడు. ఈయన ప్రసక్తి మనకు కొన్ని పురాణాలలో కూడా వస్తుంది.

నాన్నగారు: ముందుగా ఆ ఉపనిషద్వాక్యాలు వాటి అర్థము క్లుప్తంగా చెప్పు. అలాగయితే తరువాత అర్థం చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుంది.

మామయ్య:

"సర్వమ్ ఖలు ఇదమ్ బ్రహ్మ తజ్జలాన్ శాంత ఉపాసీత

అథ ఖలు క్రతుమయః పురుషో యథాక్రతురస్మిన్ లోకే పురుషో భవతి

తథేతః ప్రేత్య భవతి సక్రతుమ్ కుర్వీత

మనోమయః ప్రాణశరీరో భారూపః సత్యసంకల్ప ఆకాశాత్మా సర్వకర్మా సర్వకామః సర్వగంధః సర్వరసః సర్వమ్ ఇదమ్ అభ్యాత్తః అవాకీ అనాదరః

ఏష స ఆత్మా అంతర్హృదయే అణీయాన్ చో హేర్వా య వాజ్ఞా సర్షపాజ్ఞా ఏవామాకాశా శ్యామాకతయమ్ లాద్రా

ఏషవ ఆత్మామ్ ర్హృదయే జ్యాయాన్ పృథివ్యాః జ్యాయాన్ అంతరిక్షా జ్జాయాయామ్ దివో జ్యాయాసేభ్యో లోకేభ్యః

సర్వకర్మా సర్వకామః సర్వగంధః సర్వరసః సర్వమ్ ఇదమ్ అభ్యాత్తో అవాకీ అనాదరః

ఏష స ఆత్మామ్ ర్హృదయే ఏతదబ్రహ్మో తమితః ప్రేత్య అభి సంభవిత అస్మీతి యస్య ప్యాదద్దా నవిచికిత్సాస్మీతి

హన్యాహ శాండిల్యః శాండిల్యః।

ఇప్పుడు ఈ వాక్యాలకు క్లుప్తంగా అర్థాన్ని చూద్దాము.

ఇది అంతయు బ్రహ్మమే కదా! దీని నుండియే సృష్టియు, స్థితియు, లయమును కలుగు చున్నవని శాంతముతో ఉపాసించ వలయును.

ఇంక సాధనమయమే కదా! పురుషుడు ఏ విధముగా సాధన ఈ లోకమునందు చేయుచున్నాడో ఆ విధముగనే ప్రాణ ప్రయాణ కాలమున నగుచున్నాడు. ఈ విషయము తెలిసి సాధన చేయవలయును.

అతడు మనోమయుడు, ప్రాణ శరీరుడు, భారూపుడు(తేజోరూపుడు), సత్య సంకల్పుడు, ఆకాశాతాత్ముడు, సర్వకాముడు, సర్వగంధ, సర్వరస స్వరూపుడు, అన్నిటికి కారణభూతుడు, సర్వము తానె అయినవాడు, అవాకి, అనాదరుడు, హృదయాంతర్గతుడు, ఒక ధాన్యము కంటెను, ఒక గోధుమ గింజ కంటెను, ఒక బార్లీ గింజ కంటెను, ఒక ఆవ గింజ కంటెను, అంత కంటె చిన్నదైన ధాన్య విశేషము కంటెను చిన్నదయిన ఆత్మ. అతడు భూమి కంటెను, అంతరిక్షము కంటెను, దివి కంటెను, సర్వలోకముల కంటెను పెద్ద వాడు.

అతడు సమస్త కర్మలకు కర్త, కారణుడు, సర్వ కాముడు, సర్వ గంధ, సర్వరస స్వరూపుడు, ఇది అంతయు అతడే. అవాకీ, అనాదరుడు. అతడు ఆత్మ హృదయాంతర్గతుడు, అతడు బ్రహ్మ. మరణానంతరము అతనినే పొందెదను. సంశయము లేకుండా ఎవరు ఈ సంపూర్ణ విశ్వాసముతో నుందురో వారు తప్పక పొందుదురు. అని శాండిల్యుడు పలికెను.

**నేను:** అమ్మ బాబోయ్! ఒక సారి బ్రహ్మ అనీ ఒక సారి ఆత్మ అనీ సంశయంలో పడవేసి, చివరకు సంశయం ఉండకూడదు అంటున్నారు!

**మామయ్య:** అందుకే మనకు భగవద్రామానుజుల అండ కావాలి వీటిని అర్థం చేసుకునేందుకు. నీకు ఇలాంటి సంశయాలు వస్తాయని, భగవద్రామానుజులు ఆ ప్రశ్నలు కూడా తనే వేసుకొని వాటికి సమాధానాలు కూడా తనే చెప్పేరు సూత్ర వివరణలో

**అమ్మ:** ఏమిటి మామయ్యా ఆసూత్రాలు

**మామయ్య :** చెప్పేను కదమ్మా ఈ ప్రకరణంలో 8 సూత్రాలని. అవి ఒక్కొక్కటీ చూద్దాము.

## "సర్వత్ర ప్రసిద్ధోపదేశాత్".....1-2-1

అంటే

(మనోమయుడు పరమాత్మయే ఏలననగా)

సర్వత్ర: ఉపనిషత్తుల యందంతటను

ప్రసిద్ధోపదేశాత్: (మనోమయాది విశిష్టుడుగను, విశుద్ధ మనోగ్రాహ్యుడుగను) ప్రసిద్ధముగా (పరమాత్మయే) ఉపదేశింపబడి యున్నందున

పరమాత్మయే ఉపనిషత్తులయందంతటను మనో మయత్వాది ధర్మములు గలవాడుగను, ప్రసిద్ధముగా నుపదేశింపబడి యున్నందున ఈ శాండిల్య విద్య యందుకూడ ఉపదేశింప బడినది పరమాత్మయే(జీవాత్మ కాదు).

నాన్నగారు: ఈ శాండిల్య విద్య లో చెప్పబడినది జీవాత్మ అని అనిపించడానికి కారణాలు కూడా నువ్వే చెప్పి అలా కాక పరమాత్మ అనడానికి కూడా వివరణ కూడా నువ్వే అనుగ్రహించు, కోర్టులో రెండు ప్రక్కలా వాదించి నట్లు.

మామయ్య : అలా పై వాళ్ళకు రాగల సంశయము తామే ఊహించి చెప్పడానికి "ఉత్థాప్యాకాంక్ష" అంటారు.

ముందు ఈ వాక్యాలలో చెప్పబడుతున్నది జీవాత్మ అనిపించడానికి కారణాలు చెబుతాను. దీనిని "పూర్వ పక్షము" అని అంటారు. తరువాత అలా కాక ఈ వాక్యాలు చెప్పేది పరమాత్మే అని ప్రతిపాదించడాన్ని "సిద్ధాంతము" అని అంటారు.

## పూర్వపక్షము:

ఈ వాక్యాలలో చెప్పబడుతున్నది జీవాత్మయే ఎందుకంటే

ఈ వాక్యాలలో చెప్పబడు చున్న మనస్సు, ప్రాణము జీవునకు ఉపకరణములు. మనోమయ, ప్రాణమయ కోశాలు మన శరీరాంతర్భాగములు కదా! పరమాత్మను వర్ణిస్తూ ముండకోపనిషత్తు "అప్రాణః హి అమనాః" అని ప్రాణము, మనస్సు లేని వాడు పరమాత్మ అని చెబుతుంది. కనుక ఇక్కడ చెప్పబడుతున్నది పరమాత్మ అనుటకు కుదరదు.

నాన్నగారు: మఱి ముందువాక్యములో "సర్వమ్ ఖలు ఇదమ్ బ్రహ్మ తజ్జలానితి శాంత ఉపాసీత" అని ఉంది కదా దానికర్థం ఏమిటి. అక్కడ బ్రహ్మ అని కదా అంటున్నారు.

మామయ్య: "సర్వమ్ ఇదమ్ బ్రహ్మ" అని కదా, ఇదమ్ సర్వమ్ అంటే ఈ కనబడుతున్న జీవాత్మ సందోహమంతా అనికదా, ఇదంతా బ్రహ్మే అంటే జీవాత్మే నన్న మాట. ఒకవేళ పరబ్రహ్మ అయితే పరబ్రహ్మ అని

చెప్పేవారు కదా, బ్రహ్మ అని అందుకే అన్నారన్న మాట జీవాత్మ గొప్పదనాన్ని సూచిస్తూ. ఇక్కడ దీనిని ఉపాస్య వస్తువుగా తీసుకోకూడదు. "శాంత ఉపాసీత" అని శాంతముతో ఉపాసించునది అని ఉపాసనమునకు సాధనభూతమైన శాంతిని కలుగ చేయడానికి ఉపాయభూతమైన బ్రహ్మైత్వకత్వ అనుసంధానమును ఉపదేశించడం కోసం బ్రహ్మ అన్నారన్న మాట.

**నాన్నగారు:** మరి "స క్రతుమ్ కుర్వీత" అని ఉపాసించమని చెబుతున్నప్పుడు దేనిని ఉపాసించాలి అంటే ముందు చెప్పిన బ్రహ్మ పదాన్నే తీసుకోవాలి కదా! అంటే పరబ్రహ్మ కాదా!

**మామయ్య:** అలా కుదరదు. ఎందుకంటే మనోమయః ప్రాణ శరీరః అని అదే వాక్యంలో పదాలు వదిలేసి మరెక్కడో ఉన్న పదాన్ని తెచ్చిపెట్టుకొననక్కరలేదు. ఆ వాక్యంలో మనోమయః అనే కదా ఉంది.

**నాన్నగారు:** అదెలా కుదురుతుంది, "రామునియొక్క ఉపాసన చేయాలి" అన్న వాక్యంలో ఉపాస్య వస్తువైన రాముడు అన్న పదము షష్టి విభక్తి లో ఉంటుంది. ఇక్కడ మనోమయః ....ఈ పదాలు ప్రథమావిభక్తిలో కదా ఉన్నాయి.

**మామయ్య:** అక్కడ ప్రథమావిభక్తికి షష్ఠీవిభక్తిగా అర్థం చెప్పుకుంటే సరిపోతుంది.

**నాన్నగారు:** "సర్వమ్ ఖలు ఇదమ్ బ్రహ్మ" అన్నట్లే చివరలో కూడా "ఏతత్ బ్రహ్మ" అని బ్రహ్మ అనే చెబుతున్నారే.

**మామయ్య:** బ్రహ్మ అని తప్ప పరబ్రహ్మ అనలేదు కదా. అంటే ఇక్కడ బ్రహ్మ అని గౌరవార్థము ప్రయోగిస్తున్నారన్న మాట. జీవుని తెల్పుటకు బ్రహ్మ అని వాడడం చాలా చోట్ల చూస్తాము. అంతే కాదు ఇదంతా పరబ్రహ్మ అని నువ్వనుకోవడానికి ఈ కనపడే సర్వమూ అంటే బ్రహ్మాది స్తంబ పర్యంతమూ ఉండే

సకల ప్రపంచము సకల హేయములతో కూడి యున్నది కదా, నువ్వు అఖిల హేయ ప్రత్యనీకుడు అని పరబ్రహ్మను చెబుతూ ఇదే పరబ్రహ్మ అంటే నువ్వు చెబుతున్న అఖిలహేయ ప్రత్యనీకత కుదరదు కదా.

అవాప్త సమస్త కాముడు అని ఒక పక్క చెబుతూ సర్వ కామః అని పరబ్రహ్మను ఎలావర్ణిస్తావు.

నాన్నగారు: ఆత్మ అణు మాత్రమని కదా అంటాము. ఇక్కడ చాలా చిన్నది అనడంతో బాటు చాలా పెద్దది అని కూడా చెబుతున్నారు

మామయ్య: "ప్రత్యగాత్మ" కు ఉపాధి సంబంధం పోయిన తరువాత బృహత్వాన్ని పొందడం అంటే చాలా గొప్పదవడం ఉంది కదా! "స చ అనంత్యాయ కల్పతే" అని శ్వేతాశ్వతర ఉపనిషత్ లో ముక్తుడు హద్దు లేని వాడు అని కదా చెప్పబడినది.

నాన్నగారు: "తజ్జలాన్" అంటే సృష్టి, స్థితి, లయాలు దీని వలననే అంటే

మామయ్య : "జీవాత్మ కర్మ సంబంధము వలననే కదా ఈ సృష్టి, స్థితి లయాలు. అదే చెబుతున్నారన్నమాట. జీవాత్మ స్వతః అపరిచ్ఛిన్నరూపుడవడం వలన అతడు బ్రహ్మమే అయినా అనాద్యవిద్యా మూలముగా దేవ, మనుష్య, తిర్యక్, స్థావరరూపములుగా జన్మాదులు పొందుతున్నాడు". అని దీనికర్థము.

"తరువాత పదాలు చూడు. అవన్నీ కూడా జీవాత్మనే సూచిస్తున్నాయి" అందువలన ఇక్కడ చెప్పబడుతున్నది జీవాత్మయే అని అంటారు పూర్వ పక్షము లో.

నాన్నగారు: బాగుంది, నీ కత్తికి రెండు ప్రక్కలా పదునే బావా. పూర్వపక్షము కూడా చాలా సమర్థవంతంగా చెప్పేవు.

మామయ్య: అదే భగవద్రామానుజుల గొప్పదనము. పూర్వ పక్షాన్ని పేలవంగా చెప్పి తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించరు. పూర్వపక్షం కూడా ఎంతో సమర్ధవంతంగా నిర్వహిస్తారు.

నాన్నగారు: మఱి ఇదంతా ఎలా వివరించేరు రామానుజులు.

నేను: ఇందాకా బ్రహ్మాది స్థంభ పర్యంతమూ అన్నారుకదా, అంటే

మామయ్య: స్థంభ కాదు స్తంబ అంటే గడ్డిపరక అని అర్థము. అంటే ఎంతో గొప్పదానినుండి ఎంతో చిన్నదానివరకూ అన్నమాట.

ఇంక భగవద్రామానుజులు వివరించిన సిద్ధాంత భాగానికి వద్దాము.

"సర్వమ్ ఖలు ఇదమ్ బ్రహ్మ" అని కదా  ఇక్కడ ఖలు అన్న పదము ప్రసిద్ధిని తెలుపుతోంది. అంటే ఈ ప్రపంచమంతా పరబ్రహ్మాత్మకము అని కదా అన్ని శ్రుతులు తెలుపుతున్నది. "అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య...." అని పరమాత్మ అన్నిటి లోను అంతర్యామి గా ఉంటాడని, ఈ సమస్తమూ పరబ్రహ్మాత్మకమని కదా శ్రుతులన్నిటిలోనూ చెప్పబడినది. ఎలా చెబుతున్నామంటావా, తరువాత పదము చూడు "తజ్జలాన్" అంటే తత్ జం, తదలం, తదనం అంటే దాని నుండి సృష్టి, దానియందు లయము, దాని వలన స్థితి(అన ప్రాణే అని ఇక్కడ అన అంటే స్థితి ని చెబుతుంది) ఇది పరబ్రహ్మకే కదా వర్తిస్తుంది. "యతోవా ఇమాని భూతాని జాయంతే...", "సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్..." మొదలైన శ్రుతులు చెప్పేది దీనినే కదా. ఇక్కడ అగ్రమ్ అన్న పదానికి మొదలు అన్నట్లే చివరలో అనికూడా తీసుకోవచ్చు ననుకో. ఈ రకంగా ఉపనిషత్తులన్నీ ప్రపంచం అంతా పరబ్రహ్మాత్మకము అని చెబుతోంది. అట్టి పరబ్రహ్మమును శాంత చిత్తుడై ఉపాసించమని చెబుతున్నారు.

ఇంక అఖిల హేయ ప్రత్యనీకుడైన పరబ్రహ్మకు హేయ మయ ప్రపంచముతో తాదాత్మ్యము చెప్పినప్పుడు పరమాత్మకు హేయత్వము చెప్పినట్లు కాదా అని కదా మరొక ప్రశ్న. ఛత్రీ దేవదత్తః అంటే ఛత్రము తో నున్న

దేవదత్తుడు అంటే ఆ ఛత్రము చిరిగి ఉంటే దేవదత్తునికి చిరుగు వర్తించదు కదా. ఈ శరీర/ ప్రకృతి దోషములు త్రిగుణములవలన, కర్మ వలన సంభవిస్తాయి. పరబ్రహ్మ వీటికి అతీతుడు కదా!

అంతేకాక వేరు వేరు శరీరాలలో జీవుళ్ళందరూ వేరు వేరుగా ఉంటారు, లేకపోతే ఒక్కొక్కళ్ళూ ఒక్కొక్క సారి పుట్టడం, మరణించడం, వారి వారి కర్మ ఫలాలు వేరుగా ఉండడం కుదరదు కదా. అలాంటప్పుడు ఈ జీవుళ్ళందరూ ఒక్కటే అని అది బ్రహ్మ అని చెప్పడం కుదరదు.

జీవుల జన్మాదులు జీవుల కర్మ నిమిత్తమైనా కారణము పరబ్రహ్మే. జీవుడు కాదు. వృత్తి కారులైన భగవద్బోధాయనులు "సర్వమ్ ఖల్విదం సర్వాత్మా బ్రహ్మేశః" అని సర్వాత్మగా తెలుపబడినవాడు పరబ్రహ్మ అని చెప్పేరు.

నాన్నగారు: మఱి మనోమయ, ప్రాణ శరీర అన్న ఱెండు పదాలూ ఇబ్బంది పెడతాయే, అవి పరమాత్మకు వర్తించవుగా.

మామయ్య: అర్థం సమంగా చేసుకుంటే హాయిగా వర్తిస్తాయి. ఇక్కడ "మనోమయ" అంటే "మనసాగ్రాహ్యః" అని అర్థము. అంటే మనస్సుతో తెలియబడేవాడు అని.

నాన్నగారు: వాఙ్మనస్సులకు అందనివాడు పరబ్రహ్మ అనికదా!

మామయ్య: "నమో నమో వాఙ్మనసాతి భూమయే నమో నమో వాఙ్మనసైక భూమయే" అని కదా! అంటే విశుద్ధంగా, నిర్మలంగా ఉన్న మనస్సు వలన తెలియబడతాడన్న మాట.

నేను: విశుద్ధమైన మనస్సు అని ఎక్కడ చెప్పేరు

**మామయ్య:** నీళ్ళు తీసుకురా సాపాటు చేద్దాం అంటే స్నానాలగదిలో కుండీనుండి తేవు కదా! అక్కడ నీళ్ళు అంటే శుభ్రమైన నీళ్ళు అనే. అంతకుముందు శాంత ఉపాసీత అని చెప్పి అటువంటి శాంతముగా ఉపాసిస్తే విశుద్ధమైన మనస్సుతో తెలియబడతాడని చెబుతున్నారన్న మాట. దానికోసం ఇంతకుముందే వివేక, విమోకాది సాధనసప్తకము కావాలి అంటూ వివరించేరు కదా!

**నాన్నగారు:** మఱి ప్రాణశరీరుడు అంటేనో

**మామయ్య:** ప్రాణమునకు ఆధారభూతుడైన వాడని నియామకుడని అర్థము.

మరికొన్ని ఉపనిషద్వాక్యాలు చూడు.

"మనోమయః ప్రాణ శరీరనేతా"

"స ఏష అంతర్హృదయ ఆకాశః తస్మిన్నయమ్ పురుషః మనోమయః అమృతో హిరణ్మయః"

"హృదా మనీషా మనసః అభిక్లుప్తః య ఏవమ్ విదురమృతాస్తే భవంతి"(ముండకోపనిషత్)

"మనసాతు విశుద్ధేన"

"ప్రాణస్య ప్రాణః"(కేనోపనిషత్)

"అథ ఖలు ప్రాణ ఏవ ప్రజ్ఞాత్మేదమ్ శరీరమ్ పరిగృహ్యోత్థాపయతి"(కౌషీతకీ ఉపనిషత్ )

ఇలా అనేక ఉపనిషత్తులు పరబ్రహ్మ విశుద్ధమనో గ్రాహ్యుడనీ, ప్రాణమునకు ఆధారభూతుడనీ చెబుతున్నాయి.

"ఏషమ ఆత్మా అంతర్హృదయే ఏతత్ బ్రహ్మ"(ఛాందోగ్యోపనిషత్ ) అనగా నాయొక్క ఆత్మ నా హృదయముననుండువాడు  అగుటచే బ్రహ్మ. అని బ్రహ్మ శబ్దము ముఖ్యార్థమును ఇస్తోంది.

లేక పోతే తరువాత వాక్యాలలో

"...బ్రహ్మ తమితః ప్రేత్య అభిసంభవిత అస్మి" అని నేను బ్రహ్మను పొందెదను అని అంటే పొందే జీవాత్మ, పొందబడే పరబ్రహ్మ వేరుగా ఉండాలి, ఉపాసించేవాడు, ఉపాసింపబడే వాడు లాగే పొందేవాడు, పొందబడేది వేరే కదా!

నేను పరబ్రహ్మ యొక్క ఉపాసన చేస్తాను అంటే ఉదాహరణకు నేను నా వాహనము నడుపుతాను అన్నట్లు, ఈ సందర్భంలో నేను, నావాహనము ఒకటి ఎలా కావో, నేను, పరబ్రహ్మ ఒక్కటి కాలేవు.

అందుకే భగవద్గీతలో

"సర్వభూతానామ్ హృద్దేశే అర్జున తిష్ఠతి" అన్న విషయమే ఇక్కడా చెప్పబడుతోంది.

ముండకోపనిషత్ లో "అణోరణీయాన్ మహతో మహీయాన్" అని చెప్పినట్లు ఆ పరబ్రహ్మనే అత్యంత స్వల్పమైనదిగా, అత్యంత బృహత్పరిమాణము కలదానిగా వర్ణిస్తున్నారు ఇక్కడ. ఈ వర్ణనము జీవాత్మకు వర్తించదు.

నాన్నగారు: "సత్య సంకల్పత్వము", "భారూపము" లాంటి గుణాలు వర్తిస్తానుకో పరబ్రహ్మకు. కాని అవాప్త సమస్త కాముడైన పరబ్రహ్మను "సర్వకామ" అని ఎలాగంటాము.

మామయ్య: అక్కడ సర్వకామ అంటే అందరి (మంచి) కోఱకు కోరువాడు అని అర్థము. నిరంతరము అలుపెరుగని కృషీవలుడిలా తనపంట తన చేతికి ఎప్పుడొస్తుందా అని కోరుకుంటూ ఈ లీలావిభూతి ఒడ్డున పాము మీద పడుక్కొని వేచి చూస్తూ ఎవ్వడైనా తనని పిలుస్తాడేమోనని కోరుకొనేవాడేకదా ఆ పరమాత్మ శ్రీమన్నారాయణుడు.

అంతేకాదు ఇక్కడ కామ్యంత ఇతి కామాః అనే అర్థం వలన కామ అనే పదానికి గుణములను అర్థము తీసుకొంటే పరమాత్మ సమస్త కళ్యాణ గుణాలు కలవాడని కూడా అర్థము.

మరియొక అర్థము "పరిశుద్ధములైన భోగ్య, భోగోపకరణాదులు కలిగినవాడు పరమాత్మ." అని కూడ.

**నేను:** ఇందాకా బ్రహ్మ శబ్దము జీవాత్మకు చెందుతుందని పూర్వ పక్షము లో చెప్పేరు. బ్రహ్మ అనికాక పరబ్రహ్మ అని ఉంటే సంశయానికి అవకాశము ఉండేది కాదు. కాని ఇక్కడ పరబ్రహ్మ అని లేదు కదా! అందుకే ...

**మామయ్య:** నిజమే. నువ్వు మీ అమ్మ ను ఏమని పిలుస్తావు?

**నేను:** అమ్మా అనే పిలుస్తాను.

**మామయ్య:** మీ ఇంటి ప్రక్కావిడ వచ్చేరనుకో. అప్పుడు ఆవిడని కూర్చోమని చెప్పడానికి ఎలా పిలుస్తావు?

**నేను:** కూర్చోండమ్మా అంటాను

**మామయ్య:** ఆవిడనూ అమ్మా అనే అంటున్నావు ఎందుకని.

**నేను:** అమ్మ లాగే పెద్దావిడ అని గౌరవం కోసం

**మామయ్య:** అంటే అమ్మ లో కొన్ని గుణాలు ఉన్నాయని గౌరవ వాచకంగా ఆవిడనీ అమ్మా అని పిలుస్తున్నావు అన్న మాట. సంశయం లేకుండా ఉండడానికి అలాంటప్పుడు మీ అమ్మని నన్ను కన్న అమ్మా అనో మిగిలిన ఆడువారి కంటె వేరయిన అమ్మా అనో పిలవచ్చు కదా!

**నేను:** బాగుంది మామయ్యా! అమ్మ అంటే అమ్మే కదా, దానిలో సంశయం ఎందుకుంటుంది.

**మామయ్య:** అలాగే బ్రహ్మ అంటే పరబ్రహ్మే. అందులోనూ సంశయం అక్కరలేదు.

నీకు పాలు కావాలనుకో. అమ్మను ఎలా అడుగుతావు.

**నేను:** పాలియ్యమ్మా అని అడుగుతాను.

**మామయ్య:** తెల్లని పాలియ్యి అని అడుగవా, సంశయం లేకుండా!

**నేను:** పాలు తెల్లగానే కదా ఉంటాయి. మళ్ళీ తెల్లని పాలియ్యి అంటే ఎవ్వరైనా నవ్వుతారు.

**మామయ్య:** కదా! అంటే వ్యర్థ విశేషణము దోషమన్నమాట. మఱి అలాంటప్పుడు వ్యుత్పత్తి ప్రకారము బృహతి, బృంహయతి అని బ్రహ్మ శబ్దానికి అర్థం చెప్పుకున్నాము కదా, అలాగే రూఢి అర్థము కూడా పరబ్రహ్మనే చెబుతుంది. "తజ్జలాన్" అని సృష్టి, స్థితి, లయాలకు కారణభూతుడని అంతకుముందే చెబుతున్నప్పుడు ఆయన పరబ్రహ్మ కాక మరెవడవుతాడు. అసలు మనము ఈ విషయం ప్రారంభించినదే "బ్రహ్మ జిజ్ఞాసా" అని. ఇంకా ఇందులో నీకు సందేహానికి తావు ఎక్కడుంది?

**నేను:** కాదు మామయ్యా, ఇదే శాండిల్య విద్యలో మరొక చోట "ఏష మ ఆత్మా అంతర్హృదయే" అని వస్తోంది, అంటే ఆత్మ అన్నప్పుడు అక్కడ జీవాత్మ కదా,

**మామయ్య:** తరువాత సూత్రాలలో ఇంకా వివరంగా చెబుతారనుకో. కాని అక్కడ శాండిల్య మహర్షి "అది నా యొక్క ఆత్మ" అంటున్నప్పుడు "నాయొక్క" అంటే ఎవరియొక్క?

నేను: శాండిల్య మహర్షి యొక్క అంటే శాండిల్య మహర్షి జీవాత్మ యొక్క

మామయ్య: అంటే జీవాత్మ యొక్క ఆత్మ పరమాత్మే కదా!

అంతేకాక "ఆత్మా అరే ద్రష్టవ్యః ....", "ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీత్", "తత్సత్యమ్ స ఆత్మా ", "ఆత్మానమ్ ఏవ లోకముపాసీత" ఇలా ఎన్నో చోట్ల ఆత్మ అంటే పరబ్రహ్మ అనే శ్రుతులు చెబుతున్నాయి. వ్యుత్పత్తి ప్రకారం కూడా "ఆప్నోతి ఇతి ఆత్మా" అంటే అంతట వ్యాపించి యున్నవాడు పరమాత్మే.

నాన్నగారు: మొదట్లో సర్వమ్ ఖలు "ఇదమ్" అని వాడేరు, ఇక్కడ "ఏష" మ ఆత్మా అని వాడేరు. ఎందువలన!

మామయ్య: సంస్కృతం లో దగ్గరగా ఉండి కనపడే వస్తువులు చెప్పడానికి "ఇదమ్" అంటారు. ఈ చుట్టూరా ఉన్న జగత్తు అని చెప్పడానికి ఇదమ్ అని వాడేరు. దగ్గరగా లేకపోయినా కనపడేదానిని ఉద్దేశించడానికి "ఏష" అని అంటారు, ఆదిత్య హృదయంలో "ఏష సుప్తేషు జాగర్తి", ఏష బ్రహ్మా" అన్నట్లు. అక్కడ అగస్త్యుడు రామునికి ఆదిత్యుని గురించి చెప్పినప్పుడు ఆదిత్యుడు దగ్గరగా లేకపోయినా కనబడుతున్నాడు. అందువలన "ఏష" అన్నారు. అలాగే ఇక్కడ కూడా దగ్గరగా లేకపోయినా పరబ్రహ్మను శాండిల్య మహర్షి మానసిక సాక్షాత్కారము చేసికొని చెబుతున్నాడన్నమాట, శాంతుడై విశుద్ధమనస్కుడై జగతసృష్ట్యాదులకు కారణమైన పరబ్రహ్మను సమస్త కళ్యాణగుణ సంఘాతునిగా ఉపాసించినవాడు పరబ్రహ్మను పొందుతాడు అని.

ఇంకా మన లాంటి వాళ్ళకు సంశయాలు వస్తూంటయని, ఇందులో ఏమి సందియమూ లేదు, ఇది నిశ్చయము అని చెబుతున్నారు శాండిల్య మహర్షి అని భగవద్రామానుజులు వివరించేరు.

**నేను:** మఱి తరువాత సూత్రాలలో ఇంకా బాగా వివరించేరన్నారు, వాటిలో ఏమిటి చెప్పేరు?

ఇక్కడ పుంలింగము, నపుంసక లింగము అంటే అర్థం చేసుకోవాలి. సంస్కృతములో ఈ లింగాలు శబ్దాలకు తప్ప ఆ శబ్దం ప్రతిపాదించే అర్థానికి మనం సామాన్యంగా వాడుకొనే లింగ శబ్ద అర్థం వర్తించదు.

కళత్రమ్ అన్నది నపుంసక లింగము, దారా అన్నది పుంలింగము, భార్యా అన్నది స్త్రీలింగము. కాని అర్థం ఒక్కటే.

కవులు చమత్కారంగా కొంచెం పురుష ప్రవృత్తి చూపించ వససినప్పుడు పుంలింగము( హనుమంతుడు పరదారాన్ మహాప్రాజ్ఞ నోపరోద్ధుమ్ త్వమ్ అర్హసి అంటాడు. కొంచెం భయపెట్టడానికి రావణుడితో), స్త్రీ మర్యాద కావలసినప్పుడు స్త్రీ లింగాన్ని ...ఇలా వాడుతారనుకోండి. (రామస్య దయితా భార్యా అన్నట్లు)

ఎవరైనా భర్త తన భార్యను పరిచయం చేస్తూ నా కళత్రమండీ అంటే అందులో అంతరార్థము ఉండవచ్చును, ఆలంకారికంగా.

ఏతావతా, పరబ్రహ్మ నపుంసక లింగమంటే మరొక రకంగా అర్థం చేసుకొన వలదని మనవి.

**మామయ్య:** తరువాత సూత్రాలన్నీ మనము ఇప్పుడు చెప్పుకున్నదానికి వివరణే. "స్థూణానిఖనన న్యాయంగా"

నేను: అంటే

**మామయ్య:** ఒక రాట పాతేవనుకో. మళ్ళీ దాని చుట్టూ మట్టి దట్టించి గట్టిగా ప్రతిష్ఠంచబడి ఉందో లేదోనని కదిపి చూస్తాము కదా, ముఖ్యంగా నేల గట్టిగా లేనప్పుడు. బాదరాయణులూ, భగవద్రామానుజులూ వారు

అనుగ్రహించింది పూర్తిగా నాటుకోడానికి మఱి కొన్ని సూత్రాలనూ వాటి వివరణలనూ అనుగ్రహించేరన్న మాట. మన బుర్రలలో మట్టి గట్టిగా ఉండదని వారికి తెలుసును కాబోలు

**అమ్మ:** తరువాత సూత్రము ఏమిటి మామయ్యా!

**మామయ్య:**

## వివక్షిత గుణోపపత్తేశ్చ.....1-2-2

అంటే

వివక్షిత: చెప్పబడిన(చెప్పబడు)

గుణ: గుణములు(పరమాత్మ యందు ఉండుట యనెడు)

ఉపపత్తేఃచ: కారణము వలన

(అట్టివాడు పరమాత్మయే)

అనగా

చెప్పబడిన(చెప్పబడు) గుణములు పరమాత్మయందు ఉండుట వలన అట్టి వాడు పరమాత్మయే (జీవాత్మ కాదు).

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** పై ఉపనిషద్వాక్యాలలో చెప్పబడ్డ గుణాలు పరమాత్మకు ఉండడమే సంభవము అని అంటున్నారు.

"మనోమయః, ప్రాణ శరీరః, భారూపః, సత్య సంకల్పః, ఆకాశ ఆత్మా, సర్వ కర్మా, సర్వకామః, సర్వగంధః, సర్వరసః, సర్వమిదమభ్యాత్తః, అవాకీ, అనాదరః" అని చెప్పబడిన గుణాలన్న మాట.

**అమ్మ:** ఒక్కొక్కటీ వివరించండి మామయ్యా, సులభంగా అర్థం అవుతుంది.

**మామయ్య:** ఇంతకు ముందు మనం అనుకున్నవేనమ్మా!

మనోమయః: పరిశుద్ధమైన మనస్సు చేతనే గ్రహింపదగినవాడు. వివేక, విమోకాది సాధన సంపత్తి చేత ఉపకరించబడిన ఉపాసనము వలన నిర్మలముగా చేయబడిన మనస్సుచేత గ్రహింపబడు చున్న వాడు పరబ్రహ్మ.

అనగా పరబ్రహ్మ హేయగుణ విరుద్ధములైన కళ్యాణ గుణాకరుడు అవడం వలన సకలేతర విలక్షణుడని తెలుస్తోంది, మలినమైన మనస్సు హేయ పదార్థములను, నిర్మలమైన మనస్సు నిర్మలమైన దానిని గ్రహిస్తుంది కదా.

ప్రాణ శరీరః: జగత్తునందలి సకల ప్రాణములకు ధారకుడని అర్థము. అనగా ఎవనికి ప్రాణము శరీరముగను, ఆధేయముగను, విధేయముగను, శేషభూతముగను ఉంటుందో అట్టి వాడు ప్రాణ శరీరుడు అన్న మాట.

భారూపః: భాస్వరమగు అనగా ప్రకాశమానమగు రూపము గలవాడు. ప్రకృతి సంబంధము లేనిదియు, కళ్యాణమగు దివ్య శరీరము కలవాడగుటచే నిరతిశయ దీప్తియుక్తుడని అర్థము. నమ్మాళ్వారు అలాగే కదా వర్ణిస్తారు.

సత్యసంకల్పః: తిరుగులేని సంకల్పము కలవాడు. ఆయన సంకల్పితము ఎల్లప్పుడూ సత్యమే

ఆకాశాత్మా: ఆకాశము వలెనే సూక్ష్మమును, స్వచ్ఛమును అయిన స్వరూపము కలవాడు.

వ్యుత్పత్తిని బట్టి అర్థము చెప్పుకుంటే తాను స్వయముగా ప్రకాశించుచు ఇతరములను ప్రకాశింపచేయువాడు

సర్వకర్మా: "క్రియత ఇతి కర్మ" అనగా చేయబడునది కర్మ. అనగా ఈ సర్వమూ ఎవని చే చేయబడినదో, సృజించబడినదో అతడు సర్వకర్మా.

సర్వకామః: దీనికి అర్థము ఇంతకుముందే చెప్పుకున్నాము. అందులో ఒక అర్థము పరిశుద్ధములును, సర్వ విధములును అయిన భోగ్య, భోగోపకరణాదులు కలవాడు

సర్వ గంధః సర్వ రసః: అప్రాకృతికములు, దోషరహితములు, నిరతిశయములు, కళ్యాణములు అయిన దివ్య గంధములును, రసములును కలవాడు.

సర్వమిదమభ్యాత్తః: రసపర్యంతము చెప్పబడిన కళ్యాణ గుణ సమూహమునంతను స్వీకరించు  వాడు

అవాకీ అనాదరః: అవాకీ అనగా మాటలాడని వాడు, అనాదరః అంటే ఎవరి పట్ల ఆదరము చూపని వాడు. అవాప్త సమస్త కాముడగుట వలన ఆదరింప వలసినదేమియు లేనివాడు. పరిపూర్ణ మైన ఐశ్వర్యము కలవాడగుటచే బ్రహ్మాది స్తంబ పర్యంతము సమస్త జగత్తునూ తృణీకరించ గలవాడు, భగవద్గీతలో "న మే ద్వేష్యోస్తి న ప్రియః" అని చెప్పినట్లు ఆయనకు ప్రియులు, ద్వేషులు లేకపోవడం అవాప్త సమస్తకాముడవడం వలన అందరి పట్ల ఆయన అవాకి గాను, అనాదరుడు గాను ఉంటాడు.

ఈ రకంగా పైన చెప్పిన గుణాలు పరబ్రహ్మ కు మాత్రమే ఉండుట సంభవము.

అమ్మ: బాగుంది మామయ్యా,  ఇంతకుముందు చెప్పినదానికి మరి కొంచెం వివరణ మీరన్నట్లు  మాలాంటి వాళ్ళకు. తరువాతి సూత్రమో!

మామయ్య: ముందు ఇక్కడ చెప్పబడినది పరబ్రహ్మ అని చెప్పిన తరువాత చెప్పబడినది జీవాత్మ కాదు అని మళ్ళీ ప్రతిపాదిస్తున్నారు. ఇలా ప్రతిపాదించడాన్ని నిషేధ ముఖంగా అని అంటారు.

## "అనుపపత్తేస్తు న శారీరః......1-2-3"

అనుపపత్తేః తు: (ఇక్కడ చెప్పబడిన గుణములు) కుదరక పోవడం వలన

శారీరః జీవాత్మ

న: (ఇక్కడ చెప్పబడ) లేదు

శ్రుతి యందు చెప్పబడిన జీవుని యందుండుట అసంభవమగుటచే ఇచట చెప్పబడిన వాడు జీవాత్మ కాదు.

**అమ్మ:** శారీరః అంటే జీవాత్మా! అంటే శరీరం ఉన్నవాడన్నమాట. మరి పరబ్రహ్మకు కూడా శరీరం ఉంటుంది అంటాము కదా! కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** ఇక్కడ శారీరః అంటే జీవాత్మే. కర్మ సంబంధితమైన శరీరము జీవాత్మకే కదా! పరబ్రహ్మకు కర్మ సంబంధం లేదు, "న మామ్ కర్మాణి లింపంతి" అని కదా భగవద్గీత. "అజాయమానః " అంటుంది శ్రుతి. జీవాత్మకు కర్మల వలన వాటి ఫలాలను అనుభవించడానికి తగిన శరీరము లభిస్తూంటుంది. దానివలన పరిమితులు ఏర్పడతాయి. త్రిగుణావలంబిత ప్రవృత్తి కలిగి దుఃఖ భాజనమైన జీవనములో ఉంటాడు. అట్టి వారికి ఈ గుణాలు ఉండడానికి అవకాశములేదు.

నేను: మఱి ముక్తాత్మలకో!

**మామయ్య:** "తజ్జలాన్" అన్నారు కదా, సృష్ట్యాదులు పరబ్రహ్మ పరమే, నిత్యాత్మలకు, ముక్తాత్మలకు కూడా ఆ అధికారము లేదు. అందువలన బద్ధాత్మలకు గాని, ముక్తాత్మలకు, నిత్యాత్మలకు గాని ఈ గుణాలు వర్తించవు.

**నేను:** ఇందాకా అవాకీ, అనాదరః అంటే అవాప్త సమస్త కాముడు, నిష్పక్షపాత వ్యవహార శీలుడు కనుక మాటలాడుట గాని, ఆదరము చూపించుటగాని ఆయనకు వర్తించవు అన్నారు కదా, కాని ఆయన భక్తుల విషయంలో ఆయన ఆదరాభిమానాలు చూపించడా! అసలు మాటా, మంచీ లేనివాడన్న కంటె నఞ్ తత్పురుషానికి "తత్సాదృశ్యమ్ తదల్పతా" అని కూడా అర్థాలున్నాయి కనుక సాధారణంగా మాటా, ఆదరణ లేని వాడు కాని తన భక్తుల వద్ద మాటా, ఆదరణ ఉంటాయని చెప్పుకోవచ్చా?

మామయ్య: భగవద్రామానుజులు ఇక్కడ ఆ విధంగా చెప్పలేదు. అందువలన అలా ఈ సందర్భములో చెప్పుకొనలేము. అయినా ప్రతి బ్రహ్మవిద్య పరబ్రహ్మ యొక్క అన్ని కోణాల వివరణ చెయ్యాలని లేదు. సూర్యుని లో ఉన్నట్లు ధ్యానించు అంటే పరబ్రహ్మ మరెక్కడా ఉండడని కాదు. ఋషులు ద్రష్టలు. తాము తమ సాధనతో ప్రయత్నించి, సాధించి దర్శించిన విధానాన్ని మనకందించేరు. ఇక్కడ శాండిల్య మహర్షి తాను సాక్షాత్కరింపచేసుకున్న విధి విధానాన్ని మనకు చెబుతున్నారు.

"న మే ద్వేష్యోఽస్తి న ప్రియః" అని భగవానుడే చెప్పుకున్నాడు కదా. అందువలన ఈ విషయమై పెద్ద గాబరా అక్కరలేదు.

ఇక, దీనిలో వర్ణించ బడిన గుణాలతో పరబ్రహ్మ పరిమితుడవుతాడని అనుకోకూడదు. పరబ్రహ్మను సంపూర్ణంగా వర్ణించి చెప్పడం శ్రుతులకు కూడా చేతకాదని మనము ఇంతకుముందు అనుకున్నాము కదా. పరబ్రహ్మ యొక్క ఒక్కొక్క కోణాన్ని ఒక్కొక్క బ్రహ్మ విద్య ఆవిష్కరించవచ్చు.

ఇంక పరబ్రహ్మ నిజంగా ఆశ్రిత పక్షపాతియా, స్తోత్రప్రియుడై తనను స్తుతి చేసిన వాళ్ళ దగ్గర మంచి మాటా, ఆదరాలతో ఉంటాడా, ఇలా ఉండడం సరియేనా .... అన్నది ఇంకా లోతుగా అర్థం చేసుకోవలసిన విషయము. ఇది ఈ సందర్భంలో కుదరదు కనుక తరువాత ఎప్పుడైనా చూద్దాము.

**అమ్మ:** తరువాత సూత్రం ఏమిటి మామయ్యా!

మామయ్య:

"కర్మ కర్తృ వ్యపదేశాత్ చ....1-2-4

అంటే

కర్మ : (పరమాత్మ యను) కర్మ అనగా ప్రాప్యము కంటె

కర్తృ: (జీవాత్మ యను) కర్త అనగా ప్రాప్త

వ్యపదేశాత్ చ: వేరుగా చెప్పబడి యుండుట వలన కూడ

అనగా

పరబ్రహ్మ పొందబడు వానిగను, జీవాత్మ పొందెడు వానిగను శ్రుతి యందు చెప్పబడి యుండుటచేత కూడ పరబ్రహ్మ జీవాత్మ కంటె వేరయిన వాడని తెలియుచున్నది.

**అమ్మ**: అర్థమయినట్లే ఉంది, కాని కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య**: పై శ్రుతి వాక్యాలలో "ఏతమితః ప్రేత్యాభి సంభవితాస్మి" అనగా శాండిల్య మహర్షి (అను జీవాత్మ) తాను ఈ లోకమునుండి పైకి పోయి పరబ్రహ్మను పొందుతాను అని అంటున్నాడు. అంటే జీవాత్మ వేరు పరబ్రహ్మ వేరు కావాలి కదా. నేను పుస్తకమును కొనుక్కొని పొందుతాను అంటే నేను వేరు పుస్తకము వేరు కావాలి కదా, అలాగే ఉపాసించే వాడు ఉపాసించ బడునది ఈ రెండూ వేరే కదా!

**అమ్మ**: తరువాత సూత్రమేమిటి మామయ్యా!

మామయ్య:

# "శబ్ద విశేషాత్....1-2-5"

అంటే

శబ్ద విశేషాత్: శబ్ద విశేషము వలన

అనగా

పై శ్రుతి వాక్యములో జీవాత్మకు పరబ్రహ్మకు వాడబడిన శబ్దముల విభక్తి ప్రత్యయములు వేరు అవడము వలన ఉపాస్యుడైన పరబ్రహ్మ ప్రథమా విభక్తిలో చెప్పబడుట చేత పరబ్రహ్మయే ఉపాస్యుడని తెలుస్తోంది

**అమ్మ**: కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య**: మనం ఇంతకుముందు చెప్పుకున్నదే.

పై శ్రుతి వాక్యంలో "ఏష మ ఆత్మా అంతర్హృదయే" అని ఉంది. అంటే నా యొక్క హృదయమున నుండు ఆత్మ అదే పరబ్రహ్మ అన్నప్పుడు నా అన్నప్పుడు జీవాత్మకు షష్ఠీ విభక్తి వాడబడి యుంది. ఆత్మా అన్న శబ్దానికి ప్రథమా విభక్తి వాడబడింది. సంస్కృతములో రెండు శబ్దాలు ఒక్కటే పదార్థాన్ని గురించి చెబితే వాటికి విభక్తి ఒక్కటే ఉండాలి. "లోహితాక్షః దేవదత్తః " అన్నట్లు . ఇక్కడ అలా లేదు.

మరొక వాక్యం చూడు. "వ్రీహిః వా ....అంతరాత్మని పురుషః హిరణ్మయః యథా జ్యోతిః అధూమమ్"

అని ధాన్యపు గింజంత......సూక్ష్మమగు జీవాత్మ యందు హిరణ్మయ పురుషుడు పొగలేని జ్యోతిస్సుగా ఉన్నాడు అన్నప్పుడు కూడా జీవాత్మ శబ్దానికి సప్తమీవిభక్తి, పరబ్రహ్మ శబ్దానికి ప్రథమా విభక్తి ఉపయోగించేరు. భగవద్గీతలో కూడా "సర్వస్యాహమ్ హృది సన్నివిష్టః" , "ఈశ్వరః సర్వభూతానామ్

భ్రామయన్ హృద్దేశే అర్జున తిష్ఠతి" అని చాలా చోట్ల కూడా ఇలాగే ఉంటుంది. అందువలన పరబ్రహ్మ యే ఉపాస్య వస్తువు, జీవ విలక్షణుడు.

**అమ్మ:** అర్థమయింది. తరువాత సూత్రము

**మామయ్య:**

## "స్మృతేః చ.....1-2-6"

అంటే

స్మృతేః చ: స్మృతి వాక్యములనుండి కూడ (ఇట్లే తెలియుచున్నది)

అనగా

స్మృతి వాక్యములనుండి కూడా ఈ విధముగనే తెలియుచున్నది

**అమ్మ:** మఱి కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** ఇందాకల్లా అనుకున్నట్లు "సర్వస్యాహమ్ .." అంటే ఓ అర్జునా! నేను ప్రతివాని యొక్క హృదయమునందు ఉన్నవాడను. నా వలననే స్మరణమును, జ్ఞానమును, ఊహాయు కలుగు చున్నది.

"యః మామ్ ఏవమ్ అసంమూఢః జానాతి పురుషోత్తమమ్"

ఓ అర్జునా! ఎవ్వడు భ్రాంతి లేనివాడై నన్ను ఇట్లు పురుషోత్తమునిగా తెలుసుకొను చున్నాడో

"ఈశ్వరః సర్వ భూతానామ్...తమేవ శరణమ్ గచ్ఛ"

ఈశ్వరుడు సమస్త జంతువుల హృదయమున నున్న వాడై శరీరమనబడు యంత్రమున నువ్వ వానిని అనగా జీవుని సత్త్వ, రజ, స్తమో గుణాల మూలముగా భ్రమింప చేయుచున్నాడు. కావున వానినే శరణు గొనుము.

పైన ఉదాహరించిన భగవద్గీత వాక్యాలలో జీవుని ఉపాసకునిగాను, ప్రాప్త గాను, పరబ్రహ్మను ఉపాస్యునిగాను, ప్రాప్యము గాను తెలియజేయబడుతోంది.

**అమ్మ:** అర్థమయింది, తరువాత సూత్రములో ఏం చెబుతున్నారు?

మామయ్య:

## "అర్భకౌకస్త్వాత్ తత్ వ్యపదేశాత్ చ న ఇతిచేత్ నిచాయ్యత్వేన వ్యోమవత్ చ...1-2-7"

అంటే

అర్భకౌకస్త్వాత్ : (ఇచట చెప్పబడిన పురుషుడు) అల్ప స్థానము కలవాడుగ చెప్పబడుటచేత

తత్ వ్యపదేశాత్ చ: (బహు స్వల్ప పరిమాణము కలవాడుగ) చెప్పబడుట చేతనూ

న: (అతడు పరబ్రహ్మ) కాడు

ఇతి చేత్ : ఇట్లు అన్నచో

న: అట్లు సరికాదు

ఏవమ్: ఇట్లు

నిచాయ్యత్వేన: ఉపాస్యుడుగా చెప్పబడినందున(ఏలనన)

వ్యోమవత్ చ: ఆకాశమువలె (అపరిచ్ఛిన్నుడుగా చెప్పబడుచున్నాడు).

అనగా

పై వాక్యములలో వ్రీహి వంటి పరిమాణము కల వాడనియు, మనోమయుడనియు ఇట్లు వాడబడిన విశేషణములవలన అల్ప స్థానము కలవాడు, అణుపరిమాణము కలవాడు అగుట వలన అతడు పరబ్రహ్మ కాడు అని చెప్పినచో అది సరికాదు. ఏలననగా "జ్యాయానంతరిక్షాత్.." మొదలైన వివరణలతో పరబ్రహ్మ యొక్క అపరిచ్ఛిన్నత, బృహత్వము శ్రుతులయందు తెలియబడుతోంది.

**నేను:** పరబ్రహ్మ ను "సర్వగతమ్ సుసూక్ష్మమ్ తదవ్యయమ్ యద్భూతయోనిమ్ పరిపశ్యంతి ధీరాః" అంటే "ఏది సమస్త భూతములకును కారణమైనదో దానిని అంతట ఉండు దానినిగను, బుద్ధి సూక్ష్మము చే తెలుయదగిన దానినిగను, నాశ రహితమైన దానినిగను జ్ఞానులు చూచుచున్నారు" అని కదా శ్రుతులు చెబుతాయి. పరబ్రహ్మ ధాన్యపు గింజ కంటే చిన్నది అంటే అంతట ఉండునది అని ఎలా సరిపోతుంది. అది బ్రహ్మ శబ్దానికే సరిపోదు కదా! ఎలా కుదురుతుంది.

**మామయ్య:** అలా కాదు. నువ్వు ఊహించ లేనంత బృహత్పరిమాణము కలది బ్రహ్మ అంటే దానిని ఎలా ఊహిస్తావు, ధ్యానిస్తావు. ఇక్కడ శాండిల్య మహర్షి ఎలా ధ్యానించాలో చెబుతున్నారు. అందుకోసం అంటే ఉపాసనా సౌలభ్యం కోసం పరబ్రహ్మ ఇక్కడ బహు స్వల్ప పరిమాణము కలవానిగా ధాన్యపు గింజలా అని అలాంటి ఉదాహరణలతో చెప్పబడు చున్నాడు. కాని మనలాంటి వారికి సంశయం రాకూడదని వెంటనే ఆయన బృహత్తత్త్వము చెప్పడానికి భూమి కంటెను, ఆకాశము కంటెను, ద్యులోకము కంటెను సమస్త లోకముల కంటెనుగొప్పవాడని కూడా చెబుతున్నారు కదా.

బృహత్త్వము, అణుత్వము అన్నీ ఉన్నవాడు పరబ్రహ్మ.

"అణోరణీయాన్ మహతో మహీయాన్" అని కదా కఠోపనిషత్ చెబుతుంది. ఇదే విషయాన్ని శ్వేతాశ్వతర ఉపనిషత్, తైత్తిరీయోపనిషత్తు కూడా చెబుతాయి. అంటే అతి స్వల్పమైన వాటి కంటె స్వల్పమైన వాడు. "అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య" అన్నట్లు అత్యంత స్వల్ప పరిమాణముగల జీవునిలో ప్రవేశించుట వలన ఆయన స్వల్పత్వము "పాదోస్య విశ్వా భూతాని.." అన్నట్లు ఈ సమస్త విశ్వము ఆయనకు ఒక పాద భాగము మాత్రమేనన్నందున ఆయన బృహత్త్వము తెలుస్తుంది. జీవునకు బృహత్త్వము కుదరదు కదా. ఈ రకమైన గుణములు పరబ్రహ్మకే సాధ్యము.

**అమ్మ:** తరువాత సూత్రములో ఏం చెప్పేరు మామయ్యా!

## మామయ్య:

## "సంభోగ ప్రాప్తిః ఇతి చేత్ న వైశేష్యాత్....1-2-8"

అంటే

సంభోగ ప్రాప్తిః: సుఖ దుఃఖానుభవము కలుగును(శరీరము కలిగి యుండుటవలన)

ఇతి చేత్: ఇట్లు అనినచో

న: సరికాదు

వైశేష్యాత్: (ఆ శరీరము కలుగు) హేతువున భేదముండుట వలన

అనగా

జీవుని వలె పరబ్రహ్మకు కూడ శరీరముండుట వలన సుఖ దుఃఖానుభవము పరబ్రహ్మకు కూడ కలుగుననుట అయుక్తము. ఎందుకంటే ఆ శరీరము కలుగుటకు కారణము జీవాత్మ, పరమాత్మలకు వేరు గా ఉంటుంది.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** జీవాత్మ శరీరము కర్మ వలన లభించినది, ఆయా కర్మ ఫలానుభవానికి తగినట్లు ఆ (సుర, నర, తిర్యక్, స్థావర) శరీరము జీవాత్మకు ఉంటుంది. పరబ్రహ్మ శరీరము నిత్యవిభూతియందు పంచోపనిషణ్మయమైన దివ్య శరీరము. కర్మ సంబంధము లేనిది.

లీలా విభూతి లో కూడా "న మే కర్మాణి లింపంతి" అనియు "అజోపిసన్ అవ్యయాత్మా భూతానామ్ ఈశ్వరోపిసన్ ...సంభవామి ఆత్మ మాయయా" అని , "యదా యదాహి ధర్మస్య గ్లానిః భవతి....తదాత్మానమ్ సృజామ్యహమ్ " అని భగవద్గీతలో భగవానుడే తనకు కర్మలు అంటవని, తాను జన్మరహితుడినైనా తన సంకల్పముచే ధర్మ సంస్థాపనకోసం తానే జన్మిస్తానని చెప్పుకున్నాడు. త్రిగుణాతీతుడు, అపహత పాప్ముడు అయిన పరబ్రహ్మకు కర్మ ఫలములు కాని, సుఖ దుఃఖములు కాని ఉండవు. "తయోరన్యః పిప్పలమ్ స్వాద్వత్తి అనశ్నన్ అన్యః అభిచాకశీతి" అని ముండకోపనిషత్ లో చెప్పినట్లు (ఒకే కొమ్మపైనున్న ఆత్మ, పరమాత్మ అను పక్షులలో ఆత్మ కర్మ ఫలములనుభవించుచున్నది. పరమాత్మ ఫలములననుభవించక ప్రకాశించు చున్నది) కర్మఫలములు అనుభవించునది జీవాత్మయే, పరమాత్మ కాదు.

ఇందువలన శరీరము కలుగుటకు కల కారణము జీవాత్మకు, పరమాత్మకు వేరుగానుండును. అందుచే కర్మ సంబంధిత సుఖదుఃఖానుభవములు జీవాత్మకు మాత్రమే.

పరమాత్మ అపహత పాప్ముడే.

అన్న విషయం ఈ సూత్రంలో మళ్ళీ వివరించేరు భగవద్రామానుజులు.

నాన్నగారు: దీనితో ఎనిమిదో సూత్రం కూడా ఈ ప్రకరణంలో పూర్తయిందన్నమాట.

శాండిల్య విద్య కు సంబంధించిన శ్రుతి  వాక్యాలకు క్లుప్తంగా భగవద్రామానుజుల వివరణ నాకర్థమైనది చెబుతాను సమంగా ఉందో లేదో చెప్పు.

1. అంతా పరబ్రహ్మ నుండే పుట్టి, పరబ్రహ్మ వలననే జీవించి, అందే ప్రవేశించును. సర్వమూ పరబ్రహ్మాత్మకము. అట్టి పరబ్రహ్మను జీవాత్మ శాంతుడై ఉపాసించవలెను.

2. అట్లు ఉపాసించిన వారికి ఆయా ఉపాసనల కనుగుణముగ ఫలము కలుగును.

3. పరబ్రహ్మను మనోమయుడు, ప్రాణ శరీరుడు, భారూపుడు, సత్య సంకల్పుడు, ఆకాశాత్మ, సర్వ కర్ముడు, సర్వగంధుడు, సర్వరసుడు, రస పర్యంతము చెప్పబడిన కళ్యాణ గుణ సమూహమునంతను స్వీకరించు వాడు, అవాకి, అనాదరుడు అను నట్లు జీవ విశిష్టుడైన వాని స్వరూప గుణములు తెలియవలెను.

4. ఆ పరబ్రహ్మ ఉపాసనా సౌలభ్యమునకు అత్యంత స్వల్ప పరిమాణము కలవాడై యున్ననూ అతడే సమస్త లోకముల కంటే గొప్ప వాడయి బృహత్పరిమాణము కూడ కలిగి యుండును.

5. అట్టి పరబ్రహ్మ మనలను ఉజ్జీవింప చేయుటకై పరమ కారుణ్యము వలన మన అంతర్హృదయమున మనకత్యంత సమీపమున నుండును.

6. అట్టి పరబ్రహ్మను ఉపాసన చేయుట వలననే ఫలితము కలుగును.

7. ఇట్లు ఉపాసన చేయువానికి ఫలము కలుగుననుటలో సంశయము లేదు

అని శాండిల్య మహర్షి చెప్పేడు. అలా ఇక్కడ ఉపాస్యునిగా చెప్పబడినది పరబ్రహ్మ తప్ప జీవాత్మ కాదు.

అంతేనా బావా!

**నేను:** ఈ మాటు నేను ఈ ప్రకరణంలో సూత్రాల సింహావలోకనం చేస్తాను, సరి చూడండి మామయ్యా!

శాండిల్య విద్యలో చెప్పబడిన జగత్కారణత్వము, మనోమయత్వము మొదలైన గుణాలు ఉపనిషత్తులలో అంతా పరబ్రహ్మకే చెప్పబడడం వలన, ఈ శ్రుతి వాక్యాలలో చెప్పబడిన గుణాలు కూడా పరబ్రహ్మకు మాత్రమే వర్తించడం వలన, అట్టి గుణాలు జీవాత్మకు ఉండడమనేది కుదరక పోవడం వలన, పరబ్రహ్మ ప్రాప్యము, జీవాత్మ ప్రాప్త అవడం చేత అవి రెండు ఒక్కటి అవడం అయుక్తము అవడం కనుక, ఈ వాక్యాలలో జీవాత్మకు సంబంధించిన పదాలకు, పరబ్రహ్మకు సంబంధించిన పదాలకు విభక్తులు వేరుగా ఉండడం చేత, స్మృతుల చేత కూడ జీవుడు ఉపాసకుడు గాను, పరబ్రహ్మ ఉపాస్యము గాను తెలియబడడం వలన, ఉపాసనా సౌలభ్యము కొఱకు పరబ్రహ్మను స్వల్ప పరిమాణునిగా వర్ణించినప్పటికీ, ఆయన బృహత్పరిమాణము కూడా ఆయా శ్రుతి వాక్యాలే చెప్పడం వలన ఆ గుణాలు జీవాత్మకు సరిపోవు కనుక, జీవాత్మ వలె పరబ్రహ్మ శరీరము కర్మ సంబంధితమైనది కాకపోవడం చేత కర్మఫలాలైన సుఖ దుఃఖాలు పరబ్రహ్మకు వర్తించకుండుట వలన ఈ శాండిల్య విద్యలో నిస్సంశమైన ఫల సిద్ధి కోసం ఉపాస్యునిగా చెప్పబడినది పరబ్రహ్మయే, జీవుడు కాదు అని ఈ ప్రకరణ సూత్రాల సారాంశము.

**మామయ్య:** బాగా చెప్పేరు తండ్రీ, కొడుకూను.

నువ్వేవమ్మా, కొంచెం పని తొందర మీద ఉన్నట్లు కనిపిస్తోంది. సూత్రాలు చెప్పుకుంటున్నప్పుడు తొందర చేసేవు ఈరోజు. ఇంట్లో పనులేమయినా ఉండి పోయినాయా!

**అమ్మ:** అవును మామయ్యా! ఊరగాయల పనులు ఉన్నాయి. ఈరోజు ముక్కలు ఊర్చి, ఎండవేసి వచ్చేము. సాయంత్రం వర్షం పడకుండా వెళ్ళి తీసి పెట్టుకోవాలి. మీకు తెలుసు కదా, పిల్లల మాట సరే సరి, మా వారికి కూడా ఊరగాయ లేనిదే సాపాటు అవదు.

**మామయ్య:** మీ ఆయనకే కాదమ్మా, పరమాత్మ కేనా సాపాటు లోకి ఊరగాయ తప్పదు మరి.

**అమ్మ:** అదేమిటి మామయ్యా, సరదాగా అంటున్నారా, పరమాత్మేమిటి, ఊరగాయేమిటి?

**మామయ్య:** లేదమ్మా, నిజమే చెబుతున్నాను. మనము తరువాత అదికరణంలో చదువుకోనేది కూడా పరమాత్మ ఊరగాయతో సాపాటు ఎలా చేస్తాడో అనే.

**నేను:** భలే ఉందే, ఉపనిషత్ భాష్యానికీ ఊరగాయకూ లంకె. అదేమిటి చెప్పండి మామయ్యా!

**మామయ్య:** ఇప్పటికే మీ అమ్మ ఎండపెట్టిన ఊరగాయ గురించి ఖంగారు పడుతోంది. శ్రీభాష్యం, శ్రీనివాసుడూ నిత్యులు కదా ఎప్పుడూ ఉండేదే, ఉండే వాడే. ఊరగాయలు ఇప్పుడు కాకపోతే ఏడాదంతా ఇబ్బంది.

అందువలన శ్రీభాష్యం విషయం మళ్ళీమాటు చూద్దాంలే.

**అమ్మ:** ఈ ఊరగాయల పనులు అయిపోయిన తరువాత వస్తాము మామయ్యా, అంత వరకూ సెలవియ్యండి.

**మామయ్య:** తప్పకుండానమ్మా, మీకే కాదు, ఊరగాయల పనులు మా ఇంట్లోనూ తప్పదు. ఆ తరువాతే కలుద్దాము.

అందరూ: "యో నిత్యమచ్యుత పదాంబుజ యుగ్మ రుక్మ.....

---

## 2. అత్రధికరణమ్:

**మామయ్య**: రండమ్మా, అయినాయా ఊరగాయల పనులు.

**అమ్మ**: అయినాయి మామయ్యా, నిన్నే ఊరగాయలు ముంచడం అయినది.

**నేను**: మామయ్యా! దాసోహమ్. మీరు గతవారం పరబ్రహ్మ సాపాటు చేయడం, ఊరగాయ తినడం అని అంటూ మధ్యలో వదిలి వేసేరు. అంతకు ముందు సూత్రంలో పరబ్రహ్మ శరీరము కర్మ సంబంధితమైనది కాదు, ఆయనకు మనలా కర్మలు, సుఖదుఃఖానుభవములు ఉండవు అన్నారు, మఱి అంతలో ఊరగాయ, సాపాటు అంటున్నారు. అవి కర్మలు కాదా, అసలు అర్థం కాకుండా ఉంది.

**మామయ్య**: అది అర్థం కావాలంటే ముందు కఠోపనిషత్ గురించి కొంచెం తెలుసుకోవాలి. ఎప్పుడైనా విన్నావా, కఠోపనిషత్ గురించి?

**నేను**: "భక్తి నివేదన" లో బొమ్మలతో కఠోపనిషత్ కథ వచ్చింది ఒకసారి. అది చదివేను. నచికేతుడూ, యముడి దగ్గరకు వెళ్ళడం, యముడాయనకు వరాలియ్యడం అదీ.

**మామయ్య**: ఆ కథే.

**అమ్మ**: వాడి మాటలు అలా ఉంచి మీరు వివరంగా చెప్పండి మామయ్యా!

**మామయ్య**: కఠోపనిషత్ కృష్ణ యజుర్వేదానికి సంబంధించినదమ్మా!

వాజశ్రవసుడని ఒక ముని విశ్వజిత్ అను యాగమును చేస్తూ ఋత్విక్కులకు పాలీయని గోవులను దానమిచ్చేడుట. అతని కుమారుడు నచికేతుడు. తండ్రికి హితము కలుగవలెనను బుద్ధితో "నన్నెవరికి దానమిత్తువని" రెండు, మూడు సార్లు విసుగు కలుగునట్లు ప్రశ్నింప సాగేడుట. విసుగెత్తిన వాజశ్రవసుడు "నిన్ను మృత్యువుకు ఇస్తాను" అన్నాడుట. నచికేతుడు తండ్రి మాట వమ్ము కాకుండా తనంత తానే యమ లోకమునకు వెళ్ళేడుట. ఆ సమయంలో యముడు అక్కడ లేక పోవడం వలన యమునికోసం ఉపవాసము చేస్తూ మూడు రోజులు అక్కడే ప్రతీక్షించేడు నచికేతుడు. యముడు వచ్చిన తరువాత నచికేతుడిని సత్కరించి మూడు రోజులు ఉపవాసము తో నున్నందున మూడు వరాలు ఇస్తానని చెప్పేడుట. అంతట నచికేతుడు

1. తన తండ్రికి తనపై కోపము పోయి యథా పూర్వముగా శాంతి పొందవలెనని

2. స్వర్గప్రాప్తి సాధనమైన అగ్ని విద్య తెలిసి కొన వలెనని,

3. మోక్ష స్వరూపమును తెలుసుకొన వలెనని( అనగా ప్రకృతి బంధ విముక్తుడై జీవుడు ఏ సద్గతిని పొందునో అట్టి స్థితి వివరాలు)

కోరేడుట.

యముడు మొదటి రెండు వరాలు ఇవ్వడానికి ఒప్పుకున్నా, మూడవ వరానికి మాత్రం అది గుహ్యాతి గుహ్యమవడం వలన మరేవయినా ఐశ్వర్యాదులు కోరుకొమ్మని అన్నాడుట. కాని నచికేతుడు దేనికీ ఒప్పుకోకపోవడం వలన చివరకు మోక్ష స్వరూపాన్ని వివరించేడుట. మనము ఇప్పుడు చెప్పుకొన బోయే అధికరణము దీనిని "అత్త్రధికరణము" అని అంటారు. కఠోపనిషత్ లో కొన్ని వాక్యాలను వివరిస్తూ ఈ అధికరణంలో సూత్రాలుంటాయి.

**అమ్మ:** ఏమిటి మామయ్యా ఆ వాక్యాలు?

**మామయ్య:** కఠోపనిషత్ చాలా ముఖ్యమైన ఉపనిషత్ లలో ఒకటి అమ్మా! ఇందులో ఎన్నో ముఖ్యమైన మంత్రాలు ఉన్నాయి. వీటిలో కొన్ని మంత్రాలు కొంచెం మార్పులతో భగవద్గీతలో కూడా కనబడతాయి. అసలు కఠోపనిషత్ ఒక్కటే వేఱుగా ఎప్పుడైనా చెప్పుకోవాలి, అంత ముఖ్యమైనది అన్న మాట. మనము ఇప్పుడు దానిలో మన అధికరణానికి సంబంధించిన మంత్రాలు మాత్రం క్లుప్తంగా చూద్దాం.

ముందుగా నచికేతుడు అడిగిన మూడవ వరము చూద్దాము.

యేయమ్ ప్రేతే విచికిత్సా మనుష్యే

అస్తీతి ఏకే నాయమస్తీతి చ ఏకే

ఏతత్ విద్యామ్ అనుశిష్టః త్వయాహమ్

వరాణామ్ ఏష వరః తృతీయః

అంటే

స్థూల సూక్ష్మ రూప శరీరమును విడచి పోయిన ముక్తుడైన మనుష్యుని గురించి కొందరు ఆ ముక్త పురుషుడు కలడనియు మఱి కొందరు అతడు లేడనియు దేనిగురించి విరుద్ధాభిప్రాయములతో విశ్లేషించుకొను చుందురో ఆ ముక్త పురుషునికి లభించు ఆ మోక్ష తత్త్వమును తెలుసుకొను వాడను. ఇదియే నా మూడవ వరము.

దీనికి సమాధానముగా యముడు

తమ్ దుర్దర్శమ్ గూఢమ్ అనుప్రవిష్టమ్

గుహాహితమ్ గహ్వరేష్ఠమ్ పురాణమ్

అధ్యాత్మ యోగాధిగమేన దేవమ్

మత్వాధీరో హర్షశోకౌ జహాతి.

ఏతత్ శ్రుత్వా సంపరిగృహ్యా మర్త్యః

ప్రవృహ్యా ధర్మ్యమ్ అణుమేతమ్ ఆప్య

స మోదతే మోదనీయమ్ హి లబ్ధ్వా

వివృతమ్ సద్మ నచికేతసమ్ మన్యే

అనగా

దర్శించుటకు సాధ్యము కానివాడును, అజ్ఞానమను ఆవరణము చేత కప్పబడిన వాడును, సమస్త ప్రాణులలో వ్యాపించి యున్నవాడును, అణుమాత్రమైన జీవునిలో కూడ అంతర్యామిగా నున్నవాడును, అనాది సిద్ధుడును అగు పరబ్రహ్మను మనోనిగ్రహ పూర్వకమగు ఆత్మజ్ఞానమనబడు జ్ఞానయోగము చేత ధ్యానించి సమర్థుడగు ఉపాసకుడు సంతోషమును, దుఃఖమును వదలిపెట్టును.

ఈ తత్త్వమును(గురుముఖతఃగా) విని తెలిసికొని విన్నదానిని అనేక పర్యాయములు మననము చేసుకొని ధర్మము నాచరించుటకు సాధనమైన శరీరమును పరిత్యజించి ప్రాకృత ఇంద్రియములతో తెలియరాని పరబ్రహ్మను పరమపదమను దివ్యలోకమున దర్శించుకొని ఉపాసకుడైన ఆ మానవుడు తనకు ప్రీతి పాత్రమైన గుణాష్టక విశిష్టమైన నిజ స్వరూపమును పొంది నిరతిశయానందమును అనుభవించును. నచికేతునకు పరబ్రహ్మమను భవనము ద్వారములు తెరువబడి ప్రవేశార్హత కలిగినట్లు తలంతును.

ఈ పై రెండు మంత్రాలు యముని తత్త్వోపదేశము సంగ్రహముగా తెలియ జేస్తాయి. తరువాత మంత్రాలు వీటి వివరణే అనుకోవాలి. అందులో మన అధికరణానికి అవసరమైనవి ఇప్పుడు చెప్పుకుందాము.

తరువాత ఆ మోక్ష స్థితి ఎలా కలుగుతుందో చెబుతున్నారు.

అణోరణీయాన్ మహతో మహీయాన్

ఆత్మా అస్య జంతోః నిహితో గుహాయామ్

తమ్ అక్రతుః పశ్యతి వీతశోకః

ధాతుః ప్రసాదాత్ మహిమానమాత్మనః

అణు పరిమాణము గల జీవుని కంటె మిక్కిలి సూక్ష్మమైన వాడు, విస్తృతమైన ఆకాశాదులకంటె అతి విస్తృతమైన వాడు, లోపల ప్రవేశించి శాసకుడునగు ఈశ్వరుడు ఈ జీవుని హృదయమను గుహయందు చేరి యున్నాడు. కామ్య కర్మలను త్యజించిన జీవుడు పరబ్రహ్మ అనుగ్రహము వలన తనకు మోక్షమును, గొప్పదనమును ఈయగల ఆ పరబ్రహ్మను ఎప్పుడు సాక్షాత్కరింప చేసుకొనునో అప్పుడు సంసార దుఃఖమునుండి విముక్తుడగును.

ఆసీనః దూరమ్ వ్రజతి శయానః యాతి సర్వతః

కః తమ్ మదామదమ్ దేవమ్ మదన్యః జ్ఞాతుమ్ అర్హతి

ఒకచోట కూర్చొని యున్నను అదే క్షణములో ఎంతో దూరము వెళ్ళగలడు. పడుక్కొని యున్ననూ అంతటనూ సంచరించగలడు. హర్షశోకములు రెంటికినీ అతీతుడైన ఆ పరబ్రహ్మను నాకంటే వేరుగా మరి ఎవరు తెలుసుకొన గలరు.

త్రిణాచి కేతః త్రిభిరేత్య సంధిమ్

త్రి కర్మకృత్ తరతి జన్మమృత్యూ

బ్రహ్మ జజ్ఞమ్ దేవమీడ్యమ్ విదిత్వా

నిచాయ్యే మామ్ శాంతిమ్ అత్యంతమ్ ఏతి

అనగా

నాచికేతాగ్ని విద్యా ప్రతిపాదకమగు అనువాక త్రయమును అభ్యసించినవాడు యజ్ఞ, అధ్యయన, దానములను మూడు కర్మలు చేయుచున్నవాడై త్రివిధాగ్నులచేత భగవదుపాసనతో సంబంధమును పొంది జన్మ మరణములను దాట గలుగును. పరబ్రహ్మ నుండి జన్మించి జ్ఞానవంతుడైన తనను బ్రహ్మాత్మకునిగా తెలిసికొని స్వస్వరూపమును సాక్షాత్కరించుకొని సంసార భయ నివృత్తిరూపము అగు శాంతిని పరిపూర్ణముగా పొందును.

అశరీరమ్ శరీరేషు అనవస్థేషు అవస్థితమ్

మహాంతమ్ విభుమ్ ఆత్మానమ్

మత్వా ధీరః న శోచతి

అనగా

శరీరరహితుడు, అస్థిరములైన శరీరములయందు నిత్యుడై యుండువాడు, గుణములను బట్టి సర్వోన్నతుడు, సర్వవ్యాపి యగు స్వరూపము గలవాడు అగు తన హృదయ గుహాలో నుండు పరబ్రహ్మను ఉపాసించి ఇంద్రియ నిగ్రహ శాలి యగు ఉపాసకుడు దుఃఖమును పొందదు.

నాయమ్ ఆత్మా ప్రవచనేన లబ్ధః

న మేధయా న బహునా శ్రుతేన

యమ్ ఏవ ఏష వృణుతే తేన లభ్యః

తస్యైష ఆత్మా వివృణుతే తనూమ్ స్వామ్

అనగా

ఈ పరమాత్మ మననము చేత పొందబడడు. ఉపాసనచేత పొందబడడు. సాంగ్ వేదాంత శ్రవణము చేత పొందబడడు. ఈ పరమాత్మ ఎవనిని తనవద్దకు చేర్చుకొనవలెనని సంకల్పించునో అట్టివాని చేతనే పొందబడును. తనకు ఇష్టుడైన ఆ భక్తునికే ఈ పరమాత్మ తన దివ్యస్వరూపమును ప్రకటింపజేయును.

నా విరతో దుశ్చరితాత్ నాశాంతో నా సమాహితః

నాశాంత మానసోవాపి ప్రజ్ఞానేనైన మాప్నుయాత్

అనగా

పాప కార్యమునుండి మరలనివాడును, కామక్రోధముల ఉపశాంతి లేనివాడును, స్థిరమగు ఏకాగ్రత లేని మనస్సు కలవాడును, మనో నిగ్రహము లేనివాడును ఈ పరమాత్మను ఉపాసనము చేత పొందలేడు.

యస్య బ్రహ్మా క్షత్రమ్ చ ఉభే భవత ఓదనః

మృత్యుః అస్య ఉపసేచనమ్ క ఇత్థావేద యత్ర సః

అనగా

ఏ పరమాత్మకు స్థావర జంగమ రూపమగు ఈ ప్రపంచమంతయు మహా ప్రళయమున ఆహారము వలె భుజింపదగినది యగునో, ఏ పరమాత్మకు ప్రాణులకు వినాశనమును ఇచ్చు మృత్యుదేవత కూడ ఇతర వినాశ సాధనమై తానుకూడ వ్యంజనము లేదా ఊరుగాయ వలె భుజింపబడునో అట్టి పరమాత్మ ఏ విధములగు ప్రభావము కలిగి యుండునో ఎవడెరుంగును.

ఋతమ్ పిబంతౌ సుకృతస్య లోకే

గుహామ్ ప్రవిష్టౌ పరమే పరార్థ్యే

ఛాయాతపౌ బ్రహ్మవిదః వదంతి

పంచాగ్నయః యేచ త్రిణాచికేతాః

అనగా

(పరబ్రహ్మ స్వరూప, స్వభావములు తెలియ నలవి కాదని ఇంతకు ముందు మంత్రముల వలన నిస్పృహ చెందరాదని తెలుపుటకై) ఎవరైతే పంచాగ్ని విద్యా నిష్ఠులో నాచికేత బ్రాహ్మణమును పఠించిన వారో అట్టి బ్రహ్మ వేత్తలు జీవ పరబ్రహ్మల గూర్చి తెలిసి కర్మ ఫలముననుభవించు చుందురనియు, పుణ్యమునకు ఫలమైన ఈ లోకమున ఉందురనియు, హృదయమను గుహలో చేరి (జీవ, పరబ్రహ్మలు) యున్నారనియు, ఉత్కృష్టమైన హృదయగతమైన దహరాకాశమున ఉందురనియు చెప్పెదరు.

యః సేతురీజానానామ్ అక్షరమ్ బ్రహ్మ యత్పరమ్

అభయమ్ తితీర్షతామ్ పారమ్ నాచికేతమ్ శకేమహి

అనగా

యజ్ఞములనాచరించు యజమానులకు ఏ పరమాత్మ ఫలప్రదుడై ఆధారమగుచున్నాడో, నిర్వికారమైన పరబ్రహ్మ అని ఎవడు వ్యవహరింపబడుచున్నాడో సంసారమును దాటగోరువారికి ఎవడు నిర్భయమైన ఆవలి ఒడ్డు అగుచున్నాడో, నాచికేతాగ్ని విద్యచే పొందబడు ఆ పరమాత్మను మనము గూడ ఉపాసింప గలము.

విజ్ఞాన సారథిః యః తు మనః ప్రగ్రహవాన్నరః

సః అధ్వనః పారమ్ ఆప్నోతి తద్విష్ణోః పరమమ్ పదమ్

అనగా

ఏ మానవుడైతే అధ్యవసాయ జ్ఞానమును సారథిగా కలవాడై మనస్సనబడు కళ్ళెమును కలవాడై యుండునో, అతడు సంసారమునకు ఆవలనుండు శ్రీమహా విష్ణువునకు ఉత్తమ నివాస స్థానమైన ఆ పరమపదమును పొందగలడు.

ఈ విధముగా పరబ్రహ్మ తత్త్వాన్నీ, దానిని పొందే విధానాన్ని, పొందుట వలన ఫలాన్నీ వివరిస్తుంది కఠోపనిషత్తు.

నేను ఇక్కడ మనకు ఇప్పుడు అధికరణానికి ముఖ్యము కావలసిన మంత్రాలను వాటి సంగ్రహ తాత్పర్యాలనూ మాత్రమే చెప్పేను. మిగతా వివరాలు అవసరమయినంత సూత్రాలు చదువు కుంటున్నప్పుడు చూద్దాం.

నేను: మీరు చెప్పిన తాత్పర్యాలలో చాలా చోట్ల సందేహాలున్నాయి. కాని మీరు సూత్రాలు చెప్పినప్పుడు ఇంకా వివరిస్తానన్నారు కదా, అప్పటికీ సందేహాలు తీరకపోతే అప్పుడు అడుగుతాను.

మామయ్య: తప్పకుండా. సందేహాలు వస్తేనే విషయం ఒంటబట్టేది. ఇంక ఈ అధికరణంలో సూత్రాలలోకి వెళదామా!

**అమ్మ:** అలాగే మామయ్యా, ఈ అధికరణంలో ఎన్ని సూత్రాలున్నాయి

**మామయ్య:** నాలుగు సూత్రాలమ్మా,

ఇందాకా రామం అన్నట్లు పరమాత్మ అంటే కర్మ లేని వాడు కదా, అందుచేత ఈ కఠోపనిషత్ లో "యస్య బ్రహ్మ చ క్షత్రమ్ చ ఉభే భవత ఓదనః..." అనగా "ఈ చరాచర రూపమగు ప్రపంచము ఎవరికి భుజింప దగినది అగునో" అనినప్పుడు "ఇక్కడ చెప్పబడుతున్నది జీవాత్మ కాదా" అన్న ప్రశ్నకు జీవాత్మ కాదు పరమాత్మయే అనే సమాధానాన్ని ఈ సూత్రాలు చెబుతాయి. అందులో మొదటి సూత్రము

## "అత్తా చరాచర గ్రహణాత్....1-2-9

అంటే

అత్తా: భోక్తగా(చెప్పబడిన వాడు)

చరాచర గ్రహణాత్: స్థావర జంగమ పదార్థములను (భుజించునని చెప్పుట చేత పరమాత్మయే)

అనగా

కఠోపనిషత్ లో "ఉభే భవత ఓదనః" అని స్థావర జంగమముల భోక్తగా చెప్పబడినందున అట్టివాడు పరమాత్మయే.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** మనం ఇందాకా అనుకున్నట్లు "యస్య బ్రహ్మ చ క్షత్రమ్ చ ....." అన్న మంత్రము వివరించబడుతోంది. ...

**నేను:** "బ్రహ్మ చ క్షత్రమ్ చ" అంటే మీరు చరాచరములన్నీ అని ఎలా చెబుతున్నారు. బ్రాహ్మణ, క్షత్రియులు అని కాదా అక్కడ అర్థము.

**మామయ్య:** మీ విద్యాశాల వార్షికోత్సవము నాడు మీ విద్యాశాల అధ్యక్షులు మిమ్ములను ఉద్దేశించి విద్యార్థులారా అంటే అంటే అక్కడున్న విద్య కావలసిన మగ పిల్లలనా, లేక అక్కడున్న విద్యార్థినులు, విద్యాశాల ఉద్యోగులు, మిగిలిన వాళ్ళు అందరు కూడా అని అర్థమా!

**నేను:** అందరూ అనే!

**మామయ్య:** అలాగే అన్నం అంతా ఉడికిందో లేదో చూడడానికి ఱెండు మెతుకులు చూస్తాము. ఆ ఱెండు మెతుకులు మొత్తం అన్నానికి ప్రాతినిధ్యము అన్నమాట. అలాగే మొత్తం చరాచర జగత్తుకంతా ప్రాతినిధ్యంగా బ్రహ్మ, క్షత్ర అని వాడేరు. మనం సందర్భాన్ని బట్టి మొత్తం చరాచర జగత్తు అనే తీసుకోవాలి. ప్రళయ సమయంలో బ్రాహ్మణ, క్షత్రియులు మాత్రము లయము చెంది మిగిలిన దంతా అలాగే ఉండదు కదా.

**నేను:** పరమాత్మ కర్మ రహితుడు కదా, మఱి కర్మ మూలంగానే కదా భోక్త అవడం కుదురుతుంది. మఱి పరమాత్మ అని ఎలా చెప్పడం.

**మామయ్య:** ఇక్కడ చెప్పబడిన భోక్తృత్వము కర్మ మూలకమైనది కాదు. "జన్మాద్యస్య యతః " అని చెప్పబడిన పరబ్రహ్మ కారణ తత్త్వాన్ని ఇక్కడ చెబుతున్నారు. "సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్" అన్నప్పుడు కూడా అదే అర్థం. అగ్ర అంటే మొదలు, చివర కూడా అని అనుకోవచ్చు కదా. అంటే లయ కార్యము నిర్వహించేవాడు, తరువాత మిగిలి ఉండేవాడు ఆయనే కదా. అంటే పరబ్రహ్మ సంహర్తృత్వము వివరిస్తూ ఆయన మృత్యు దేవతను ఊరగాయ వంటి వ్యంజన పదార్థము వలె ఈ సమస్త జగత్సంహారానికి వాడుకొని,

చివరకు ఆ మృత్యు దేవతను కూడా తానే వ్యంజన పదార్థమును వలె భుజించు చున్నాడని ఆ మంత్రమునకు అర్థము. ప్రళయానంతరము మృత్యు దేవత కూడా ఉండడు కదా, ఆయనా భుజింప బడుతాడు.

**నేను:** "మృత్యు దేవత ఊరగాయలా" అంటే సమంగా అర్థం కాలేదు.

**మామయ్య:** మనం భోజనంలో అన్నం, పప్పు అవీ తినడానికి సౌకర్యం కోసం ఊరగాయ నంచుకుంటాం. అంటే ఆ ఊరగాయ ఆయా పదార్థాలు మనచే భజింప చేయబడడానికి సహకారి అన్న మాట. ఎప్పటి దాకా, ఆయా పదార్థాలు తినబడే దాకా. తరువాత ఆ ఊరగాయను నోట్లో వేసేసుకుంటాము. ఇక్కడ మృత్యుదేవత పాత్ర కూడా అంతే. మిగిలిన ప్రపంచము భుజింపబడడానికి సహాయ కారి, తరువాత తానూ పరమాత్మ చేత భుజింప బడేదే.

**నేను:** బాగుంది ఊరగాయ దృష్టాంతం. అయితే ఇక్కడ భోక్త పరమాత్మే నంటారు.

**మామయ్య:** లేక పోతే తరువాత మంత్రములో "యస్తు మనః ప్రగ్రహవాన్నరః సః అధ్వనః పారమ్ ఆప్నోతి తద్విష్ణోః పరమమ్ పదమ్" అని మనస్సునకు కళ్ళెము వేసి నిగ్రహముతో అధ్యవసాయ జ్ఞానము కల నరుడు విష్ణువు యొక్క పరమ పదమును పొందును అని ఉన్నది కదా, అందు వలన పరమాత్మను, నరుడు అంటే జీవాత్మ పరమాత్మను పొందే విధానాన్ని, తత్ఫలాన్ని వివరిస్తున్నాడు యముడు నచికేతునకు ప్రశ్నకు మోక్ష తత్త్వాన్ని చెప్తూ. జగదుపసంహారము చేసేవాడు జగత్తునకు, దానిలోని చరాచరములకు భిన్నమైన వాడే కావాలి కదా. అందువలన జీవాత్మ కాలేడు, పరమాత్మే.

**నేను:** మనం విష్ణు సహస్రనామ స్తోత్రంలో చదివే "విశ్వ భుక్" అంటే విశ్వమును భుజించే వాడనే అర్థమా!

మామయ్య: "భుక్" అంటే పాలించేవాడని, భుజించేవాడనీ కూడా అర్థము. రెండూ పరమాత్మే కదా.

ఇప్పటి దేశపాలకులని "దేశభుక్" అన్నట్లు.

అమ్మ: నచికేతుడు "చని పోయిన తరువాత ముక్తుడైన మనుష్యుడు ఉంటాడని కొందరు, ఉండడని కొందరు అంటారు కదా, ఆ వివరాలు కావాలని" కదా అన్నాడు. అంటే ఈ ఉపనిషత్తు, ప్రకరణ సందర్భం జీవుడి గురించి కాదా!

మామయ్య: " ఏతత్ విద్యామ్"  అని కదా అంటే ఆ ముక్తునికి లభించు స్థితి, దాని తత్త్వము తెలుసుకోవాలని కదా నచికేతుని ప్రశ్న. తన తండ్రికి స్వర్గము లభించవలెనని, అతడు చేయు దక్షిణా దానములలో లోపములున్న అది సిద్ధించదని తెలిసిన నచికేతుడు తండ్రి చేత తననే దానమిచ్చునట్లు చేసికొనిన వాడు, ఆతనికి దేహాత్మ భేదము తెలియును. అందువలన అతడు అడిగేది ముక్తునిగా ఇహ లోక విముక్తి కొఱకే. అందుకే పరమాత్మ ప్రసక్తి. ఈ వివరం తెలుపడానికే తరువాతి సూత్రము.

అమ్మ: ఏమిటి మామయ్యా, ఆ సూత్రము?

మామయ్య:

"ప్రకరణాచ్ఛ............1-2-10

అంటే

ప్రకరణాత్: ప్రకరణము వలన

చ: కూడ (ఇట్లే తెలియుచున్నది).

అనగా

ఈ ప్రకరణము బట్టి కూడ ఇట్లే తెలియుచున్నది.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** ఇది పరబ్రహ్మను తెలిపెడి ప్రకరణము. ఎందుకంటే "మహాంతమ్ విభుమాత్మానమ్ మత్వా ధీరో నశోచతి" అనగా పరమాత్మ జ్ఞాన, బల, ఐశ్వర్య, వీర్య, శక్తి, తేజస్సు లనబడు షడ్గుణములు కలిగిన సర్వాధికుడు, సర్వవ్యాపి. అంతకు ముందు "అణోరణీయాన్ ..." అన్న మంత్రములో  భగవద్విభూతిని వివరించి, "ఆసీనోదూరమ్ ..." అను మంత్రములో ఉపాస్య భగవద్వైభవమును తెలిపి, ఈ మంత్రములో ఉపాసన స్వరూపాన్ని తెలుపుతున్నారు "నియమ పూర్వకముగా ప్రీతితో ధ్యానించి స్థిర చిత్తుడై యుండిన వానికి సంసార దుఃఖము కలుగదు, అంటే ముక్తుడై మఱి ఈ లోకంలోకి రాడు అన్నమాట. తరువాత మంత్రములో "నాయమాత్మా ప్రవచనేన లభ్యః...." అంటూ అలా ధ్యానం చేసినంత మాత్రాన పరమాత్మను పొందగలమా అంటే అలాకాదు "ఆయనకు ఎవడు ప్రీతి పాత్రమగునో వాడే అతనిని పొందగలడు" అని ఆయనను పొందుటకు ఆయన అనుగ్రహము అవసరము " అని చెప్పారు. తరువాత మంత్రములో పేటి వలన పరమాత్మను పొందలేమో చెబుతున్నారు "న అవిరతః దుశ్చరితాత్..." అంటూ. అంటే పాపప్రవృత్తి కలవాడు, కామావేశము, క్రోధావేశము అణచుకోలేనివాడు, చంచల మనస్కుడు, లౌకిక విషయాసక్తి గలవాడు పరమాత్మను పొందలేడు" అని.

తరువాత మంత్రములో బ్రహ్మ, క్షత్రియాది రూపమగు నాహారముచే మనుష్యుని సూచించి, దానిని లయము చేసుకొను వానిగా పరబ్రహ్మను అభివర్ణించేరు. తరువాత ఆ యనే లయ కారకుడు అని "యస్య బ్రహ్మ క్షత్రమ్ చ.." అన్న మంత్రంలో చెప్పేరు. ఈ విధంగా ఈ ప్రకరణం పరబ్రహ్మ తత్త్వాన్ని విశదీకరిస్తోందన్నమాట.

**నేను:** తరువాత వచ్చిన మంత్రం

"ఋతమ్ పిబంతౌ సుకృతస్య లోకే.." అన్న దానిలో "గుహామ్ ప్రవిష్ఠౌ" అన్నప్పుడు "వెలుగు, నీడల వలె పరస్పరము విలక్షణులై కర్మఫలమగు ఈ శరీరమున కర్మఫలముల ననుభవించుచున్నట్లు చెప్పబడినది, అక్కడ హృదయ గుహలో ఉన్నవారు బుద్ధి, జీవులో లేదా ప్రాణ జీవులో కాదా! ఎందుకంటే ఇక్కడ స్పష్టంగా "ఋతమ్ పిబంతౌ" అని ఆ ఇద్దరూ ఋతమ్ అంటే కర్మ ఫలాన్ని అనుభవించేవారని ఉంది. కాని పరమాత్మకు కర్మ ఫలానుభవము ఉండదు కదా!అలాగయితే బ్రహ్మ, క్షత్ర భక్షకుడు జీవుడే అని కదా చెప్పాలి?

**మామయ్య:** దానినే తరువాత సూత్రములో వివరిస్తున్నారు.

**అమ్మ:** ఏమిటి మామయ్యా ఆ సూత్రము?

**మామయ్య:**

## "గుహామ్ ప్రతిష్ఠావాత్మనౌ హి తద్దర్శనాత్......1-2-11"

అంటే

గుహామ్: హృదయగుహను

ప్రవిష్ఠౌ: ప్రవేశించినవారుగా చెప్పబడిన వారు

ఆత్మనౌ: జీవ, పరమాత్మలు

హి: కదా(ఏలనన)

తత్: అటులనే

దర్శనాత్: (శ్రుతియందు) కన్పడుటవలన

అనగా

హృదయమను గుహను ప్రవేశించిన వారుగా చెప్పబడినవారు జీవ, పరమాత్మలుగా శ్రుతి వలన తెలియు చున్నది.

ఈ శ్రుతి లో హృదయగుహాలో ప్రవేశించి యున్నట్లు చెప్పబడిన వారు జీవ, పరమాత్మలే. ఎందుకంటే అంతకు ముందు మంత్రమైన "తమ్ దుర్దర్శమ్ గూఢమ్ అను ప్రవిష్టమ్ గుహాహితమ్...." అన్న మంత్రములో "బాహ్యేంద్రియములతో దర్శింపజాలని, జీవాత్మతో బాటు అను ప్రవేశము చేసి జీవాత్మకు తెలియకుండా కూడి యున్నవాడు, ఇచ్ఛా, జ్ఞాన, ప్రయత్నాది వ్యాపారాలకు ఆధారభూతుడు, అనాది సనాతనుడు అయినవాడు అయిన పరమాత్మను ఉపాసించినచో ప్రాకృతమైన హర్ష, శోకాలు తొలగి శాశ్వతానంద స్థితి కలుగును" అని జీవాత్మ కూడి యున్నవాడు పరమాత్మయే అని వివరించేరు. ఇక్కడ మరొకలా చెప్పలేము కదా.

ఇంక పరమాత్మ కర్మ ఫలమును అనుభవిస్తున్నట్లు చెప్పబడినది, అది ఎలా అని కదా నీ సంశయము. మీ ఇంటికి బిచ్చగాడు వస్తే వాడికి మీ అమ్మ బట్ట ఇచ్చిందనుకో, ఆ బిచ్చగాడు బయటకు పోయి ఆ ఇంట్లో వాళ్ళు నాకు బట్ట ఇచ్చేరని చెప్పుకోడూ, శారీరకంగా మీ నాన్న ఇవ్వక పోయినా ఆ కర్తృత్వము మీ నాన్నకు కూడా చెప్పబడుతోంది. ఇక్కడా అలాగే.

ఎండ ఎక్కువగా ఉందని అందరూ గొడుగులు వేసుకొని రోడ్డు మీద వెళుతున్నారు, నువ్వు మాత్రం గొడుగు లేకుండా వెళుతున్నావు. అయినా చూసిన వాళ్ళు ఎవరైనా ఏమంటారు, రోడ్డుమీద అందరూ గొడుగులు వేసుకొని వెళుతున్నారని చెప్తారూ, నీ దగ్గర గొడుగు లేకపోయినా. ముండకోపనిషత్ లో "ద్వా సుపర్ణా...." అన్న మంత్రం తెలుసుకదా, అందులో స్పష్టంగా పరమాత్మ కర్మ ఫలాన్ని అనుభవించడని ఉన్నది కదా,

అందువలన ఇక్కడ పరమాత్మ కేవలం జీవాత్మ కర్మలకు అనుమితి, ప్రేరణ తప్ప తనకు కర్మానుభవము ఉండదు. దీనినే వేదాంత దేశికులు చక్కని దృష్టాంతముతో చెబుతారు.

**అమ్మ:** ఏమిటి మామయ్యా అది!

**మామయ్య:** బురదతో నిండిన దిగుబడి బావిలో అజ్ఞానము వలన కొడుకు కూరుకు పోయినాడట, వాడి మీద ప్రేమతో వాడిని ఉద్ధరించడానికని వాడి నాన్న కూడా ఆ బావిలో ప్రవేశించేడు. పరమాత్మ పరిస్థితి ఆ నాన్న లా అన్నమాట. ఇదే ఆ శ్లోకము.

"దహర కుహరే దేవః తిష్ఠన్  నిషద్వర దీర్ఘికా

నిపతిత నిజాపత్యాదిసావతీర్ణ పితృక్రమాత్...."

అంతేకాక "యా ప్రాణేన సంభవతి అతదిర్దేవతామయీ గుహామ్ ప్రవిశ్య తిష్ఠంతి యా భూతేభిః వ్యజాయత" అనగా "ప్రాణముతో నుండునది, ఇంద్రియాధీనమైన భోగములు కలది, హృదయపుండరీకమున నుండునది, కర్మ ఫలములననుభవించునది అయిన జీవాత్మ పృధివ్యాది భూతములతో కూడి దేవాది రూపముగా నానా విధములుగా పుట్టుచున్నది" అని కదా శ్రుతి వాక్యము.

అందువలన హృదయ గుహలో నుండునది జీవ, పరమాత్మలే. అందులో నొకడుగా కర్మ ఫలముననభవించువాడు, మఱియొకడు అనుభవింప చేయువాడు. ఆ రకంగా వారిరువురకూ కర్తృత్వము చెప్పుకొన వచ్చును.

**నేను:** అసలు నచికేతుడు అడిగినది చనిపోయిన తరువాత జీవాత్మ స్థితి ఉన్నట్లు కొంతమంది, లేనట్లు కొంతమంది అంటారు కదా, అసలు నిజము ఏమిటి అని కాదా, దానికి యముడు తిన్నగా సమాధానము ఈయకుండా పరమాత్మ, సాధన, ధ్యానము అంటూ మిగిలిన విషయాలన్నీ చెప్పేడా!

**మామయ్య:** ఈ సందేహము వివరించడానికే తరువాత సూత్రము

**అమ్మ:** ఏమిటి మామయ్యా ఆ సూత్రము?

**మామయ్య:**

## "విశేషణాత్ చ......1-2-12"

అంటే

విశేషణాత్: (జీవాత్మ, పరమాత్మలు) విశేషింపబడినట్లు (తెలుపుట వలన)

చ: కూడ

అనగా

శ్రుతులయందు జీవాత్మ, పరమాత్మలు విశేషింపబడినట్లు తెలియుట వలన కూడ అనగా ఒకడు భుజింపబడు వాడు, వేరొకడు భోక్త అని చెప్పుట వలన

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** మనము ఇంతకుముందు అనుకున్నట్లు "సర్వ వేదన" యను క్రతు సందర్భంలో దోష పూరితమైన దక్షిణ నీయ చూచిన తండ్రికి క్రతు ఫలము కలుగదని నచికేతుడు తానే యముని వద్దకు పోయి, తన తండ్రి కొఱకు మొదటి వరమును, తరువాత శరీరము కంటే వేరగు జీవుడు కలడనియు అతడు శరీరమును వీడిన తరువాత అనుభవించెడి ఫలసాధనమగు అగ్ని విద్యను రెండవ వరముగను కోరుకొనినాడు. మూడవ వరముగా మృతినొందిన తరువాత పొందబడు గతుల గురించి, ఉత్తమ గతికి

సాధనము గురించి అడిగేడు. నువ్వు ఇంతకు ముందు చదువుకొనే ఉంటావు, ఈ స్థితి, అదే మోక్ష స్థితి గురించి రకరకాల అభి ప్రాయాలున్నాయి.

**నేను:** ఏమిటవి మామయ్యా!

**మామయ్య:** మీరు ఇంతకుముందు విన్నవే. అయినా ఒకసారి గుర్తు చేస్తాను.

1. ఈ జీవాత్మ కేవలము జ్ఞానమాత్రము అని జీవాత్మ నశించుటయే మోక్షమని కొందరంటారు. దీనిలో యోగాచారులు ఉండేది కేవలము విజ్ఞానమే అదే మోక్షం అంటారు.

శాంకరాద్వైతులు అవిద్య పోవడం వలన జీవాత్మ బ్రహ్మగా అయిపోవడం మోక్షం అంటారు.

2. దుఃఖము పోవడమే మోక్షము అనేవారు వైశేషికులు. వీరిది కణాదుని అభిమతము. వీరి ప్రకారము దుఃఖములు 21 రకాలు. 6 ఇంద్రియాలు, 6 విషయాలు, 6 బుద్ధులు, శరీరము, సుఖము, దుఃఖము. అంటే సుఖము కూడా ఒక రకమైన దుఃఖమేనన్న మాట, ఎందుకంటే ఏ సుఖమైనా చివరకు దుఃఖంగా పరిణమిస్తుంది కదా, అంటే ఇలా దుఃఖాలన్నీ పోయి ఒక బండఱాయి లా అయిపోవడం మోక్షం వాళ్ళకు.

3. భాస్కర మతస్థులు ఉపాధి సంబంధముచేత జీవ భావము కల్గి, పిదప ఉపాధి పోయి బ్రహ్మ భావము కలుగుటయే మోక్షము అని చెబుతారు. ఇదీ మీరు ఇంతకుముందు విన్నదే.

అందువలన సంశయము కలిగిన నచికేతుడు మోక్ష స్వరూపమును వివరించమని కోరేడన్న మాట. దానికి సమాధానంగా అపహత పాప్ముడు, సకలేతర విలక్షణుడు, సృష్టి స్థితి లయ కారకుడు, అసంఖ్యేయ కళ్యాణ గుణాకరుడు, సర్వాత్మాంతర్యామి అయిన పరమాత్మ తత్త్వాన్ని, ఆ పరమాత్మకు శరీరమైన వాడు, అనాద్యవిద్యచే తిరోహిత స్వరూపుడు, పరమాత్మానుభవ పైకరసుడు, అయిన జీవుని గురించి చెప్పి అవిద్య పోవుటచే స్వాభావిక పరమాత్మానుభవము పొందుటయే మోక్షమని యముడు చెప్పేడు. దానికి సాధనము

ఏమనిన అది చాల దుర్లభము అని చెప్పి "తమ్ దుర్దర్శమ్" అని ప్రారంభంచి చివరకు "తద్విష్ణోః పరమమ్ పదమ్" అని ఆ విశేషాలను కూడా ఉపదేశించేడు.

యముడు ప్రారంభంలోనే "త్రిభిః సంధిమ్ ఏత్య తరతి జన్మ మృత్యూ బ్రహ్మ జజ్ఞమ్ దేవమ్ ఈడ్యమ్ విదిత్వా నిచాయ్యే మామ్ శాంతిమ్ అత్యంతమ్ ఏతి" అని "జీవుడు భగవదుపాసనతో సంబంధమును పొంది, తనను బ్రహ్మాత్మకునిగా తెలుసుకొని, జన్మ, మృత్యువులను దాటి సంసార భయ నివృత్తి రూపమైన శాంతిని పొందును" అంటూ ఉపాస్యముగా పరమాత్మను, ఉపాసకునిగా జీవాత్మను చెప్పేడు కదా. దానికోసం "విజ్ఞాన సారథిః యస్తు మనః ప్రగ్రహవాన్ నరః" అని "ఎవడు బుద్ధిని సారథిగా చేసుకొని, మనస్సును కళ్ళెముగా నిగ్రహించుకొనగలడో ఆ జీవుడు విష్ణువు యొక్క పరమపదమును పొందును" అని పరమాత్మను ప్రాప్యముగను, జీవాత్మను ప్రాప్తగను వారి శరీరి, శరీర భావాన్ని చెప్పేడు.

**నేను:** మఱి అలా మోక్షము రాని వాళ్ళ గురించి మృతులైన తరువాత స్థితి చెప్పలేదా యముడు?

**మామయ్య:** మృతి చెందిన తరువాత ఏమిటి అవుతుందన్న దానికి

"హంత త ఇదమ్ ప్రవక్ష్యామి గుహ్యమ్ బ్రహ్మ సనాతనమ్

యథా చ మరణమ్ ప్రాప్తే ఆత్మా భవతి గౌతమ

ఓ నచికేతుడా! అతి రహస్యమును, సనాతనమును అగు ఈ బ్రహ్మ తత్త్వమును గూర్చి ఈ జీవుడు మృతి చెందిన తరువాత ఎట్టి స్వరూపమును దాల్చగలడో దానిని చెప్పెదను.

యోనిమ్ అన్యే ప్రపద్యంతే శరీరత్వాయ దేహినః

స్థాణుమన్యే అనుసంయంతి యథాకర్మ యథాశ్రుతమ్

(మృతి చెందిన తరువాత) కొందరు  ప్రాణులు స్త్రీ గర్భ కోశమును పొందుదురు. మఱి కొందరు శిలా, వృక్షాది స్థావర రూపమును తమతమ పుణ్య పాప కర్మాను సారముగా తమ ఉపాసన జ్ఞానాను సారముగా పొందెదరు.

అని చెప్పేడు.

అంటే "మరణించిన ప్రాణులందరు మోక్షము పొందుతారని భావించరాదు. బ్రహ్మ జ్ఞాన హీనులు తమ తమ పుణ్య, పాప కర్మలననుసరించి పుణ్య వంతులు స్వర్గాది లోకాలను అనుభవించడానికి ధూమాది మార్గములో పోవుదురు. పాపులు నరక లోకమునకు యామ్య మార్గమున పోవుదురు. ఆ యా లోకములలో అనుభవముల పిదప వారి వారి కర్మల తారతమ్యమును బట్టి మానవ, పశు, పక్షి, కీటకాది జన్మలను పొందుటకు శుక్ర శోణితాది రూపమున స్త్రీ గర్భమున ప్రవేశించేవారు కొందరైతే, కొందరు జ్ఞాన శూన్యములైన శిలా, వృక్షాది స్థావర రూపాన్ని పొందుతారు" అని ఆఖరుకు చెప్పేడు. ఎందుకంటే ఇది సమాధానము పూర్తి చేయడానికి తప్ప నచికేతునకు నిజంగా కావలిసిన మోక్ష మార్గము తెలిపేది కాదు కదా!

ఏతావతా, ఇక్కడ మనకు విశేషంగా చెప్పబడిన జీవాత్మ, పరమాత్మల వివరాల వలన తెలియబడుతున్నది, ఈ శ్రుతిలో భోక్తగా చెప్పబడినది సమస్త జగత్తుయొక్క సృష్టి, స్థితి, లయ కారకుడు అయిన పరమాత్మయే.

**నేను:** ముక్తులు వెళ్ళేదారికి అర్చిరాది మార్గమని కదా అంటారు. ఇలా అర్చిరాది, ధూమాది, యామ్యాది కాకుండా మఱేమయినా మార్గాలు కూడా ఉన్నాయా, మరణించిన తరువాత.

**మామయ్య:** ఆ నాలుగో మార్గము జీవాత్మ ఇతర లోకాలలో పుణ్య, పాప కర్మానుభవము తరువాత వెనుకకు వచ్చే మార్గము. ఈ వివరాలు తరువాత పంచాగ్ని విద్య అని జీవాత్మ మళ్ళీ మర్త్యలోకమునకు ఐదు మజిలీలు చేస్తూ జన్మను పొందే విధానాన్ని చెప్పుకున్నప్పుడు చెప్పుకుందాము. అసలు యముడు అన్నట్లు మృతి చెందిన తరువాత ఏమిటవుతుందీ అన్నది చాలా గుహ్యమవడం వలన ఒక్క ఉపనిషత్ లో పూర్తిగా ఈ వివరాలు అన్నీ ఉండవు. ఉదాహరణకు యాజ్ఞ్యవల్క్య సంవాదములో జీవుడు జలగ లా మరణిస్తున్న

శరీరములో ఉంటూనే కొత్త యోని లోకి ప్రవేశించి తరువాత పాత శరీరము వదిలేస్తాడని ఉంటుంది. మఱి అలాగయితే ఈ చెప్పబడిన మార్గాలు ఏమిటి? ఇదంతా సదాచార్య సమాశ్రయణము వలన కాని తెలియదు.

అలాగే అర్చిరాది మార్గము గురించి కూడా ఆయా ఉపనిషత్తులలో కించిత్భేదాలు ఉంటూంటాయి. మనము శ్రీభాష్యము ఆఖరు అధ్యాయము చదువుకుంటే భగవద్రామానుజుల సమన్వయం వలన తెలుస్తుంది కొంతవరకూ. ఆయా సందర్భాలలో మనము కొన్ని విషయాలు  అయినా నేర్చుకొనే ప్రయత్నము చేద్దాము భగవద్రామానుజుల కృప, ఆచార్యానుగ్రహము మనమీద ఉండడాన్ని బట్టి.

అమ్మ: బాగుంది మామయ్యా, అంటే ఈ అధికరణంలో "కఠోపనిషత్ లో స్థావర, జంగములకన్నిటికి ఉప సంహారము చేయువాడు పరమాత్మ యని, ఆ ప్రకరణము మోక్ష సాధనమైన పరమాత్మ ఉపాసనము గురించి చెప్పడం వలననూ, హృదయ గుహలో జీవాత్మతో బాటు అను ప్రవేశము చేసి యుండు పరమాత్మ గురించి చెప్పడం వలననూ, ఉపాస్యునిగా, ప్రాప్యునిగా పరమాత్మనూ, ఉపాసకునిగా ప్రాప్తగా జీవాత్మనూ విశేషించి వివరించడం వలన ఈ శ్రుతిలో భోక్త అని చెప్పబడిన వాడు పరమాత్మయే" అని అర్థం అయింది.

మామయ్య: ఈరోజు ఇంతటితో ఆపుదామమ్మా! మరొక రోజు ఎప్పుడయినా తరువాతి అధికరణము చూద్దాము.

అందరూ:

యో నిత్య మచ్యుత పదాంబుజ యుగ్మ రుక్మ.....

---

## 3.అంతరాధికరణము:

**మామయ్య:** రండమ్మా, రావయ్యా బావా, ఎలాగున్నారు, ఎండలకి?

నాన్నగారు: బాగానే ఉన్నాము. ఈరోజు నువ్వు చెప్పే అధికరణము పేరేమిటి?

మామయ్య: "అంతరాధికరణము" అని...

నాన్నగారు: ఇందులో ఉపనిషత్ ఏమిటి? ఈ రకంగా కొంచెం కొంచెం ఉపనిషత్తుల పరిచయము కూడా అవుతోంది మాకు.

మామయ్య: అసలు ఈ వేదాంత సూత్రాలు శ్రుతి వాక్యాల వివరణే కద మఱి. ఇందులో మళ్ళీ ఛాందోగ్యోపనిషత్ ప్రస్తావనే వస్తుంది. ఉప కోశల విద్య అని, ఆ సందర్భంలో వచ్చే వాక్యాల గురించి.

నేను: ఉపకోశల అంటే అది మనిషి పేరా, లేక విషయం పేరా?

మామయ్య: ఉపకోశలుడని బ్రహ్మచారి పేరుమీద దానికా పేరు వచ్చింది.

నేను: ఉపకోశలుడంటే?

మామయ్య: సత్యకామ జాబాల శిష్యుడు.

నేను: ఒకసారి అమర చిత్ర కథలో చదివేను మామయ్యా సత్యకామ జాబాల అని. సమంగా గుర్తు లేదు, కాని దానిలో ఉపకోశలుడని ఎవరూ వచ్చినట్లు లేదు. కొంచెం ఆ వివరాలు చెప్పరా మామయ్యా!

మామయ్య: ఈ కథ అంతా మనకు అక్కఱ లేదు, కాని విషయం తెలియడానికి క్లుప్తంగా చెబుతాను.

సత్యకామ అనేవాడు జాబాల అనే ఒకామె కొడుకు. అతనికి బ్రహ్మచారి కావడానికి, అంటే బ్రహ్మోపదేశము పొందాలని తలపు కలిగింది. అందుకోసం "హారిద్రుమతుడి" కుమారుడైన గౌతముడను గురువు వద్దకు పోయి

బ్రహ్మోపదేశము చేయమని కోరుతాడు. గౌతముడు సత్యకాముడిని "నీ గోత్రము ఏమిటి, బ్రహ్మోపదేశము చేయడానికి గోత్ర వివరాలు తెలియాలి కదా" అంటాడు. అంటే సత్యకాముడు తన తల్లి వద్దకు పోయి తన గోత్రాన్ని తెలుపమని అడుగుతాడు. అందుకు ఆమె "నీవు పుట్టక ముందు చాలా మంది ఇళ్ళలో పరిచర్య చేసేదానిని. అందులో ఎవరికి నువ్వు పుట్టేవో తెలియదు, నా పేరు జాబాల కనుక నువ్వు నీ పేరు సత్య కామ జాబాల అని ఈ విషయం మీ గురువు గారికి చెప్పు" అని చెబుతుంది. అప్పుడు సత్యకామ జాబాల గౌతముడి దగ్గరకు వెళ్ళి ఈ విషయం చెబుతాడు. గౌతముడు సత్యాన్ని నిస్సంకోచంగా చెప్పే బ్రాహ్మణ గుణమున్నందు వలన తనకు శిష్యునిగా అంగీకరించి ఉపదేశము చేస్తాడు. అప్పుడు తనకున్న గోవులలో 400 బక్క చిక్కిన గోవులను వేఱు చేసి వాటిని మేపి వృద్ధి చేయమని అడవికి పంపిస్తాడు. సత్యకామ జాబాల ఆ గోవులను 1000 చేసేదాకా తిరిగి రాకూడదనుకొని అడవికి వెళ్ళి శ్రద్ధగా వాటి సంరక్షణ చేస్తాడు. ఆ గోవులు 1000 అవుతాయి. వాటిలో ఒక ఎద్దు  సత్యకామునితో "మేము 1000 మందిమి అయినాము, మీ గురువు గారి వద్దకు తీసుకొని పొమ్మ"ని చెబుతుంది. తాను బ్రహ్మ విషయము ఒక పాదము చెబుతాను అంటుంది. సత్యకామ జాబాల చెప్పుమని అడుగగా ఆ ఎద్దు "నాలుగు దిక్కులు మొత్తమంతా కలిపి పరబ్రహ్మకు ఒక పాదమనీ అది "ప్రకాశమాన"మనీ చెబుతుంది. అది తెలిసి ధ్యానించినవాడు "ప్రకాశవంతుడు" అవుతాడని చెబుతుంది. అగ్ని రెండవ పాదము చెబుతుందని చెప్పగా, సత్యకామ జాబాల అగ్ని సంధానము చేసి ప్రార్థిస్తాడు. అగ్ని భూమి, ఆకాశము, స్వర్గము, సముద్రములు అన్నీ కలిపి బ్రహ్మకు ఒకపాదమవుతుంది. దానిని "అనంతత్వము" అంటారు. దానిని ధ్యానించిన వారు "అనంతత్వాన్ని" పొందుతారు అని చెబుతుంది. తరువాత హంస మూడవ పాదము తెలియ చేస్తుంది అంటే తరువాత హంస ప్రత్యక్షమై "సూర్య, చంద్ర, విద్యుత్తులు బ్రహ్మకు ఒకపాదమని అది "జ్యోతిస్స"నీ, అది తెలిసి ధ్యానం చేస్తే జ్యోతిస్సు పొందుతారనీ " చెబుతుంది. తరువాత పాదము నీటి పక్షి చెబుతుందంటే దానిని అడిగితే అది "ప్రాణము, అక్షి, శ్రోత్రము, మనస్సు బ్రహ్మకు ఒక పాదమవుతుందనీ ఇది తెలిసి ధ్యానించిన వారు "ఆయతనాన్ని" పొందుతారనీ " చెబుతుంది. ఈ విషయాలు నేర్చుకొనిన సత్యకామ జాబాల తన గురువైన గౌతముని వద్దకు పోయి ఇదంతా

చెప్పి, తనకు జ్ఞానము ఇతరుల వలన కాక తన గురువు ద్వారానే కావాలని కోరుతాడు. అప్పుడు గౌతముడు ఆ విషయాలనే సంపూర్ణంగా వివరిస్తాడు.

ఆ విధంగా విద్య నేర్చిన సత్యకామ జాబాల వద్దకు, కమల అను ఒకామె కుమారుడైన "ఉపకోశలుడను" విద్యార్థి వస్తాడు. ఆ ఉపకోశలుడు గురువుగారి వద్ద 12 సంవత్సరాలు అగ్ని పరిచర్య చేస్తూంటాడు. సత్యకామ జాబాల మిగిలిన విద్యార్థులందరూ తన దగ్గర విద్య ముగించుకొని వెళ్ళిపోయినా "ఉపకోశలుడిని" మాత్రము పంపడు. అప్పుడు సత్యకామ జాబాల భార్య అతని పై జాలి కలిగి, తన భర్తతో "ఈ పిల్లవాడు కడు శ్రద్ధతో అగ్ని సంరక్షణ చేస్తున్నాడు, వాడికి మీరు ఉపదేశము చేయక పోతే అగ్నులే మిమ్ములను నిందిస్తాయి"అని అంటుంది. అయినా సత్యకామ జాబాల ఉపదేశము చేయకుండానే గ్రామాంతరము వెళతాడు. అంతట ఉపకోశలుడు భోజనము కూడా చేయకుండా తన పనులు చేస్తూండగా చూసి సత్యకామ జాబాల భార్య భోజనము చేయుమన్నా కూడా చేయడు. అంతట ఆ అగ్నులు( ఆహవనాయాగ్ని, గార్హపత్యాగ్ని, దక్షిణాగ్ని) తామే ఆ ఉపకోశలునికి ఉపదేశము చేయ సంకల్పిస్తాయి.

అందులో గార్హపత్యాగ్ని "భూమి, అగ్ని, అన్నము, సూర్యుడు తన రూపాలే అని అది తెలిసి తనను ధ్యానించిన వారు పాప కర్మ నివృత్తులై, సద్వంశ స్థాపకులవుతారని" చెబుతుంది.

దక్షిణాగ్ని "నీరు, నక్షత్రములు, చంద్రుడు తన రూపాలని అది తెలిసి తనను ధ్యానిస్తే పూర్ణాయుష్కులై, ప్రకాశమానులై ఉంటారని " చెబుతుంది

ఆహవనాయాగ్ని "ప్రాణము, ఆకాశము, స్వర్గము, విద్యుత్తు తన రూపాలని అది తెలిసి ధ్యానిస్తే వారి వంశము అవిచ్ఛిన్నంగా ఉంటుందనీ " చెబుతుంది.

తరువాత సత్యకామ జాబాల తిరిగి వచ్చి తన శిష్యుడిని చూచి నీ ముఖము ప్రకాశిస్తోంది, బ్రహ్మ గూర్చి ఉపదేశము ఎలాపొందేవు అని అడుగగా, జరిగినది చెప్పగా, సత్యకామ జాబాల ఆ అగ్నులు నీకు సృష్టిలో

పదార్థముల గురించే చెప్పేయి, నేను నీకు పరబ్రహ్మ గురించి చెబుతాను అని ఉపదేశం చేస్తాడు. ఈ సందర్భంలో వాక్యాలు మనకిప్పుడు చర్చనీయాంశాలు. ఈ కథలో ఎన్నో రహస్య విషయాలు ఉన్నాయి. వాటి జోలికి మనం ఇప్పుడు వెళ్ళ వద్దు.

**అమ్మ:** పెద్ద కథే మామయ్య. ఇంక ఇప్పుడు ఆ వాక్యాల వివరాలు చెప్పండి మామయ్యా!

**మామయ్య:** మనకు సూత్రాలకు అవసరమైన వాక్యాలు మాత్రము చెప్పుకుందాము.

ఈ మంత్రాలు ఛాందోగ్యోపనిషత్ లో 4 వ అధ్యాయము 10, 14, 15 వ ఖండములలో వస్తాయి.

అథ హాగ్న యః సమూదిరే తప్తః బ్రహ్మచారీ కుశలమ్ నః

పర్యచారీద్ధంతాస్మై ప్రబ్రవామేతి తస్మై హోచుః ప్రాణః బ్రహ్మ కమ్ బ్రహ్మ ఖమ్ బ్రహ్మ ఇతి। 4-10-4

అంతట ఆ అగ్నులు తమలో "ఈ బ్రహ్మ చారి నిష్ఠగా పరిచర్యలు ఆచరిస్తున్నాడు. వానికి ఉపదేశము చేతము" అనుకొన్నాయి.

అవి అతనితో "ప్రాణము బ్రహ్మ, కమ్ బ్రహ్మ, ఖమ్ బ్రహ్మ" అని ఉపదేశము చేసేయ్.

సహోవాచ విజానామ్యహమ్ యత్ప్రాణో బ్రహ్మ. కమ్ చ తు ఖమ్ చ న విజానామి ఇతి.

తే హోచుః యద్వావ కమ్ యదేవ ఖమ్ తదేవ కమితి ప్రాణమ్ చ హాస్మై తదాకాశమ్ చోచుః ।4-10-5

ఉపకోశలుడు "ప్రాణము బ్రహ్మ అంటే తెలిసింది. కాని కమ్ బ్రహ్మ, ఖమ్ బ్రహ్మ అంటే అర్థమవలేదు"అన్నాడు.

అంతట ఆ అగ్నులు "కమ్ అంటే ఆనందము, ఖమ్ అంటే ఆకాశము అని వాటికి ప్రాణము నకు సంబంధము కలదని పలికినవి.

సహోచుః ఉపకోసలైషా సోమ్య తే అస్మత్ విద్యాత్మవిద్యా చ ఆచార్యస్తు తే గతిమ్ వక్తేత్యాజగామ హాస్యాచార్యః తమాచార్యః అభ్యువాదోప కోసల ఇతి। 4-14-1

అంతట ఆ అగ్నులు "ఉపకోసలా! మేము మా జ్ఞానాన్ని నీకు చెప్పేము. కాని నీకు నీ ఆచార్యుడు నీకు మార్గాన్ని చెబుతాడు" అని చెప్పేయి.

అప్పుడు ఆచార్యుడు వచ్చి ఉపకేసలా! అని పిలిచేడు.

య ఏష అక్షిణి పురుషః దృశ్యత ఏష ఆత్మేతి

హోవాచ ఏతదమృతమభయమేతత్ బ్రహ్మేతి

తద్యద్యపి అస్మిన్ సర్పిర్వోదికమ్ వా సించతి వర్త్మనీ ఏవ గచ్ఛతి. ..4-15-1

సత్యకామ జాబాల ఉపకోసలునితో " అక్షి యందు చూడబడు పురుషుడు ఆత్మ. అతడు చావులేని వాడు. భయము లేనివాడు. అందువలననే అందులో కరగించిన వెన్న కాని, నీరుకాని పోస్తే పక్కకు జారిపోవును.

ఏతా సంయద్వామ ఇతి ఆచక్షత ఏతా హి సర్వాణి వామాని అభిసంయంతి సర్వాణ్యేన వామాని అభిసంయంతి య ఏవమ్ వేద। ...1-15-2

అతడు సంయద్వామ యని పిలువబడును ఏలనన అన్ని శుభములు అతనికి చెందును. అది అతనికి తెలియును.

ఏష ఉ ఏవ వామనీరేష హి సర్వాణి వామాని నయతి సర్వాణి వామాని నయతి యఏవమ్ వేద।....1-15-3

అతడు వామని కూడ. ఎందుకంటే సర్వ శుభములు అతడే కలిగించును.

ఏష ఉ ఏవ భామనీరేష హి సర్వేషు లోకేషు భాతి సర్వేషు లోకేషు భాతి య ఏవమ్ వేద।....1-15-4

అతడే భామని అని పిలువబడును. ఎందుకంటే అతడు ముల్లోకములయందు ప్రకాశించును. అది అతనికి తెలియును. అథ యదు చైవ అస్మిన్ ఛవ్యమ్ కుర్వంతి యది చ న

అర్చిషమేవాభిసంభవంతి అర్చిషః అహరహన్

ఆపూర్యమాణ పక్షమ్ ఆపూర్యమాణ పక్షాత్ యాన్ షడుదంగేతి

మాసాః తాన్ మాసేభ్యః సంవత్సర

సంవత్సరాత్ ఆదిత్యమ్ ఆదిత్యాత్ చంద్రమసమ్ చంద్రమసో విద్యుతమ్ తత్ పురుషః అమానవః స ఏనాన్ బ్రహ్మ గమయతి ఏష దేవపథో బ్రహ్మ పథ ఏతేన ప్రతిపద్యమానా ఇమమ్ మానవమ్ ఆవర్తమ్ నావర్తంతే నావర్తంతే।....4-15-5

అతడు మరణించిన పిదప దహన, శ్రాద్ధాది కర్మలను నిర్వహించినా, నిర్వహించకపోయినా ప్రయాణించి అర్చి అధిష్టాన దేవత వద్దకు, అక్కడ నుండి దిన అధిష్టాన దేవత వద్దకు, పిదప శుక్ల పక్ష దేవత వద్దకు, పిదప ఉత్తరాయణ దేవత వద్దకు, సంవత్సర దేవత వద్దకు, అట నుండి ఆదిత్య దేవత వద్దకు, అటనుండి చంద్రమస్ దేవత వద్దకు, అటనుండి విద్యుత్ దేవత వద్దకు వెళ్ళి వారిని దాటి పోయిన పిమ్మట అమానవ పురుషుడు అతనిని కలసి పరబ్రహ్మ వద్దకు అతడిని చేర్చును. ఈ రకమైన దేవయానము నందు ప్రయాణించి వెళ్ళిన మానవుడు తిరిగి రాడు. తిరిగి రాడు.

ఇప్పటికి క్లుప్తంగా అవసరమైనంత ఉపనిషద్వాక్యాలు చెప్పుకోవడం అయినది. ఇంక సూత్రాల లోకి వెళదామా!

**అమ్మ:** ఈ అధికరణంలో ఎన్ని సూత్రాలున్నాయి మామయ్యా!

**మామయ్య:** ఆఋ ఉన్నాయమ్మా. అందులో మొదటిది.

## "అంతర ఉపపత్తేః......1-2-13"

అంటే

అంతరః (నేత్రము) లోన (నుండు వాడుగా శ్రుతి యందు చెప్పబడిన వాడు పరమాత్మయే. ఏలనన)

ఉపపత్తేః (ఇందు చెప్పబడిన గుణములు పరమాత్మ కే ఉండుట సంభవము అను) కారణము వలన

అనగా

ఈ శ్రుతి యందు నేత్రమునందు ఉండునట్లు చెప్పబడిన వాడు పరమాత్మయే ఏలననగా ఆ శ్రుతి యందు చెప్పబడిన గుణములు పరమాత్మకే సంభవము కనుక

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** ఇందాకా

"య ఏష అక్షిణి పురుష.....ఏతత్ బ్రహ్మ" అన్న వాక్యము చూసేము కదమ్మా! అంటే అర్థము అక్షి యందు ఏ పురుషుడు కన్పించుచున్నాడో ఇతడే ఆత్మ, ఇతడమృతమును, అభయమును అగు బ్రహ్మ. అని కదా చెప్పేరు. ఆత్మ అనీ చెప్పేరు, బ్రహ్మ అని కూడా చెప్పేరు కదా, అలాగయితే ఆ పురుషుడు ఎవడు అని సంశయము.

**నాన్నగారు:** అంటే ఇక్కడ కూడా పూర్వ పక్షము జీవాత్మ అని, అలాకాదు ఆ పురుషుడు పరమాత్మయే ఆయా గుణాలుండడం వలన అంటారు అంతేనా బావా!

మామయ్య: కొంతవరకూ అంతే. కాని పూర్వ పక్షములో ఒక్క జీవాత్మ తో ఆపేయక

మఱికొన్ని విపర్యయాలను కూడా చర్చిస్తారు.

నాన్న గారు: ఏమిటవి?

మామయ్య:

1. అతడు జీవాత్మ కావచ్చును. ఎందుకంటే మనం కళ్ళు తెరిస్తేనే కదా మనలో జీవాత్మ ఉన్నట్లు. కళ్ళు తెరవక పోతే శరీరములో జీవుడు లేనట్లే కదా!

2. అతడు పేఱొక దేవతా విశేషమైనా కావచ్చును. నేత్రమునకు దృష్టి కలిగేది అంటే పని చేయ గలిగేది కాంతి కిరణాలవలననే కదా! ఆ కిరణాలు దేవతా చోదితములు. అందువలన నేత్రమునందలి పురుషుడు ఆ కిరణాల చేత ప్రతిష్ఠ చేయబడిన దేవతా విశేషము కావచ్చును.

3. అతడు ప్రతిబింబ రూపుడనుట మిక్కిలి యుక్తము. ఎందుకంటే నేత్రమున ఏర్పడేది ఎప్పుడైనా ప్రతిబింబమే కనుక.

"అందుచేత నేత్రము నందలి పురుషుడు పైన తెలుప బడిన వారిలో ఎవరైనా కావచ్చును" అంటారు పూర్వ పక్షములో.

నాన్న గారు: సమంగానే తోస్తోంది, అయితే అవేమీ ఎందుచేత కాదంటారు భగవద్రామానుజులు?

మామయ్య: ఈ పురుషుడిని చెప్పిన తరువాత ఆతడి లక్షణాలు కూడా చెప్పింది శ్రుతి ఆ వెంటనే. ఆ లక్షణాలు

1. సంయద్వామ: ఆతడు అవాప్త సమస్త కాముడు. సమస్త శుభములు ఆతనికే చెందును.

ఈ సృష్టిలో మరెవ్వరినీ అవాప్త సమస్త కాముడు అని చెప్పలేము.

**నేను:** అవాప్త సమస్త కాముడు అంటే!

**మామయ్య:** "సంయతిమ్ సంగతాని వామాని వరణీయాని ప్రార్థనీయాని యస్మిన్ సః సంయద్వామ" అని వ్యుత్పత్తి. అనగా కోరదగిన సమస్త మంగళములు ఎవనియందున్నవో ఆయన అని అర్థము. సకల కళ్యాణ గుణాశ్రయత్వము, సత్య సంకల్పత్వము , అవాప్త సమస్త కామత్వము కలవాడు అని. సత్య సంకల్పత్వము అంటే సంకల్పమాత్రం చేత సముద్భూతమైన సర్వ విధ ఉపకరణత్వము, అవాప్త సమస్త కామత్వము అంటే సంపూర్ణముగా పొందబడిన సమస్త కళ్యాణ గుణములు కలవాడు. ఇక్కడ "కామ్యంత ఇతి కామాః " అని అర్థంతో కోర దగినవి అంటే పరమాత్మానుభవానికి కోర దగినవి ఆయన కుండే నిరుపాధిక, స్వాభావిక, నిర్హేతుక, అసంఖ్యేయ కళ్యాణ గుణాలు. పరిమిత, పరిచ్ఛిన్న, సోపాధిక, జ్ఞాన, శక్త్యాదులున్న మరే జీవాత్మకు మనము ఇంతకుముందు చెప్పుకున్నట్లు ఈ గుణాలు సరి పడవు. నిత్యులకు కూడా గుణాలు నిరుపాధికాలు కావు కదా!

2. వామని: సకల కర్మ ఫలములకు నాయకుడతడే, సకల శుభములు ఆయన అనుగ్రహము వలననే కలుగుతాయి.

3. భామని: ఆయన "అంతర్బహిశ్చ" అన్నట్లు ఎల్లెడల ప్రకాశించు చున్నవాడు. ఈ తత్త్వము కూడ పరబ్రహ్మకే చెల్లుతుంది.

4. అమృతమ్: ఎప్పుడూ మృతి, వినాశము లేని వాడు. "సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్" వంటి అనేక శ్రుతులు కూడా చెప్పేదిదే కదా!

ఇలా పైన చెప్పబడిన గుణాలు పరబ్రహ్మకు తప్ప మరి ఏ జీవాత్మకో, దేవతా విశేషానికో చెప్పలేము. అందు వలన ఆ పురుషుడు పరమాత్మయే.

**నేను:** ఆ పురుషుడు మనందరి కళ్ళల్లో ఉంటే మనకందరికీ కనపడాలి కదా!మరి కనబడడేం?

**మామయ్య:** ఇది సత్య కామ అగ్ను లను, ఆచార్యుడిని అత్యంత శ్రద్ధతో సేవించి, అగ్ను లచేత ఉపదేశము పొంది, ఉపాసిస్తున్న ఉపకోసలుడికి చెబు తున్నా డు, అట్టి ఉపాసనా పరులకు పరమాత్మ అక్షి పురుషుడుగా సాక్షాత్కరిస్తాడన్న మాట. నీకూ, నాకూ కాదు.

**నేను:** ఆ కంటిలో నీరుపోస్తే జారి పోతుంది అని  అన్నా రు కదా, అంటే.

**మామయ్య:** నాయనా ,ఉపనిషత్తులు అర్థం చేసుకోవడం మామూలుగా చాలా కష్టం. ఎందుకంటే అవి విషయాలను పరోక్షంగాను, జటిలంగాను చెబుతాయి. అలా పరమాత్మ సాక్షాత్కారాన్ని కలిగిన వారికి దృష్టిలో మరేదీ నిలువదు అని దానికి అర్థం. "పుష్కర పలాశ ఆపః న శ్లిష్యంతే ఏవమేవమ్ విది పాపమ్ కర్మ న శ్లిష్యతే" అని తామరాకు  పై నీటిబొట్టు వలె పాప కర్మలు అట్టి వారికి అంటుకొనవు అని. అయినా ఆ వివరాలు మనకందు బాటులో లేని అనుభవాలు, మహాయోగులకు తప్ప.

**నేను:**ఇలా నేత్రములలో పరమాత్మ ఉంటాడని చెప్పినది ఈ శ్రుతి లోనేనా, ఇంకా మిగతా శ్రుతులలో కూడా ఉన్నదా ఇలాగే.

**మామయ్య:** అందుకోసం తరువాత సూత్రం చూడాలి.

**అమ్మ:** ఏమిటి మామయ్యా ఆ సూత్రము?

## మామయ్య:

# "స్థానాది వ్యపదేశాత్ చ....1-2-14"

అంటే

స్థానాది వ్యపదేశాత్: చక్షుస్సున స్థితి మొదలగునవి (పరమాత్మకుండునవిగ) వేఁటే శ్రుతుల యందు చెప్పబడుట చేత

చ: కూడ

అనగా

నేత్రమునందు ఉండుట మొదలగునవి పరమాత్మకే వర్తించునట్లు వేఁటే శ్రుతుల యందు కూడ చెప్పబడుట చేత ప్రస్తుతము చక్షుస్సునందు ఉండు వానిగ చెప్పబడిన వాడు పరమాత్మయే.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** "యః చక్షుషి తిష్ఠన్ చక్షుర్నవేద". అని అన్నట్లు తక్కిన ఉపనిషత్తులలో కూడ నేత్రమునందు పరమాత్మ ఉన్నట్లు చెప్పబడినది కదా! అందువలన ఇక్కడ అక్షి పురుషుడుగా చెప్పబడుతున్నవాడు పరమాత్మే అని చెబుతున్నారన్నమాట.

**నేను:** అగ్నులు ఉపకోసలునికి "ప్రాణో బ్రహ్మ, కమ్ బ్రహ్మ, ఖమ్ బ్రహ్మ" అని చెప్పి, తదుపాసన వలన అవిచ్ఛిన్నంగా వంశాభివృద్ధి, కర్మ నివృత్తి పొందుతారని ఇలా ఏదో చెప్పేయి. సత్యకామ జాబాల అక్షిపురుషుని

గూర్చి చెప్పి తరువాత అర్చిరాది మార్గం చెప్పేడు. అంటే ఈ రెండింటికీ సంబంధమున్నదా, కాక ఈ రెండూ వేర్వేరా?

మామయ్య: ఆ వివరాలకే తరువాత సూత్రము

అమ్మ: ఏమిటి ఆ సూత్రము మామయ్యా!

మామయ్య:

"సుఖ విశిష్టాభిధానాదేవ చ...1-2-15"

అంటే

సుఖ విశిష్ట: సుఖ విశిష్టుడుగ

అభిధానాత్: (చెప్పబడిన వాడే చక్షుస్సు నందుండు వాడుగ) చెప్పబడుట చేత

చ: కూడ

అమ్మ: కొంచెం వివరించండి మామయ్యా !

మామయ్య:

ఉపకోసలునికి అగ్నులు "ప్రాణో బ్రహ్మ, కమ్ బ్రహ్మ, ఖమ్ బ్రహ్మ" అని "ప్రాణము బ్రహ్మ, సుఖము బ్రహ్మ, ఆకాశము బ్రహ్మ" అని బ్రహ్మ గురించి ఉపదేశించేయి. తరువాత ఆ ఉపాసనా ఫలముగా ఆయుర్దాయ ప్రాప్తి, అవిచ్ఛిన్న వంశ వృద్ధి వంటి ఫలాలు చెప్పేయి. "ఏషా సోమ్య అస్మద్విద్యా ఆత్మ విద్యా చ" అని ఇది అగ్ని

విద్య, ఆత్మ విద్యా కూడా అని చెప్పి, తరువాత "ఆచార్యస్తు గతిమ్ వక్తా" అని ఆచార్యుడు నీ మార్గమును చెప్పును అని ఊరుకున్నాయి.

ఇటు తరువాత సత్యకామ జాబాల పరబ్రహ్మ సాక్షాత్కారాన్ని, తదనంతరము అర్చిరాది మార్గాన్ని ఉపదేశించేడు. ఇప్పుడు ఆ అగ్నులు ఉపదేశించినదానికి సత్యకామ జాబాల ఉపదేశించినదానికి దానికి సంబంధం ఏమయినా ఉందా అని ప్రశ్న. ఎందుకంటే అక్కడ అగ్ని విద్య, ఆత్మ విద్య అని చెప్పి దానికి ఫలంగా ఆయువు, వంశాభివృద్ధి లాంటివి చెప్పేరు తప్ప పరబ్రహ్మ ను పొందడమని చెప్పలేదు. కాని ఆ విద్యలో కూడా ప్రాణో బ్రహ్మ, కమ్ బ్రహ్మ, ఖమ్ బ్రహ్మ అని ప్రాణము బ్రహ్మ, సుఖము బ్రహ్మ, ఆకాశము బ్రహ్మ అని బ్రహ్మ గురించే చెప్పేరు. ఇదెలా అన్నది సంశయము కదా!

దీనికి సమాధానము, అగ్నుల చే చెప్పబడినది కూడ బ్రహ్మ విద్యకు అంగమే. ఆ ఉపదేశము తరువాత ఆచార్యుడు నీకు మోక్ష మార్గమును చూపును అని చెప్పడం వలననూ, ఆ ఉపదేశము తరువాత బ్రహ్మ విద్య ముగించక పోవడం వలననూ ఇక్కడ చెప్పబడిన అగ్ని విద్య బ్రహ్మ విద్య యొక్క అంగమని నిశ్చయించుకోవాలి. అగ్నులు ఉపకోసలునికి ఉపదేశము చేయునప్పుడు అతడు ఆహారము తీసుకొనక బ్రహ్మ వ్యాప్తి వ్యతిరిక్తములైన జన్మ, జరా, మరణాది సంసార భయముతో పీడితుడై ఉన్నవాడు. ఆ సమయమున ఆ భయము పోవడానికీ, బ్రహ్మోపాసనము చేయడానికీ "శరీరమ్ ఆద్యమ్ ఖలు ధర్మ సాధనమ్" అన్నట్లు ఆరోగ్యంతో పూర్ణాయుర్దాయుడై ఉండడం అవసరమే. ఆ అగ్నులు తాము చెప్పినది అగ్ని విద్య, ఆత్మ విద్య కూడ అని చెప్పడం వలన అవి చెప్పినది మోక్షైక ఫలమగు బ్రహ్మ విద్యకు అంగమని తెలుసుకోవాలి. "అపహతే పాపకృత్యామ్ లోకే భవతి సర్వమాయురేతి జోగ్జీవతి నాస్యా పరపురుషాః క్షీయంతే ఉపయంతమ్ భుంజామః అస్మిన్ చ లోకే అముష్మిన్ చ" అని కదా వాక్యము. అంటే

అపహతే పాపకృత్యామ్: (అగ్ని విద్య) పాపకర్మను నశింప చేయుచున్నది)

సర్వమాయురేతి: బ్రహ్మోపాసనకు తగిన పూర్ణాయుర్దాయము కలుగును

జ్యోగ్జీవతి: వ్యాధులచే పీడంప బడక బ్రహ్మ ప్రాప్తి వరకు జీవించు చున్నాడు

నాస్యావర పురుషాః క్షీయంతే: వీని పుత్ర, పౌత్రాదులు, శిష్య, ప్రశిష్యాదులు క్షీణించక బ్రహ్మ వేత్తలగుదురు

నాస్యాబ్రహ్మవిత్కులే భవతి: ఇతని వంశమున బ్రహ్మ వేత్త కానివాడుండడు.

ఉపయంతమ్ భుంజామః .....అముష్మిన్ చ: మమ్ములను  ఉపాసించు చున్న (వానికి) ఈ లోకమునను, పై లోకములయందును బ్రహ్మ ప్రాప్తి వరకు రక్షించు చుందుము.

ఈ విధంగా చెప్పడం చేత అగ్నులు చెప్పినది అంతా బ్రహ్మ విద్యకు అంగమే. అక్కడ చెప్పబడిన సుఖము బ్రహ్మ అంటూ చెప్పినదీ బ్రహ్మనే. అయితే బ్రహ్మ ప్రాప్తి కాకుండా అక్కడ ప్రత్యేక ఫలాలు ఎందుకు చెప్పేరు అంటే ఆ ఫలాలు మోక్ష మార్గ విరుద్ధాలు కావు, నిజానికి మోక్ష మార్గ సహకారులు. అవి అగ్ని విద్య గొప్పదనాన్ని చెప్పేవి. ఉపాస్యుని అంటే పరబ్రహ్మ గురించి తెలియాలి అంటే ఆయన గుణాలు తెలియాలి కదా. అందుకోసం ఆయనే సమస్తమునకు ఆధారము, అవిచ్ఛిన్నమైన ఆనంద స్వరూపుడు, అనంతమైన వాడు అంటూ అగ్నులు అలా చెప్పేయి. కాని తామే బ్రహ్మ విద్యను ముగించకుండా ఆచార్యుల వద్దనే నేర్వమని ఆదేశించేయి. తరువాత ఆచార్యుడైన సత్యకామ జాబాల ఉప కోసలునకు పరబ్రహ్మ ప్రాప్తి మార్గాన్ని అదే అర్చిరాది మార్గాన్ని ఉపదేశించేడు. అందు వలన కమ్ బ్రహ్మ అంటూ సుఖ విశిష్టుడుగ చెప్పినదీ, "అక్షిణి పురుష దృశ్యతే" అని అక్షి పురుషుడుగా చెప్పినదీ కూడా పరమాత్మనే.

**నేను:** ప్రాణము బ్రహ్మ, సుఖము బ్రహ్మ, ఆకాశము బ్రహ్మ అంటే అది నేత్రములో సాక్షాత్కరించిన బ్రహ్మ లాగే ఎలా చెబుతారు. ఆకాశము అంటే పంచ భూతాలలో ఒకటి. సుఖము అంటే లౌకిక మైన సుఖము కదా. అంటే పరిమిత ఫలాల కోసం "నామబ్రహ్మ, మనో బ్రహ్మ " అంటే నామమును బ్రహ్మ గా ఉపాసింపుము, మనస్సును బ్రహ్మగా ఉపాసింపుము అని ఉపాసించి నట్లు లేదూ ఇలాంటి పద్ధతి? ఇలా కూడా బ్రహ్మోపాసనము చేస్తారా!

**మామయ్య:** ఆ వివరాలకు తరువాతి సూత్రము చూడాలి.

**అమ్మ:** ఏమిటి మామయ్యా ఆ సూత్రము?

**మామయ్య:**

## "అత ఏవ చ స బ్రహ్మ....1-2-16"

అంటే

అత ఏవ చ: అందు వలననే కూడా

సః: నేత్రమునందలి పురుషుడు

బ్రహ్మ: పరబ్రహ్మ

అనగా

పైన చెప్పిన హేతువులచేత నేత్రమున నున్నట్లు చెప్పబడినది పరబ్రహ్మ

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** దీనికి ముందు ప్రతీకోపాసన అంటే ముందు తెలియాలి. తెలుసునా ప్రతీకోపాసన అంటే?

**అమ్మ:** తెలియదు మామయ్యా, చెప్పండి.

**మామయ్య:** వేద విద్యలు ఱెండు రకాలు. బ్రహ్మ విద్యలు, కామ్య విద్యలు అని. బ్రహ్మ ప్రాప్తి కోసమైతే వాటిని బ్రహ్మ విద్యలు అంటారు. అలాకాక పరిమిత కామ్యాలకోసం అయితే వాటిని కామ్య విద్యలు అని అంటారు.

బ్రహ్మవిద్యలలో చెప్పబడేది బ్రహ్మోపాసనము. ఇది మనము ముందు చెప్పుకున్నట్లు మూడు రకాలు

## 1. స్వరూప బ్రహ్మోపాసనము.

అంటే పరమాత్మను ఆయన స్వరూపము ద్వారా ఉపాసన చేయడం. ఆయన స్వరూపాలలో అర్చ్యాస్వరూపాన్ని ఉపాసన చేయడం మిగిలిన వాటి కంటే సులభము అని కూడా మనము చెప్పుకున్నాము, ఈ విషయాన్నే "శ్రీవచన భూషణము" లో పిళ్ళై లోకాచార్యులవారు, మణవాళ మహాములు అనుగ్రహిస్తారు.

ఇంక మిగిలిన ఱెండు విధాలు చిచ్ఛరీరక బ్రహ్మోపాసన, అచిచ్ఛరీరక బ్రహ్మోపాసన. ఇవి కూడా మనము ఇంతకు ముందు చెప్పుకున్నాము. ఈ రకంగా బ్రహ్మోపాసన చేసేవారు బ్రహ్మప్రాప్తిని పొందుతారు, మరణానంతరము అర్చిరాది మార్గము ద్వారా ప్రయాణించి.

ఇంక మఱియొక విద్య కామ్య విద్య. ఇవి ఱెండు రకాలు. చిదుపాసన, అచిదుపాసన అన్నది మొదటిది, ప్రతీకోపాసన ఱెండవది. చిదచిత్తులను బ్రహ్మములుగా తలచి ఉపాసించడాన్ని చిదుపాసన, అచిదుపాసన అంటారు. ఉదాహరణకు వాయువును దిక్కు పుత్రునిగా పరమాత్మ గా భావించి ఉపాసన చేస్తే పుత్ర శోకము కలుగదు. ఇటువంటి ఉపాసనలకు పరిమిత ఫలాలుంటాయి, కామ్య ఫలాలన్న మాట. ఱెండవది ప్రతీకోపాసన.

**అమ్మ:** అంటే

**మామయ్య:** ప్రతీకము అంటే చిహ్నము అని అర్థము. ఇందులో ప్రాణాదులను బ్రహ్మము భావించి ఉపాసన చేస్తారు. ఛాందోగ్యోపనిషత్తులో ఏడవ ప్రపాఠకములో నామము, వాక్కు, మనస్సు, సంకల్పము, చిత్తము, ధ్యానము, విజ్ఞానము, బలము, అన్నము, ఉదకము, తేజస్సు, ఆకాశము, స్మరణము ఇలా వేర్వేరు ప్రతీకలను బ్రహ్మగా భావించి ఉపాసించడం చెప్పబడింది. వీటిలో పూర్వ పూర్వమున చెప్పిన దానికంటె ఉత్తరోత్తరమున అంటే ముందు చెప్పిన దానికంటే తరువాత చెప్పబడినది ఉత్కృష్టముగా తలచి వానియందు బ్రహ్మదృష్టినుంచి ఉపాసించడం. వీటికి పరిమితమైన ఫలాలుంటాయి కాని బ్రహ్మ ప్రాప్తి కోసం ఈ ఉపాసనలు కాదు.

**నేను:** అయితే మన సందర్భములో ప్రాణము, ఆకాశము అన్నప్పుడు అది ప్రతీకోపాసనములాగే ఉంది కదా, అది బ్రహ్మ విద్య ఎలాగవుతుంది.

**మామయ్య:** ఇక్కడ సందర్భము ఏమిటి! ఉపకోసలుడికి కామ్య విద్యలే కావలసి వస్తే అతని ఆచార్యుడు అవి ఉపదేశించి ఎప్పుడో పంపించి వేసేవాడు. కాని అతనకి కావలసినది జన్మ, మరణాది రూపమైన సంసారమునుండి విముక్తినీయ గల విద్య. అట్టి ముముక్షువయిన ఉపకోసలుడికి బ్రహ్మమునుపదేశించడానికి అగ్నులు ఉద్యమించేయి. అందుచేత ఇక్కడ బ్రహ్మమే ఉపాస్య వస్తువు, అందువలన పరిమిత ఫలాలను ఈయగల ప్రతీకోపాసన ఇక్కడ చెప్పబడలేదు.

ఇక్కడ "ప్రాణో బ్రహ్మ" అంటే ప్రాణము బ్రహ్మ అని బ్రహ్మము నిర్దేశించబడినది. జగత్తునకు ధారకమగుట చేత గాని, ప్రాణమును శరీరముగా కలవాడగుటచేత గాని, ప్రాణమును నియమించు వాడగుటచేత గాని పరబ్రహ్మ ఆ ప్రాణాదులలో ప్రాణముతో కూడి యుండుట, అందుచేత అక్కడ ప్రాణము అనగా పరబ్రహ్మ ఉపాసించబడుట సంభవము. మనము ఇంతకు ముందుకూడా ఇంద్ర ప్రాణాధికరణము లోనూ అక్కడా ఈ విషయము చెప్పుకున్నాము. అందు వలననే ఉపకోసలుడు "విజానామి అహమ్ యత్ప్రాణో బ్రహ్మేతి" అని "ప్రాణము

బ్రహ్మమని నాకు తెలియును" అని చెప్పేడు. అంటే "ప్రాణో బ్రహ్మ" అన్న వాక్యములో అతనికి సంశయము లేదు.

ఇంక సుఖమును, ఆకాశమును రెండును బ్రహ్మమునకు శరీరమగుటచే తన్నియామ్యములగుట చేత బ్రహ్మమునకు విశేషణాలవుతాయా, లేక సుఖమెంతయో ఆకాశమంత, ఆకాశమెంతయో సుఖమంత అని చెప్పడం చేత అవి అన్యోన్య వ్యవచ్ఛేదకములగుటచేత అవి బ్రహ్మమునకు విశేషణములవుతాయా అన్నది ప్రశ్న.

పరస్పరము వేరు వేరు అయిన సుఖాకాశములు బ్రహ్మమునకు శరీరభూతములవుతూ, బ్రహ్మమునకు విశేషణములయినప్పుడు విషయ సుఖమునకు, భూతాకాశానికి నియామక మైనది బ్రహ్మమే కావాలి. అందుచేత ఇలా చెప్పినప్పుడు బ్రహ్మ స్వరూపమిట్టిదని తెలియక పోవచ్చును.

అలా కాకుండా అవి అన్యోన్య వ్యవచ్ఛేదములయి అందుచే పరబ్రహ్మకు విశేషణాలయితే పరబ్రహ్మ అపరిమిత ఆనంద స్వరూపుడని తెలుస్తుంది.

ఈ పైన తెలిపిన రెండు విధాలలో ఏ విధంగా అర్థం చేసుకోవాలి అని ఉపకోసలుడు "కమ్ చ ఖమ్ చ న విజానామి" అని పలికేడు.

దానికి సమాధానముగా అగ్నులు "యద్వావ కమ్ తదేవ ఖమ్, యదేవ ఖమ్ తదేవ కమ్" అని "ఏది సుఖమో అదియే ఆకాశము, అనగా అపరిచ్ఛిన్నము, అంతటా ప్రకాశించునది" అని "ఆ పరబ్రహ్మము అపరిచ్ఛిన్నమైన సుఖమే స్వరూపముగా కలది" అని చెప్పేయి.

అంటే ఆ పరబ్రహ్మ "ప్రాణము శరీరముగా కలది అవడం వలన ప్రాణ విశిష్టమైనది, అపరిచ్ఛిన్నమైన సుఖమే స్వరూపముగా కలది " అని అర్థము. ఈ రకంగా కమ్ బ్రహ్మ ఖమ్ బ్రహ్మ అన్నా అపరిచ్ఛిన్నమగు పరబ్రహ్మ

ప్రతిపాదింపబడినది. అందువలన ఇక్కడ కూడా చెప్పబడినది పరిమిత ఫలాలిచ్చే ప్రతీకోపాసన కాదు. ఆ బ్రహ్మమే తరువాత సత్యకామ జాబాల చేత నేత్రమున నుండు పురుషునిగా చెప్పబడినది.

కావున ఈ శ్రుతిలో నేత్రమున నుండు వానిగా చెప్పబడిన వాడు, అంతకు ముందు "కమ్ చ బ్రహ్మ ఖమ్ చ బ్రహ్మ" అని కూడా చెప్పబడినటువంటి పరబ్రహ్మమే.

**అమ్మ:** అంటే ప్రాణాదులను బ్రహ్మగా భావించి పరిమిత ఫలాలకై ఉపాసిస్తే అది ప్రతీకోపాసన. అలా కాకుండా ఆ ప్రాణాదుల విశిష్టుడుగా, అంటే వాటిని విశేషణముగానో, శరీరముగానో కలిగి యున్న ఆశబ్దములద్వారా ఆ పరబ్రహ్మనే ఉద్దేశించి ఉపాసన చేస్తే అది బ్రహ్మోపాసన అన్నమాట. అంతేనా. అందువలన ఉపాసన చేసే దృష్టి కోణం బట్టీ, దానివలన వచ్చే ఫలితాన్ని బట్టీ కూడా ఇక్కడ అగ్నుల చేత చెప్పబడినది కూడా బ్రహ్మ విద్యే కాని ప్రతీకోపాసన లాంటి కామ్య విద్య కాదు అంటున్నారు, అంతేనా మామయ్యా!

**మామయ్య:** భాష ఏదయినా భావం అంతేనమ్మా!

**నేను:** ఇక్కడ బ్రహ్మోపాసనలో బ్రహ్మ స్వరూపోపాసన అని అంటున్నారు. అంటే ఏమిటి, అలాగే అర్చ్య స్వరూపాన్ని ఉపాసన చేయాలి అని అంటున్నారు, అంటే అర్చ్యమూర్తి లో ఈ స్వరూప లక్షణాలు ఎక్కువగా ఉంటాయా? మరొక్క సారి చెప్పరా మామయ్యా!

**మామయ్య:** మంచి ప్రశ్న వేసేవు. పరమాత్మ రూపము అంటే మనకు కనబడుతున్నది. పరమాత్మ స్వరూపము అంటే ఆ పరమాత్మకే సంబంధించిన గుణ విశేషాలు సౌలభ్యము, స్వామిత్వము, జగత్కారణత్వము, నియామకత్వము..లాంటివి. ఈశావాస్యోపనిషత్ లో "పూర్ణమిదమ్ ..." అంటూ చెప్పినట్లు పర, వ్యూహాది స్థితులలో దేనిలోనైనా పరమాత్మ పరమాత్మ స్వరూపము సమానమే, సంపూర్ణమే. ఒకచోట ఎక్కువ, ఒకచోట తక్కువ కాదు. కాని మనము అనుభవించడానికి కొన్ని గుణ విశేషాలు కొన్ని చోట్ల మనకు

సులభంగా లభ్యమవుతాయి. అర్చక పరాధీనుడై అత్యంత సౌలభ్య ప్రాకట్యంతో మన ఇళ్ళలోనూ, దేవాలయాల లోను వేంచేసి యుండే అర్చ్యా స్వరూపము వద్ద మనకు మన అనుభవానికి తగినట్లు పరమాత్మైక గుణ విశేషాలు సులభంగా  లభ్యమవడం వలన మన పూర్వాచార్యులు పర స్వరూపము ఆవరణ జలము, వ్యూహము పాల కడలి, వర్షాకాలముల ప్రవహించు నదులు విభవములు, భూగర్భమున నున్న జలము అంతర్యామి అయితే అర్చ్యా స్వరూపము మనింటి ప్రక్కనువ్న మడుగు లాంటిది అంటారు తత్సౌలభ్యము వలన, దాహము ఎలాగైనా తీరుతుంది కాని, ఇంటి మడుగు అయితే సులభము కదా.

నేను: బ్రహ్మోపాసనలో చిచ్ఛరీరక, అచిచ్ఛరీరక బ్రహ్మోపాసన అన్నారు. కామ్య ఉపాసనలో చిదుపాసన, అచిదుపాసన అన్నారు ఎందువలన?

మామయ్య: జాగ్రత్తగా వింటున్నావన్నమాట. బ్రహ్మోపాసనలో బ్రహ్మనే ఉపాసన చేస్తాము. ఆయన చిచ్ఛరీరకునిగానూ ఉండవచ్చును, అచిచ్ఛరీరకునిగానూ ఉండవచ్చును. అంటే చిత్పదార్థము శరీరముగా కలవాడు, అచిత్పదార్థము శరీరముగా కలవాడు అని. అక్కడ ఉపాసన చేసేది, చిదచిత్తులకో, వాటి శరీరాలకో కాదు, తచ్ఛరీరకుడైన పరబ్రహ్మకే. ఉపాసకునకు ఈ విషయము తెలిసి తత్ప్రకారంగా తచ్ఛరీరకుడైన పరమాత్మనే ఉపాసన చేస్తాడు.

కాని చిదుపాసన, అచిదుపాసన అన్నప్పుడు అక్కడ ఉపాసన చేయబడేది చిదచిత్తులే, తచ్ఛరీకుడైన పరబ్రహ్మ కాదు. చిదచిత్తులను ఉపాసన చేస్తే దానికి తగినట్లు పరిమిత ఫలాలే వస్తాయి తప్ప బ్రహ్మ ప్రాప్తి కుదరదు కదా!

ఇక్కడ నీకు సంశయం రావడానికి కారణం చిదచిత్తులను బ్రహ్మగా భావించి అనడం వలన అనుకుంటాను. రాజ కుమారుడవైన నువ్వు ఆ ఊరులో గుడిసెలోకి వెళ్ళి ఆ ఇంటావిడను అమ్మగా భావించి ఆకలి తీర్చమన్నావనుకో. ఆవిడ దగ్గరున్నది ఆవిడ పెడుతుంది, కాని మీ అమ్మలా పెట్టక పోవచ్చు కదా. అలా

కాకుండా అదే గుడిసెలోమీ అమ్మ కూడా ఉండి ఉంటే నీవు  వెళ్ళి అక్కడ కూడా మీ అమ్మనే ఆకలిగా ఉంది అన్నావనుకో, అప్పుడు మీ అమ్మ అత్యుత్తమమైన సాపాటు పెట్టే ఏర్పాటు చేయగలదు. నీకర్థమవడానికి చెబుతున్నాను. ఇక్కడ అర్థమవాల్సినది ఏమిటీ అంటే ఉపాస్యుడు పరబ్రహ్మ అయితే అది బ్రహ్మోపాసనము, ఆ పరబ్రహ్మ చిదచిత్తుల అంతర్యామి గా అయినా అయినా సరే. అలాకాక చిదచిత్తులైతే అది కామ్య ఉపాసనము. ఇందాకా చెప్పిన ఉదాహరణలో వాయువును పరబ్రహ్మగా భావించి అన్నప్పుడు ఉపాస్యుడు వాయువే, పరబ్రహ్మ కాదు, ఈ భేదము తెలుసుకోవాలి.

**నేను:** అర్థమయింది మామయ్యా!

**నేను:** ఇప్పుడు చెప్పిన కారణాల వలన అక్షి పురుషుడు జీవాత్మ కాదు, మరే దేవతా విశేషమూ కూడా కాదు అని తెలుస్తోంది, కాని ప్రతిబింబము కాదు అని ఎక్కడ చెప్పేరు.

**మామయ్య:** దానికోసం తరువాత సూత్రం చూడాలి.

**అమ్మ:** ఏమిటా సూత్రము మామయ్యా!

**నేను:** అందువలననే సత్యకామ జాబాల తరువాత అర్చిరాది మార్గము గురించి చెప్పేడా?

**మామయ్య:** అదే తరువాత సూత్రములో చెబుతున్నారు.

**అమ్మ:** తరువాతి సూత్రము ఏమిటి మామయ్యా!

**మామయ్య:**

# "శ్రుతోపనిషత్కగత్యభిధానాత్ చ...1-2-17"

అంటే

శ్రుతోపనిషత్కగత్యభిధానాత్ : ఉపనిషత్తులయందు ప్రతిపాదింపబడిన పరబ్రహ్మమును (తెలుసుకొనిన వానిచే తలపదగిన అర్చిరాది మార్గము ఈ అక్షి పురుష ఉపాసకునకు) ఉపదేశించి యున్నందున

చ: కూడ

అనగా

ఉపనిషత్తులయందు ప్రతిపాదింపబడిన పరమ పురుషుని తెలుసు కొనిన వానిచే తలచ దగిన అర్చిరాది మార్గమును నేత్రమునందలి పురుషుని ఉపాసించువానికి తెలిపి యున్నందున, నేత్రమున నున్నవాడుగ చెప్పబడినది పరబ్రహ్మమే.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** పరమ పురుషుని యొక్క స్వరూపమును యథార్థముగ తెలిసికొను వానిచే తలచదగినగ శ్రుతులందు ప్రతిపాదింపబడిన, పునరావృత్తి రహితముగ పరబ్రహ్మను పొందించు అర్చిరాది మార్గమును సత్యకామ జాబాల, ఈ అక్షి పురుషుని తెలుసుకొనిన ఉప కోసలునకు ఫలముగా గా చెబుతున్నాడు. అంటే ఆ అక్షి పురుషుడు పరబ్రహ్మ తప్ప వేఱొకరు కాజాలరు.

**అమ్మ:** ఆ అర్చిరాదిని కూడా క్లుప్తంగా వివరించండి మామయ్యా!

**మామయ్య:** మానవ దేహములో 72,000 నాడులు ఉంటాయిటమ్మా. ఈ నాడులు రక్తప్రసారానికి సంబంధించిన నాడులు కావు. జ్ఞాన ప్రసరణకు సంబంధించిన నాడులు. వీటిలో 101 ప్రధానమైనవి అయితే అందులో ఇడ, పింగళ, సుషుమ్న అనే మూడు నాడులు ముఖ్యమైనవి. అందులో ఇడ అనే నాడి మెదడు కుడి అర్ధ భాగానికి, ఎడమ నాసికా రంధ్రము ద్వారా శ్వాస పీల్చుకొనడానికి, మానసిక శక్తికీ సంబంధించినది.

పింగళ అనే నాడి మెదడు యొక్క ఎడమ అర్ధ భాగానికి, కుడి నాసికా రంధ్రానికి, శారీరక శక్తికీ సంబంధించినది.

వీటన్నిటికన్నా అతి ముఖ్యమైనది సుషుమ్న నాడి. వెన్నెముక ద్వారా బ్రహ్మ రంధ్రమును చేరే ఈ నాడియే పరబ్రహ్మ జ్ఞానానికి వాహనము.

మామూలుగా మనిషి మరణించిన తరువాత జీవాత్మ బయటకు పోయేది ఏదో ఒక నాడి ద్వారానే. పుణ్యాత్ములకు ఊర్ధ్వ నాడుల ద్వారాను,పాపులకు అధో భాగాన నాడుల ద్వారాను జీవాత్మ బహిర్గతమవుతుంది. బ్రహ్మ జ్ఞానము కల వారికి మాత్రం జీవాత్మ పరబ్రహ్మ సహాయముతో బ్రహ్మ రంధ్రము ద్వారా ఈ సుషుమ్నా నాడి గుండా బహిర్గతుడవుతాడు.

**నేను:** ఈ రోజులలో యోగా ద్వారా ఈ నాడులలో జ్ఞాన ప్రసారాన్ని నియంత్రించ వచ్చునని చెబుతారు కదా!

**మామయ్య:** ఈ విషయంలో ఈ యోగా క్రియలలో ఎక్కువగా అనుసరించేది, మానసికంగా ఊహించు కొని ప్రాణ నియంత్రణ చేయడం. కాని ఈ రకమైన ఏ సాధనలకైనా, అభ్యాస ప్రక్రియలకైనా, మొట్ట మొదట కావలసినది యమ, నియమాలు అంటే అంతరింద్రియ, బాహ్యేంద్రియ నియమనం, అవి లేకుండా మరేదయినా పెద్ద ఉపయోగం ఉండదు. ఇదంతా మనకు ఇప్పుడు అక్కర లేదు కాని,

అలా బ్రహ్మ జ్ఞానము కలిగి, పరమ పురుష సాక్షాత్కారము చేసుకొని, ఆయన చే కరుణించ బడిన జీవాత్మ పరమపదానికి వెళ్ళే మార్గాన్ని క్లుప్తంగా చెబుతున్నారు ఇక్కడ.

దీని పూర్తి వివరాలు ఫలాధ్యాయమైన నాలుగో అధ్యాయములో వివరంగా వస్తుంది కనుక ఇక్కడ క్లుప్తంగా మాత్రం చెప్పుకుందాము.

"వాఙ్మనసి సంపద్యతే, మనసి ప్రాణే...." అంటూ ఈ శరీర భాగాలు ఒకదానిలో ఒకటి కలసి పోయిన తరువాత అవి జీవాత్మలో కలుస్తాయి. అటు పిమ్మట పరమాత్మ సహాయముతో బ్రహ్మ రంధ్రము భేదింపబడి జీవోత్క్రమణము ప్రారంభవుతుంది. మనం అనుదినం గుర్తుంచుకోవలసిన "పరమార్థ శ్లోకద్వయమ్" లో కూడా ఈ వివరాలున్నాయి.

ఆ జీవాత్మ ముందు అర్చిరభిమాన దేవత లోకమునకు, తరువాత అహరభిమాన దేవత లోకమునకు, తరువాత శుక్ల పక్షాభిమాన దేవత లోకమునకు, తరువాత ఉత్తరాయణాభిమాన దేవత లోకమునకు, అట నుండి ఆదిత్య లోకమునకు, అటనుండి చంద్ర లోకమునకు, అటనుండి విద్యుల్లోకమునకు చేరుతాడు.

**నేను:** విద్యుల్లోకము అంటే మెఱుపులు అవే కదా,మనకు ముందు ఈ లోకం రావాలి, తరువాత చంద్రుడు, తరువాత సూర్యుడు కదా. మరేమిటి ఇక్కడ అటునుండి ఇటు ఉన్నట్లుంది.

**మామయ్య:** ఇక్కడ ఆయా లోకాలంటే మనకు కనపడే చంద్రమండలము, సూర్య మండలము అని అనుకోకూడదు

ఇక్కడ చెప్పబడినవి ఆయా అభిమాన దేవతా స్థానాలు.

ఈ రకంగా ప్రయాణించిన జీవాత్మ విరజ దాటిన తరువాత అచటనున్న అమానవ పురుష కర స్పర్శతో ఈ సూక్ష్మ దేహము పోయి పంచోపనిషన్మయమైన దివ్య దేహము సంప్రాప్తించిన తరువాత ఆ అమానవ పురుషుడు పరమాత్మ సమీపమునకు జీవుడిని చేరుస్తాడు. దీనినే దేవమార్గమనీ, బ్రహ్మ మార్గమనీ కూడా

అంటారు. ఇలా ఈ మార్గము ద్వారా వెళ్ళినవారు ఈ లోకాలకు తిరిగి రారు. అంటే ఇలా అర్చిరాది మార్గములో పోయిన వారికి పునరావృత్తి లేదు. ఇలా అర్చిరాది మార్గంలో వెళ్ళే జీవుడికి ఆయా లోకాలలో జరిగే మర్యాదలు, పరమపద వర్ణనము, పరబ్రహ్మను పొందే విధానమూ ....ఇవన్నీ అర్చిరాది లాంటి సాంప్రదాయ గ్రంథాలలో చాలా వివరంగా ఉంటుంది. అవి చదువు కొన్నప్పుడు మనం ఆ వివరాలు గ్రహించవచ్చు.

"ఇలా పరబ్రహ్మను పొందే అర్చిరాది మార్గము చెప్పబడడం చేత కూడ నేత్రమున సాక్షాత్కరించే పురుషుడు పరబ్రహ్మ తప్ప వేరొకరు కారు" అని సూత్రము అర్థము.

## మామయ్య:

## "అనవస్థితేః అసంభవాచ్చ నేతరః...1-2-18"

అంటే

ఇతరః: ప్రతిబింబాదులు

న: అక్షి పురుషుడు కాడు(ఏలనన)

అనవస్థితేః : స్థిరముగా నుండనందున

అసంభవాత్ చ: (అమృతత్వాదులు దానిలో నుండుట) అసంభవము అగుట వలన కూడ

అనగా

ప్రతిబింబాదులు అస్థిరమగుట చేతను, అమృతత్వాదులు లేనిదగుట చేతను నేత్రముననుండున అక్షిపురుషుడు ప్రతి బింబాదులగుట సంభవము కాదు.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** నేత్రమున నుండు అక్షి పురుషుడు ప్రతిబింబాదులు కానేరదు. ఎందుకంటే

1. ప్రతిబింబము ఎదుట వేరొక పురుషుడు నిలిచి యున్నంత కాలము నేత్రమున ప్రతి ఫలించుటచే కనపడును. ఆ వేరొక పురుషుడు లేకుండిన ప్రతి బింబముండదు. అందుచేత నది నియతముగా నుండునది కాదు. అస్థిరమైనది.

2. శ్రుతి యందు చెప్పబడిన అమృతత్వమను గుణము వర్తించదు.

3. జీవుడు ఒక్క చోట నుండక తన పనులకై వేలు వేలు ప్రదేశాలలో సంచరిస్తోంటాడు. అలాంటప్పుడు ఒకే ప్రతి బింబము అన్ని చోట్ల ఉండడము అసంభవము కదా!

4. అలాకాక కిరణముల ద్వారా వేరొక దేవతావిశేషము నేత్రమున నుంచబడినది అనుటకు అట్టి దేవతా విశేషము దేశాంతరములో ఎక్కడో ఉండాలి, అలాంటప్పుడు అది చక్షుస్సుతో సంబంధించినది కానేరదు.

5. ప్రతిబింబమో, మరొక దేవతా విశేషమో అయితే ఆ అక్షి పురుషుని ఉనికి వేరొక నిమిత్తముపై ఆధార పడి ఉంటుంది, అలాగయితే కూడా అమృతత్వాదులు అసంభవము.

ఈ కారణాల వలన ఆ అక్షి పురుషుడు ప్రతి బింబాదులో, మరొక దేవతా విశేషమో అవడం కుదరదు.

అందువలన ఈ శ్రుతి వాక్యంలో అక్షి పురుషుడు గా చెప్పబడిన వాడు పరమాత్మయే.

**అమ్మ:**బాగుంది మామయ్యా! ఈ అధికరణంలో ఛాందోగ్యోపనిషత్తులో ఉపకోసల విద్య సందర్భములో నేత్రమున నున్నట్లు చెప్పబడిన "అక్షి పురుషుడు" ఆ శ్రుతి వాక్యాలలో ఆ పురుషుడు పరమాత్మకే చెందిన

సంయద్వామాది గుణాలు కలిగినట్లు చెప్పుట వలననూ, మిగిలిన శ్రుతులలో కూడా నేత్రమునందు పరమాత్మ యుండునట్లు చెప్పబడుట వలననూ,

అంతకు ముందు వాక్యాలలో అపరిమిత సుఖ విశిష్టుడుగాను, ప్రాణ విశిష్టుడుగాను చెప్పబడిన బ్రహ్మయే అక్షి పురుషుడుగా చెప్పబడి యుండుట వలననూ, అచ్చట చెప్పబడినది ప్రతీకోపాసనము కాక బ్రహ్మోపాసనమే అవడం వలననూ, ఆ తరువాత వాక్యాలలో ఆ అక్షి పురుషుని ఉపాసన చేయడం వలన జీవాత్మ అర్చిరాది మార్గములో ప్రయాణించి మఱి వెనుకకు తిరిగిరాని బ్రహ్మ ప్రాప్తిని పొందుతాడని చెప్పడం వలననూ, ఆ శ్రుతి వాక్యంలో చెప్పబడిన అమృతత్వాది గుణాలు ప్రతి బింబాదులకు గాని, కిరణములచే నేత్రమున ప్రతిష్ఠించ బడినట్లు చెప్పదగిన వేరొక దేవతా విశేషములకు గాని వర్తించకుండుట వలననూ ఆ అక్షి పురుషుడు పరబ్రహ్మయే అని అర్థం అయింది. అంతేనా మామయ్యా!

**మామయ్య:** బాగా చెప్పేవమ్మా, ఇంతటితో "అంతరాధికరణము " పూర్తి అయింది. ఈ రోజుకి ఇంతటితో ఆపుదాము. మళ్ళీ ఎప్పుడైనా తరువాతి అధికరణము చూద్దాము.

అందరూ: "యో నిత్య మచ్యుత పదాంబుజ యుగ్మ రుక్మ ....

---

## 4.అంతర్యామ్యధికరణము:

**మామయ్య:** రండమ్మా, ఎలా ఉన్నారు?

**అమ్మ:** బాగానే ఉన్నాము మామయ్యా, ఈ రోజు చెప్పుకోవలసిన అధికరణము ఏమిటి మామయ్యా!

**మామయ్య:** "అంతర్యామ్యధికరణము". దీనిలో మూడు సూత్రాలు ఉన్నాయి.

నాన్నగారు: అంటే వేగం పూర్తి అయిపోతుంది అన్న మాట. ఇది ఏ ఉపనిషద్వాక్యాల గురించి.

మామయ్య: "బృహదారణ్యకోపనిషత్తు" అని.

నేను: బృహత్ అంటే పెద్దది అని కదా, ఈ ఉపనిషత్ చాలా పెద్దదా?

మామయ్య: అవును. ఇది శుక్ల యజుర్వేదానికి సంబంధించినది. దీనిలో ఎనిమిది అధ్యాయాలు ఉన్నాయి.

నేను: ఆఱు అధ్యాయాలు అని విన్నానే!

మామయ్య: దీనిలో మొదటి ఱెండు అధ్యాయాలు "అశ్వ మేధ యాగ వివరాలు" చెబుతాయి. అవి కర్మ కాండకి సంబంధించినవి కనుక ఉపనిషద్భాగాలు కావు అని వాటిని పరిగణించకుండా మిగిలిన ఆఱు అధ్యాయాలను మాత్రమే పరిగణించే వారు కొంత మంది దీనిలో ఆఱు అధ్యాయాలే అంటారు. కాని, భగవద్రామానుజులు మొదటి ఱెండు అధ్యాయాలనూ కూడా పరిగణన లోకి తీసుకోవాలని చెప్పేరు, ఎందుకంటే విశిష్టాద్వైతము ప్రకారము కర్మ కాండ కూడా పరిహరించకూడదు కదా! ఆ లెక్కన తీసుకుంటే మనకు ఈ అధికరణానికి సంబంధించిన వాక్యాలు ఐదవ అధ్యాయములో వస్తాయి. నీ దగ్గర ఉన్న పుస్తకంలో ఒక వేళ మొత్తం ఆఱు అధ్యాయాలే ఉంటే మూడవ అధ్యాయంలో ఈ వాక్యాలు కనబడుతాయి. ఇప్పుడు మనం చర్చించే అధికరణము "అంతర్యామి బ్రాహ్మణము" అని, ఆ అధ్యాయములో ఏడవ ఖండములో  వచ్చే వాక్యాల గురించి.

నేను: ఈ బృహదారణ్యకోపనిషత్తు దేనిగురించి మామయ్యా!

**మామయ్య:** ఏ ఉపనిషత్తయినా ముఖ్యంగా చెప్పేది ఆత్మ, పరమాత్మ, ఆత్మ పరమాత్మను పొందే విధము, పొందితే ఫలము, పొందడానికి అవరోధాలు ఇవే కదా చెప్పేది. మనం ఇప్పుడు అనుకుంటున్న ఐదవ అధ్యాయము యాజ్ఞ్యవల్క్య సంవాద రూపంలో ఉంటుంది. విదేహ రాజ్యాన్ని పాలించే జనక మహారాజు తాను యజ్ఞము చేస్తూ ఆ సందర్భములో ఋత్విక్కులకు, అక్కడికి వచ్చిన బ్రాహ్మణులకు బహుమతి వితరణ చేసేడు. ఆ యజ్ఞానికి కురు, పాంచాల దేశాలనుండి అనేకమంది జ్ఞానులు, పండితులు వచ్చేరు. వారిలో ఎవరు బాగుగా వేదములను అర్థము చేసుకొనిన వారో తెలుసు కోవలెనని, జనకుడు సువర్ణముతో అలంకరించబడిన 1000 పాడి ఆవులను "మీలో ఎవ్వరు అందరికంటే గొప్ప జ్ఞానియో వారు తీసుకొని పోవలెనని" పలికేడు. అందరు బ్రాహ్మణులు ఒకరి ముఖము మరొకరు చూసుకంటూ ఎవ్వరూ ముందుకు రాకపోగా, యాజ్ఞ్యవల్క్యుడు తన శిష్యుడైన సంస్రవుడిని పిలిచి ఆ పాడి ఆవులను తోలుకొని పొమ్మని పలికేడు. అంతట అక్కడున్న బ్రాహ్మణోత్తములు కోపముతో యాజ్ఞ్యవల్క్యుడిని ప్రశ్నించడం ప్రారంభించేరు. ఇలా ప్రశ్నించిన అశ్వలుడు, ఆర్తభాగుడు, భుజ్యుడు, ఉశస్తుడు, కహోలుడు, గార్గి తో వాదము గెలిచిన తరువాత అరుణ మహర్షి కుమారుడైన ఉద్దాలకుడు ఈ విధంగా ప్రశ్నించడం ప్రారంభించేడు.

ఉద్దాలకుడు: మాద్ర దేశములో మేము పతంచలుడుఅను వాని ఇంట్లో శాస్త్రములు నేర్చుకుంటూ ఉండే వాళ్ళము. ఒకనాడు అతని భార్యను "కబంధుడు" అను గంధర్వుడు పూనేడు. ఆ గంధర్వుడు రెండు ప్రశ్నలు వేసేడు.

1. ఈ లోకమును, పై లోకములను సమస్త భూతములను కలిపి ఉంచునట్టి సూత్రము ఏది?

2. ఈ లోకమునందు కాని, పైలోకములయందు కాని సమస్త భూతములను లోపల నుండి నియంత్రించునది ఏది?

ఈ ప్రశ్నలకు పతంచలుడు సమాధానము చెప్పలేక పోయినాడు. నీవా ప్రశ్నలకు సమాధానము చెప్ప గలవా?"

యాజ్ఞ్యవల్క్యుడు ఆ మొదటి ప్రశ్నకు "వాయువు ఈ లోకములోను, ఇతర లోకములలోను సమస్త భూతములను కలిపి ఉంచుతుంద"ని సమాధానము చెప్పేడు.

ఇక ఆ రెండవ ప్రశ్నకు చెప్పిన సమాధానమే మన అధికరణానికి సంబంధించిన వాక్యాలు.

**అమ్మ:** ఏమిటా వాక్యాలు మామయ్యా!

**మామయ్య:** ఉద్దాలకుడి ప్రశ్న అన్ని లోకాలకూ, భూతాలకూ లోపలనుండి నియంత్రించేది ఏది అని కదా, దానికి సమాధానంగా ఒక్కముక్కలో చెప్పకుండా ముఖ్యమైన వేర్వేరు భూతాలను మిగిలిన వాటినీ ఒక్కొక్కటీ చెప్పి వాటిలోపల ఉండి నియంత్రించేది అంటూ సమాధానము చెప్పేడు. ఈ మంత్రాలన్నీ ఒక్కలాగే ఉంటాయి. పృథివి, నీరు అంటూ ఆ వస్తువు మాత్రము మారుతూంటుంది, అంతే.

**నేను:** ఎందుకు అన్ని సార్లు చెప్పాల్సి వచ్చింది, అన్నీ కలిపి ఒక్కసారి చెప్పకుండా.

**మామయ్య:** స్పష్టత కోసం, మళ్ళీ చెప్పడం వలన పూర్తిగా సంశయ నివృత్తి అవుతుంది కదా. అంతే కాక వేదము శ్రుతి కదా, శబ్దము కూడా ముఖ్యము, అనేక సార్లు వినడం వలన విషయం మరచిపోకుండా గుర్తు ఉంటుంది.

**అమ్మ:** ఆ వాక్యాలు చెప్పండి మామయ్యా!

**మామయ్య:** అన్నీ ఒక్కలాగే ఉంటాయి కనుక ముందు ఒక్క మంత్రము చెబుతాను.

"యః పృథివ్యామ్ తిష్ఠన్ పృథివ్యా అంతరో యమ్ పృథివీ న వేద

యస్య పృథివీ శరీరమ్ యః పృథివీమ్ అంతరో యమయతి

ఏష త ఆత్మా అంతర్యామి అమృతః"

అంటే

ఎవడు పృథివి యందు ఉండునో, అయిననూ పృథివి లోపలనుండి, పృథివి చే తెలిసికొన బడక పృథివిని తనకు శరీరముగా కలవాడై పృథివిలోనుండి దానిని నియమించుచున్నాడో అతడు ఆత్మ, అంతర్యామి, అమృతస్వరూపుడు. "

మిగిలిన మంత్రాలలో పృథివి బదులుగా "ఆపః(నీరు), అగ్ని, అంతరిక్షము, వాయువు, దివి, ఆదిత్యుడు, దిక్కులు, చంద్రుడు, నక్షత్రములు, ఆకాశము, తమస్సు, తేజస్సు, సర్వ భూతములు, ప్రాణము, వాక్కు, చక్షుస్సు, శ్రోత్రము, మనస్సు,చర్మము, రేతస్సు, సర్వ లోకములు, సర్వ వేదములు, సర్వ యజ్ఞములు అని ఉంటుంది.

ఇంకా మరొక మంత్రము గురించి చెప్పాలి.

ఈ మంత్రాలు పఠించే వాళ్ళలో "కాణ్వ శాఖ", "మాధ్యందిన శాఖ" అని రెండు శాఖలవారున్నారు. అందులో "కాణ్వశాఖవారు" మరొక మంత్రాన్ని "యో విజ్ఞానే తిష్ఠన్....." అంటూ విజ్ఞాన అని చదువుతారు. వీరి పాఠములో సర్వ లోకములు, వేదములు, సర్వ యజ్ఞములు అని ఉండదు. "మాధ్యందిన శాఖవారు" "యో ఆత్మని తిష్ఠన్" అని విజ్ఞాన అన్న చోట ఆత్మ అని చదువుతుతారన్న మాట. విజ్ఞాన అన్నా ఆత్మ అన్నా ఒకటే కదా! ఈ రెండు రకాల పాఠాలు కూడా శిష్టుల చేత అంగీకరించ బడినవే.

ఇంక ఈతని గురించి వివరిస్తూ "అతడు అన్నిటికి ద్రష్ట, కాని తాను చూడబడడు, అన్నిటినీ వింటాడు, కాని తాను వినబడడు, అన్నిటికీ మంత కాని తాను చింతించబడడు, అన్నిటినీ తెలిసినవాడు కాని తాను తెలియబడడు, ఆయన తప్ప అంతటికీ ద్రష్ట అయిన వాడు వేఱొకడు లేడు. అలాగే అన్నిటినీ వినేవాడు, అన్నిటికీ మంత, జ్ఞాని ఆయినవాడు వేరొకడు లేడు. అతడే ఆత్మ, అంతర్యామి, అమృతస్వరూపుడు, అని చెబుతుంది, శ్రుతి.

ఇప్పటిదాకా ఉపనిషద్వాక్యాలు క్లుప్తంగా చూసేము కనుక ఇంక సూత్రాలు చూద్దామా!

**అమ్మ:** అలాగే మామయ్యా, ఇంతకు ముందు అధికరణములో "స్థానాది వ్యపదేశాచ్చ" అన్న సూత్రం వివరణలో చెప్పిన "యః చక్షుషి తిష్ఠన్ " అని "నేత్రములో నున్న పురుషుడు పరమాత్మయే" అన్న దానిని ఇక్కడ వివరిస్తున్నారన్న మాట!

**మామయ్య:** అవునమ్మా, ఇందులో మొదటి సూత్రము

## "అంతర్యామి అధిదైవాది లోకాదిషు తద్ధర్మ వ్యపదేశాత్......1-2-19"

అంటే

అధిదైవాది లోకాదిషు: అధి దైవ, అధి లోకాది పదములతో కూడి యున్న వాక్యములయందు

అంతర్యామి: అంతర్యామి (గా నుపదేశించబడిన వాడు పరమాత్మయే ఏలననగా)

తద్ధర్మ వ్యపదేశాత్: (అట్టి అంతర్యామి యందు పరమాత్మ) ధర్మములు ఉన్నట్లు చెప్పబడుట చేత

అనగా

అంతర్యామి బ్రాహ్మణములో అధి దైవ, అధి లోకాది పదములతో నున్నవాక్యములయందు అంతర్యామి గా నుపదేశించబడినది పరమాత్మయే ఎందుకంటే ఆ అంతర్యామి యందు తెల్పబడిన ధర్మములు పరమాత్మకే వర్తించును

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** మనము ఇప్పుడు చదువుకున్న అంతర్యామి బ్రాహ్మణములో చెప్పినట్లు అన్నిటి లోపల వాటికి తెలియకుండా ఉంటూ, వాటిని నియంత్రించేది పరమాత్మే అంటున్నారు ఈ సూత్రములో.

**నేను:** అక్కడ ఆత్మ, అంతర్యామి, అమృతః అని కదా అంటున్నారు, దానికి తోడు అతడు చూస్తాడు, వింటాడు అంటూ అన్ని రకాల కర్మలూ చెబుతున్నారు, కళ్ళూ, ముక్కూ, చెవులూ మొదలైన ఇంద్రియాలకన్నిటికీ లోపల ఉండి వాటిని  నియంత్రిస్తాడంటున్నారు, అంటే శరీరము, అవయవాలు, ఇంద్రియాలూ ఉన్నాయన్నమాట కదా. ఇలా శరీరమూ, అవయవాలూ, ఇంద్రియాలూ ఉండేది జీవాత్మకే కదా. మరి ఈ ధర్మాలు పరమాత్మకే వర్తిస్తాయి అని ఎలా అంటాము?

**మామయ్య:** అదే వివరిస్తున్నారు భగవద్రామానుజులు.

ఇక్కడ అన్నిటిని తెలుసుకొనగలడు, ఆయనను తెలుసుకొన బడ జాలడు, అన్నిటినీ చూడ గలడు, ఆయన చూడబడ జాలడు...అంటూ వర్ణించబడిన గుణాలన్నీ సర్వజ్ఞత్వాన్నీ, సత్య సంకల్పత్వాన్నీ కదా చెబుతున్నాయి. ఈ గుణాలు వర్తించేది పరమాత్మకే.

అమృతుడు అంటే ఎప్పుడూ ఉండేవాడని కదా, అది పరమాత్మకు తప్ప మరెవరికి కుదురుతుంది. "సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్" అని పరమాత్మ ఒక్కడే ఈ సృష్టికి ముందు, చివర కూడా ఉండేది అని కదా శ్రుతి వాక్యము.

సుమారుగా ఇలాంటి మంత్రాలో చెప్పే సుబాలోపనిషత్

"నైతేహ కించన్యాగ్ర ఆసీద మూలమ్ అనాధారమ్ ఇమాః ప్రజా జాయంతే దివ్యో దేవ ఏకో నారాయణః

చక్షుశ్చ ద్రష్టవ్యమ్ చ నారాయణః

శ్రోత్రమ్ చ శ్రోతవ్యమ్ చ నారాయణః"

అంటే

"మూలము లేకయు, ఆధారము లేకయు సృష్టికి పూర్వము ఏదీ లేదు. చక్షురింద్రియమును, చూడబడు వస్తువును కూడ నారాయణుడే, శ్రోత్రేంద్రియమును వినబడునది కూడ నారాయణుడే. వాని నుండియే సమస్తము పుట్టుచున్నది "

అని ఆరంభించి ఆపై

"అంతః శరీరే నిహతో గుహాయామ్ అజ ఏకో నిత్యః యస్య పృథివీ శరీరమ్ యః పృథివీమ్ అంతరే సంచరన్ యమ్ పృథివీ న వేద యస్యాపః శరీరమ్......"

ఎవనికి పృథివి శరీరమో, ఎవడు పృథివి యందున్నను పృథివి చేత తెలియబడక యున్నాడో, ఎవనికి ఉదకములు శరీరమో ....అట్టివాడు హృదయ గుహయందున్న వాడు. ఇతడు జన్మ రహితుడును, స్వతంత్రుడును, నిత్యుడును

"ఏష సర్వ భూతాంతరాత్మా అపహత పాప్మా దివ్యః దేవ ఏకో నారాయణః"

"అతడు సర్వభూతములకు అంతరాత్మ, అపహత పాప్ముడు, ఉత్కృష్ట దేవత, ఒక్కడే అయిన నారాయణుడు"

అనగా

"అట్టి సర్వభూతాంతరాత్మ పరమాత్మ నారాయణుడు" అని సుబాలోపనిషత్ వివరించింది.

అందువలన ఇక్కడ కూడా సర్వమునకు ఆత్మయు, సర్వము తనకు శరీరముగా కలవాడును, సర్వమును నియమించువాడును పరమాత్మయే.

ఇంక నువ్వు చెప్పినట్లు పరమాత్మకు ప్రాకృతిక ఇంద్రియాదులు లేకపోయినా సర్వజ్ఞుడు, సత్య సంకల్పుడైన నాతనికి ద్రష్టగా, శ్రోతగా నుండుట స్వాభావికమేకాని ఇంద్రియాధీనము కాదు. అందుకే శ్రుతి "పశ్యతి అచక్షుః శృణోతి అకరణః..." అంటూ "ప్రాకృతికమైన చక్షురింద్రియమును, శ్రోత్రేంద్రియమును లేకున్నను చూచుట, వినుట మొదలగు కార్యములు నిర్వహించుచున్నాడు" అని చెబుతోంది. పరమాత్మకు కర్మ సంబంధము లేదు అన్న విషయము అపహత పాప్మ అను పదముచే సూచితమవుతోంది. అందుచే ఆయన కార్య కలాపములు స్వాభావికములు. ఏకః అనుటచే అట్టివాడు వేరొకడు లేకపోవడం వలన "యమ్ పృథివీ న వేద.." అని పృథివ్యాదులు ఆయనను తెలియజాలవు అని అర్థమవుతోంది.

మన శరీరేంద్రియ నియంత్రణ సామర్థ్యము పరిమితమైనది. గుండె కొట్టుకోవడం కాని, తల పూర్తిగా త్రిప్పడంగాని మనం చేయలేము. పరమాత్మ అట్లు కాక స్వాభావికముగా సంపూర్ణ నియంతృత్వము కలవాడు. ఈ సంపూర్ణ నియంతృత్వము వేరెవ్వరికీ కుదరని పని.

"అంతః ప్రవిష్టః శాస్తా జనానామ్ సర్వాత్మా" (తై. ఉ.) అన్నట్లు పరమాత్మయే జనులలోపల ప్రవేశించి వారలను నియమించును అనియును

"తదనుప్రవిశ్య సచ్చ త్యచ్చాభవత్"(తై.ఉ.) అన్నట్లు "పరమాత్మ దానియందు అనుప్రవేశము చేసి చేతనా చేతన పదార్థములుగ అయ్యెను" అనియును

"తదనుప్రవిశ్య నామ రూప వ్యాకరవాణి" అనినట్లు "పరమాత్మ తాను అనుప్రవేశము చేసి నామ రూప విభాగము చేసెను" అనియును

మిగిలిన ఉపనిషత్తుల నుండి కూడా తెలుస్తోంది కనుక ఇక్కడ చెప్పబడినది పరమాత్మయే

ఇంక నీ సంశయము ఆత్మా అని చెప్పబడినది అనే కదా, అక్కడ చెప్పబడినది "ఏష త ఆత్మా" అనగా "ఇతడు నీ యొక్క ఆత్మ" అని అర్థము. నీవు అంటే జీవాత్మ. జీవాత్మ యొక్క ఆత్మ అంటే జీవాత్మ కంటె వేరయిన పరమాత్మయే కాని మళ్ళీ జీవాత్మ అని కాదు. ఆప్నోతీతి ఆత్మా అను వ్యుత్పత్తి బట్టి ఆత్మ శబ్దము పరమాత్మకు వర్తిస్తుంది.

ఈ పై కారణాలవలన అంతర్యామి, అంతరాత్మ అని ఈ శ్రుతిలో చెప్పబడినది పరమాత్మయే.

**నేను:** పై ఉపనిషద్వాక్యాలలో "పృథివ్యామ్ తిష్ఠన్ పృథివ్యా అంతరో" అని రెండు సార్లు ఎందుకు వాడడం?

**మామయ్య:** పృథివ్యామ్ తిష్ఠన్ అని వాడడం వలన ఆ అంతర్యామి పృథివి కాదు అని తెలుస్తోంది. అలాగే అంతరో యమయతి అనడం వలన బయట నుండే మరో పదార్థము కాదని తెలుస్తోంది, అందుచేత ఆ అంతర్యామి నువ్వుకాదు, బాహ్యంగా ఉన్న మరో పదార్థమూ కాదు, అంటే ఆ అంతర్యామి పరమాత్మే అన్న మాట.

**నేను:** ఆ అంతర్యామి జీవాత్మ కాకపోతే ప్రకృతి పదార్థము ఏదయినా కావచ్చు కదా!

**మామయ్య:** దీనినే తరువాత సూత్రములో వివరిస్తున్నారు

**అమ్మ:** ఏమిటి ఆ సూత్రము మామయ్యా!

మామయ్య:

## "న చ స్మార్తమతద్ధర్మాభిలాపాచ్ఛారీరశ్చ....1-2-20"

అంటే

(ఆ అంతర్యామి/ అంతరాత్మ) స్మార్తమ్: ప్రకృతియును,

శారీరశ్చ: జీవుడును

న: కాడు(ఏలనన)

అతద్ధర్మాభిలాపాత్: (ప్రకృతి యందును జీవుని యందును) ఉండజాలనివి అగు ధర్మములు (అట్టి అంతరాత్మ యందు) గలవని చెప్పియున్నందున

అనగా

అంతరాత్మగా చెప్ప బడినవాడు ప్రకృతి గాని, జీవుడు గాని కాడు. ఏలనన ప్రకృతి యందును, జీవుని యందును ఉండని ధర్మములు వాని యందు ఉండునవిగ చెప్పబడినవి కనుక.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

మామయ్య: ఇక్కడ చెప్పబడిన ధర్మములు

సర్వ నియంతృత్వము: సర్వమును నియంత్రించగల సామర్థ్యము.

ఇది పరమాత్మకు తప్ప ప్రకృతి పదార్థమునకు గాని జీవాత్మకు గాని వర్తించదు. మన గుండె కొట్టుకోవడమే మనం నియంత్రించలేము. ఇంక అచేతనమైన ప్రకృతికి ఖచ్చితంగా ఇది వర్తించదు.

అమృతత్వము: ఎల్లప్పుడు ఉండగల సామర్థ్యము.

సృష్టికి ముందు, ప్రళయకాలమున జీవ, ప్రకృతులు పరమాత్మలో లయమగును.

సమస్తమును తెలుసుకొన గలుగుట, చూడగలుగుట....వంటి కార్యములు:

ఇది అచేతనమగు ప్రకృతికి గాని, పరిమిత శక్తి, సామర్థ్యములున్న జీవాత్మలకు గాని కుదరదు.

సకలమునకు లోన నుండి ఆత్మ యగుట:

ఒక జీవాత్మ తానుండు శరీరమునకు మాత్రము లోన నుండి ఆత్మ కావచ్చును, కాని సమస్త వస్తువులకు ఆత్మ కాజాలడు. ప్రకృతికి కూడ ఈ సామర్థ్యము లేదు.

"అందువలన ఈ శ్రుతి యందు చెప్పబడినది పరమాత్మయే తప్ప ప్రకృతి గాని, జీవుడు కాని కానేరదు" అని వివరిస్తున్నారు.

**నేను:** మీరు చెప్పినట్లు కాణ్వపాఠము ప్రకారము, మాధ్యందిన పాఠము ప్రకారము కూడా ఇంతేనా, లేక ఏదైనా ఒక దాని ప్రకారము వేఱుగా అన్వయమూ, వ్యాఖ్యానమూ ఉండవచ్చా!

**మామయ్య:** ఆ సంశయాన్ని తరువాత సూత్రంలో తీరుస్తున్నారు.

**అమ్మ:** ఏమిటి ఆ సూత్రం మామయ్యా!

**మామయ్య:**

## "ఉభయః అపి హి భేదేనైనమధీయతే...1-2-21"

అంటే

హి: ఏలననగా

ఉభయః అపి: కాణ్వ, మాధ్యందినులు ఇర్వురూ కూడా

ఏనమ్: ఈ జీవుని

భేదేన: (అట్టి అంతరాత్మ కంటే) వేరయిన వానిగా

అధీయతే: పఠించుచున్నారు.

అనగా

కాణ్వ, మాధ్యందినులు ఇరువురూ కూడా జీవుని అంతరాత్మ అయిన అంతర్యామి కంటే వేఱయినది గానే పఠించుచున్నారు.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** ఇందాకా మనం అనుకున్నట్లు, కాణ్వులు " యో విజ్ఞానే తిష్ఠన్" అనిన్నీ మాధ్యందినులు "యో ఆత్మని తిష్ఠన్" అనిన్నీ పఠిస్తారు. ఇక్కడ విజ్ఞానము అన్నా, ఆత్మ అన్నా జీవాత్మయే, అందుచేత "ఎవడు జీవాత్మ లో ఉండి, జీవాత్మకు తెలియకుండా జీవాత్మయే శరీరముగా కలవాడై లోననుండి నియమించు చున్నాడో" అని దీని అర్థము. జీవాత్మ లోననుండి జీవాత్మకు తెలియకుండా, జీవాత్మను నియమించేది మళ్ళీ జీవాత్మ కాలేదు, అచేతనమైన ప్రకృతి అంతకంటే కాదు. అందువలన రెండు పాఠాలలోను చెప్పబడినది పరమాత్మే అని తెలుస్తోంది.

అందువలన అమృతుడు, అపహిత పాప్ముడు, సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి అయిన పరమాత్మచే నియమించబడు జీవాత్మ పరమాత్మ కంటె విలక్షణుడు అనే కాణ్వ, మాధ్యందిన పాఠాలు రెండూ కూడా తెలుపుతాయి. ఆ రెండు పాఠాలకు ఈ విషయంలో భిన్నాభిప్రాయము లేదు.

అమ్మ: బాగుంది మామయ్యా, ఈ అధికరణంలో "బృహదారణ్యఉపనిషత్తు" లో అంతర్యామి బ్రాహ్మణములో అంతర్యామి అని చెప్పబడిన వానికి పరమాత్మ ధర్మములు చెప్పడం వలననూ, ప్రకృతి యందునూ, జీవుని

యందునూ ఆ ధర్మములు లేక పోవడం వలననూ, కాణ్వ, మాధ్యందిన పాఠాలలో రెండింటిలోను కూడా జీవాత్మలో జీవాత్మకు తెలియకుండా జీవాత్మకు ఆత్మగా ఉండి నియంత్రించే అంతర్యామి గూర్చి ఒక్కలాగే చెప్పడం వలననూ, ఆ అంతర్యామి పరమాత్మయే అని తెలుస్తోంది" అని వివరించేరు.

**మామయ్య:** బాగా చెప్పేవమ్మా, ఇంతటితో అంతర్యామ్యధికరణము పూర్తి అయినది, తరువాత అధికరణము మరొక రోజు చూద్దాము.

అందరూ: "యో నిత్య మచ్యుత పదాంబుజ యుగ్మ రుక్మ...."

---

## 5.అదృశ్యత్వాది గుణకాధికరణము:

**మామయ్య:** రావోయ్ బావా, సెలవులేనా, లేక స్పెషల్ క్లాసులంటూ ఇంకా కాలేజీకి వెళుతున్నావా!

**అమ్మ:** మీకు తెలుసును కద మామయ్యా, ఆయనకు సెలవులని మాటే కాని, పేపర్లు దిద్దుకోవడాలూ,కాలేజీ లో టైమ్ టేబుల్ సెట్ చేసుకోవడాలూ, కోర్సులు పూర్తవలేదని స్పెషల్ క్లాసులు, మావారి పాఠాలు ఎంతకీ తెమలవు మరి, దానికి తోడు ఎవళ్ళో కుర్రాళ్ళు సందేహాలంటూ వస్తూ ఉండడం, ఇలాగే గడచి పోతుంది సెలవుల కాలమంతా,

**మామయ్య:** అవునమ్మా, ఇదుగో ఈ మిష మీద తరచుగా వస్తున్నారు కాని, లేకపోతే అతనికి ఎప్పుడూ తీరిక ఉండదన్నది తెలిసినదే కదా!

**నాన్నగారు:** అది సరే, నాకు ఈ చర్చల వలన ఒక విషయం తెలిసిందోయ్, ఈ ఉపనిషత్తులలో ఆత్మ, విజ్ఞానము, సత్, బ్రహ్మ, అంతరాత్మ ...అని ఉన్న పదాలన్నీ అటు పరమాత్మకూ వర్తిస్తాయి, ఇటు జీవాత్మకీ వర్తిస్తాయి, దానితో వస్తోంది చిక్కు.

మామయ్య: బాగా చెప్పేవు, కాని మరొక పదము వదిలీసేవు. "అక్షర" అని

నాన్నగారు: అవునవును. ఆమధ్య "అక్షర" అంటే జీవాత్మా, ప్రకృతియా అని చర్చ వచ్చింది.

మామయ్య: "అక్షర" అంటే జీవాత్మ, ప్రకృతి మాత్రమే కాదు, పరమాత్మ కూడా కావచ్చు. ఈ రోజు మనం చదువుకొనే దానిలో తగువు అదే!

నాన్నగారు: అది ఏ ఉపనిషత్తు లోనిది?

మామయ్య: "ముండకోపనిషత్ " అని ఇది అధర్వణ వేదాంతర్గతము. దీనిలో ఆఱు ఖండాలున్నాయి, ఈ ఖండాలనే ముండకాలని కూడా అంటారు.

నేను: ఈ ముండకము అంటే అదోలా ఉన్నట్లుంది..

మామయ్య: ముండనము అంటే సంపూర్ణ శిరఃకేశ నివృత్తి కదా, కేశములు అజ్ఞాన చిహ్నములు. సంపూర్ణ అజ్ఞాన నివృత్తి ఈ ఉపనిషదవిజ్ఞానము వలన కలుగుతుందని అందువలన దీనికా పేరు వచ్చిందని కొందరి అభిప్రాయము, మరి కొంతమంది ఈ అభిప్రాయముతో ఏకీభవించరనుకో.

నేను: ఈ ఉపనిషత్ దేనిగురించి మామయ్యా!

మామయ్య: ఈ ఉపనిషత్తులో "అక్షర" శబ్దముతో పరమాత్మను నిర్దేశించి, మనం ఇంతకు ముందు అనుకున్నట్లు గానే అట్టి పరమాత్మను పొందుటకు సాధనము, తత్ఫలితము, దాన్ని పొందుటకు అవరోధాలు...ఇలా అన్నీ చెప్పబడ్డాయి. దీనికే "అక్షర బ్రహ్మ విద్య" అని పేరు. అయితే ఇదే ఉపనిషత్ లో

"అక్షర" అంటే ప్రకృతి అని కూడా ఒక చోట చెప్పుకోవాలి. మీ నాన్న అన్నట్లు అదే చిక్కు. ఆ విషయం తరువాత చూద్దాం.

**నేను:** ఈ ఉపనిషత్ గురించి కొంచెం చెప్పండి మామయ్యా,

**మామయ్య:** మిగిలిన కొన్ని ఉపనిషత్తులలాగ దీనికి పెద్ద కథేమీ లేదు. ఈ సృష్టిలో పరమాత్మ చేత మొదట సృష్టించబడిన వాడు చతుర్ముఖ బ్రహ్మ కదా. ఆయన తన ప్రథమ పుత్రుడైన అధర్వ మహర్షికి సర్వ విద్యలకు మూలమైన ఈ "అక్షర బ్రహ్మ విద్య" ను ఉపదేశించేడు.

**నేను:** చతుర్ముఖ బ్రహ్మ మొదటి కొడుకు అధర్వుడా?

**మామయ్య:** ఆయా కల్పాలలో జరిగిన సృష్టులలో ఏదో ఒక సారి అని అంటారు, ఆ అధర్వుడు "అంగిర్ మహర్షి"కీ, ఆయన "సత్యవాహుడ"ను మహర్షికీ ఆయన "అంగిరస్" అను మహర్షికీ ఉపదేశించేడు. ఆయన వద్దకు శౌనక మహర్షి వచ్చి "ఇదమ్ సర్వమ్ కస్మిన్ విజ్ఞాతే విజ్ఞాతమ్ భవతి" అంటే "ఈ కనబడుతున్నదంతా ఏ పదార్థమును గురించి తెలుసుకుంటే తెలిసికొన బడుతుంది" అని అడిగేడుట.

**నేను:** ఇదేదో మీరు ఇంతకుముందు చెప్పిన ఛాందోగ్యోపనిషత్ లో సద్విద్యా ప్రకరణంలో కథలా ఉంది, ఇక్కడ కూడా, మట్టి, కుండలూ అవీ మళ్ళీ చెప్పేరా!

**మామయ్య:** విషయం అలాంటిదే, ఎందుకంటే చెప్పబడిన పరమాత్మ ఒక్కడే కదా! కార్య, కారణ సంబంధమూ అదే. కాని సమాధానము చెప్పిన విధానము, దృష్టాంతాలు ఇక్కడ వేరు, ఆ మంత్రాలు చెబుతాను విను

"తస్మై సహోవాచ- ద్వే విద్యే వేదితవ్యే

ఇతిహాస్మ యద్బ్రహ్మవిదో వదంతి- పరా చ ఏవ అపరాచ

అంటే

"ఆ శౌనకునికి అంగిరస్ మహర్షి ఏ బ్రహ్మమును పొందుటకు "పరా", అని "అపరా" అని రెండు విధములైన జ్ఞానములు పొందబడాలని వేదవేత్తలు చెబుతారో ఆ బ్రహ్మ జ్ఞానము చేత సమస్త విశ్వ విజ్ఞానము కలుగును".

**నేను:** బాగుంది, ఏదో ఒకటి తెలుసుకుంటే అంతా తెలుసుకోవాలి అనుకుంటే "పరా విద్య, అపరా విద్య" అంటూ ప్రారంభించేరే. అదెలా?

**మామయ్య:** ఒక గురువుగారు "మేఘ సందేశము" చెప్పడానికి ప్రారంభించి "కశ్చిత్ కాంతా..." అన్న వెంటనే వెనకటికి నీలాంటి శిష్యుడు "తప్పుకదండీ కాంతా స్త్రీ లింగము, దానికి కశ్చిత్ అంటూ పుంలింగాన్ని ఎలా వాడుతారు, ఇంతకీ ఎవరండీ ఆ అమ్మాయి" అని అడిగేడుట, పూర్తిగా వినడానికి, అర్థం చేసుకోవడానికి ముందుగా.

ఇందాకా మంత్రానికి "ఏ బ్రహ్మను పొందుటకు ఆ రెండు విద్యలు అవసరమో ఆ పరబ్రహ్మ యొక్క జ్ఞానము వలననే సర్వ విజ్ఞానము తెలియును" అని అర్థము.

**నేను:** ఏమిటవి?

**మామయ్య:**

"తత్రాపరా, ఋగ్వేదో యజుర్వేదః సామవేదః అధర్వవేదః

శిక్షా, కల్పో, వ్యాకరణమ్, నిరుక్తమ్, ఛన్దో, జ్యోతిషమితి

అథ పరా యయా తదక్షరమధిగమ్యతే.

అందు అపరా విద్య అనగా ఋగ్వేదము మొదలగు నాలుగు వేదములు, వేదాంగాలూను.

పరా విద్య అంటే "ఏ భక్తి రూపాపన్న జ్ఞానము చేత అక్షర శబ్ద వాచ్యుడైన ఆ పరబ్రహ్మ సాక్షాత్కరింపబడునో" అది పరా విద్య.అంటే బ్రహ్మమును పొందగోరు ముముక్షువు బ్రహ్మమును గురించి మొదట వేదశాస్త్ర జన్యమైన పరోక్ష జ్ఞానమును, పిదప అట్టి బ్రహ్మమును అపరోక్షముగా దర్శించుటకు హేతువగు ఉపాసన శబ్దవాచ్య భక్తి రూపాపన్న జ్ఞానాన్ని పొందాలని అర్ధము.

**నేను**: వేద, వేదాంగాలు అపర విద్య, ఉపనిషద్విద్య పర విద్య అని కాదా!

**మామయ్య**: అంటే ఉపనిషత్తులు వేదాల కంటే వేఱని ఎలాగంటావు, అవి వేదాలలో అంతర్భాగమే కదా.

అందు వలన వాటిని వేర్వేరు అని చెప్పకూడదు.

ఇంక ఆ పరబ్రహ్మ ఎలా ఉంటుంది అంటే

"యత్తత్ అద్రేశ్యమ్ అగ్రాహ్యమ్ అగోత్రమ్ అవర్ణమ్ అచక్షుః శ్రోత్రమ్

తదపాణి పాదమ్ నిత్యమ్ విభుమ్ సర్వగతమ్ సుసూక్ష్మమ్ తదవ్యయమ్ యద్భూతయోనిమ్ పరిపశ్యంతి ధీరాః||

కళ్ళు లాంటి ప్రాకృత జ్ఞానేంద్రియములతో తెలియబడనిది, చేతులు లాంటి ప్రాకృత కర్మేంద్రియములకు అందనిది, కులము లేనిది, వర్ణము(జాతి) లేనిది, కళ్ళు లాంటి జ్ఞానేంద్రియాలు కాని కాళ్ళ లాంటి కర్మేంద్రియాలు కాని లేనిది అయిన ఏ ప్రసిద్ధమైన బ్రహ్మము కలదో అదే అక్షర శబ్దవాచ్యము.

ఇది నిత్యమగుట వలన కాల పరిచ్ఛేదమును, సర్వవ్యాపకత వలన దేశ పరిచ్ఛేదమును, అత్యంత సూక్ష్మమైనదియై సమస్త వస్తువుల యందు అంతర్యామిగా ఉండుట వలన వస్తు పరిచ్ఛేదమును

లేనిదనియు, పుట్టుట, నశించుట, పెరుగుట, తరుగుట, ఉండుట, మారుట వంటి భావ వికారాలు లేని దనియు, దాని నుండే ఈ సమస్తమూ వచ్చిందనియూ తత్త్వవేత్తలు చెప్పుదురు.

**యస్మాత్పరమ్ నాపరమస్తి కించిత్**

**యస్మాన్నాణీయో నజ్యాయోస్తి కశ్చిత్**

**వృక్ష ఇవ స్తబ్ధో దివి తిష్ఠత్యేకః**

**తేనేదమ్ పూర్ణమ్ పురుషేణ సర్వమ్**

ఏ పరమాత్మ కంటే వేరే అధికమైనది కాని, సూక్ష్మమైనది కాని, గొప్పది కాని లేదో ఏకైకమైన ఆ పరమాత్మ ఎవరికీ లోబడక తనకు సమానులు కాని, తన కంటె గొప్పవారు కాని లేని వాడై పరమపదమున నుండును. ఆతని చేత ఈ ప్రపంచమంతయు వ్యాపింప బడి యున్నది.

**యథోర్ణనాభిః సృజతే గృహ్ణాతే చ**

**యథా పృథివ్యామ్ ఓషధయః సంభవంతి**

**యథా సతః పురుషాత్ కేశలోమాని**

**తథా క్షరాత సంభవతీహ విశ్వమ్**

ఎలాగయితే సాలెపురుగు తనలోనుండి దారములను సృజించి గూడును కట్టి తరువాత తిరిగి తనలోనే దానిని ఇముడ్చుకొనునో, ఎలా ఓషధులు భూమియందు పుట్టుచుండునో, ఎట్లు జీవించి యున్న వానికి తల వెంట్రుకలు, శరీర రోమములు ఉద్భవించుచుండునో అలాగే ఈ ప్రపంచమంతా అక్షరబ్రహ్మము నుండి పుట్టుచున్నది.

**నేను**: సద్విద్యా ప్రకరణంలో లాగే కారణ-కార్యాలకు దృష్టాంతాలు చెప్పేరన్న మాట. కాని మూడు దృష్టాంతాలు ఎందుకు, ఒకటి సరిపోదా?

**మామయ్య**: అక్కడ సద్విద్యా ప్రకరణంలో మట్టి-కుండలు దృష్టాంతములో కుండలు తయారవడానికి మట్టి అనే ఉపాదాన కారణంతో బాటు కుమ్మరి కావాలి, చక్రము కర్ర అవీ కావాలి అనిపిస్తుంది. వీటిని నిమిత్త, సహకారి కారణాలు అంటారు. కాని సాలె పురుగు దృష్టాంతములో వేరొక సహాయము లేకుండా సాలెపురుగు తన గూడును కట్టుకోవడం, మళ్ళీ ఆ గూడును తనే లోనికి గ్రహించడం చేస్తుంది. అంటే పరమాత్మకు ఈ సృష్ట్యాదులు చేయడానికి వేరొక సహాయము అక్కరలేదన్న మాట.

అక్కడ మట్టి తన ఆకారం మారి కుండలూ అవీ అవుతోంది. కాని భూమి నుండి ఓషధులూ అవీ పుట్టడానికి భూమి ఎట్టి రూపాంతర, పరిణామాలు పొందకుండానే అవి ఉత్పత్తి అవుతాయి. అలాగే పరమాత్మలో ఏ పరిణామమూ అక్కరలేకుండానే జగత్సృష్టి జరుగుతుంది అన్న మాట.

మట్టి నుండి కుండ వచ్చినప్పుడు రెండూ అచేతనాలే. కాని చైతన్యవంతమైన పరమాత్మనుండి అచేతనమైన ప్రకృతి ఎలా వస్తుంది అంటే జీవించి యున్న మానవ శరీరమునుండి నిర్జీవమైన తల వెండ్రుకలు, రోమములు వస్తున్నట్లు అదీ సంభవమే అని చెప్పడానికి ఈ ఉదాహరణము.

**నేను**: చాలా బాగుంది. తరువాత

**మామయ్య**:

తపసా చీయతే బ్రహ్మ తతోన్నమ్ అభిజాయతే

అన్నాత్ ప్రాణః మనస్సత్యమ్ లోకాః కర్మసు చ అమృతమ్

సంకల్పమాత్రము చేత అక్షర శబ్దవాచ్యుడగు పరమాత్మ చేత ప్రకృతియు, ఆ ప్రకృతినుండి ప్రాణమును, జ్ఞానసాధనమగు మనస్సును, సత్యశబ్ద వాచ్యమగు జీవ వర్గము, స్వర్గాది లోకములు, యజ్ఞాది కర్మలలో మోక్ష సాధనమగు కర్మయును సృష్టింపబడును.

ఇక్కడ సృష్టి అంటే అవస్థాంతర ప్రాప్తి అని అర్థం చేసుకోవాలి, ఎందుకంటే ఈ జీవ, ప్రకృతులు ఎప్పుడూ ఉండేవే కదా, సూక్ష్మావస్థలోనో, స్థూలావస్థలోనో ఏదో ఒక అవస్థలో.

యః సర్వజ్ఞః సర్వవిత్ యస్య జ్ఞానమయమ్ తపః

తస్మాదేతత్ బ్రహ్మ నామరూపమన్నంచ జాయతే.

ఏ అక్షరబ్రహ్మము సర్వ స్వరూపమును ఎఱిగిన వాడో, ఆయా వస్తువుల స్వభావములు, విశేషములు ప్రత్యేకముగా తెలిసినవాడో, ఆ అక్షర బ్రహ్మమునకు సంకల్ప జ్ఞానరూపమే తపస్సు. ఆయన వలననే ఈ ప్రకృతి అంతా నామరూపములు కలదిగాను, అలాగే ఆయన సంకల్పముచే నామ రూప విభాగము పొందిన జీవులకు భోగ్యమైనది గాను అవుతోంది.

అని ఇలా "అక్షర పరబ్రహ్మమును గురించి చెప్పారు మొదటి ఖండములో.

ఆ అక్షర పరబ్రహ్మమును పొందడం ఎలాగో ద్వితీయ ఖండములో వివరిస్తారు.

మంత్రేషు కర్మాణి కవయః యాన్యపశ్యన్

తాని త్రేతాయామ్ బహుధా సంతతాని

తాన్యాచరథ నియతమ్ సత్యకామాః

ఏష వః పంథాః సుకృతస్య లోకే

సమస్తమునకు ఉపాదాన కారణమైనది, ఉత్పత్తి, వినాశాది భావ వికార రహితమైనది అయిన అక్షర పరబ్రహ్మాన్ని ఋషులు ఏ హోమ, యజ్ఞాది కర్మల వలన తెలిసికొనిరో ఆయా కర్మలు మీ మీ అధికారమును బట్టి ఆ అక్షర బ్రహ్మ సాన్నిధ్యము కొఱకు మీరు చేయవలెను. బ్రహ్మ జ్ఞానమునకు ఫలమగు మోక్షమునకు ఇదియే మార్గము.

ప్లవాహ్యేతే అదృఢాః యజ్ఞరూపాః

అష్టాదశోక్తమ్ అవరమ్ యేషు కర్మ

ఏతత్ శ్రేయో యే అభినందంతి మూఢాః

జరామృత్యుమ్ తే పునరేవాపియంతి

అష్టాదశ స్మృతి గ్రంథములలో చెప్పబడిన కర్మలు క్షుద్ర ఫలాపేక్షతో చేసేవారు శిథిలములైన ఓడల వంటివారు, సంసార సాగరమును వారు దాటలేరు.

తపశ్శ్రద్ధే యేహ్యు పవసంతి అరణ్యే

శాంతా విద్వాంసః భైక్షచర్యామ్ చరంతః

సూర్యద్వారేణ తే విరజాః ప్రయాంతి

యత్రామృతః స పురుషో హ్యవ్యాత్మా

(కనుక క్షణిక భోగములపై ఆశలేక) బ్రహ్మ జ్ఞానమును సంపాదించి శాంత మనస్కులై అరణ్యమందుండి తపశ్శ్రద్ధలను అనగా తమ ఆశ్రమోచిత కర్మను, బ్రహ్మోపాసన రూప జ్ఞానోపాసనను అనుష్ఠించువారు పరమ పురుష సాన్నిధ్యమును పొందుదురు.

నేను: అంటే విహిత కర్మలాచరించాలి, కాని ఫలాపేక్ష లేకుండా. దానితో బాటు బ్రహ్మోపాసన కూడా నిస్సంగత్వంతో చేస్తూండాలి. అలాగయితే కాని మోక్షం రాదన్న మాట.

మామయ్య: ఈ విషయమే భగవద్గీత లోనైనా, ఈశావస్యోపనిషత్ లోనైనా, మిగిలిన ఉపనిషత్తులలోను, పురాణాలలోనూ అయినా చెప్పేది.

ఇలా చెప్పి దానికోసం బ్రహ్మ సాక్షాత్కారము కల సదాచార్యుని సచ్ఛిష్య లక్షణాలతో ఆశ్రయించాలి అని చెబుతుంది ఉపనిషత్.

ఇంక మూడవ ఖండములో

యథా సుదీప్తాత్ పావకాత్ విస్ఫులింగాః

సహస్రశః ప్రభవంతే సరూపాః

తథాక్షరాద్వివిధాః సోమ్య! భావాః

ప్రజాయంతే తత్ర చ ఏవాపియంతి

ఈ అక్షర పరబ్రహ్మము నుండి, బాగుగా జ్వలించుచున్న అగ్ని నుండి అనేకమైన విస్ఫులింగాలు పుడుతున్నట్లు, చేతనాచేతనములు ఉద్భవిస్తూంటాయి. అంటే ఈ చేతనాచేతనాలు ఆ అక్షరపరబ్రహ్మ అంశములే అన్న మాట.

దివ్యోహ్యమూర్తః పురుషః స బాహ్యాభ్యంతరోహ్యజః

అప్రాణోహ్య మనాశ్శుభ్రో హ్యక్షరాత్ పరతః పరః

దివ్యలోక వాసియును, హస్త పాదాది అవయవ సహిత శరీర రహితుడును, సమస్తమునకు లోన, బయట కూడ వ్యాపించి యున్నవాడును, ప్రాణము, మనస్సు లేనివాడును, దోషహీనుడును, అక్షర శబ్ద వాచ్యుడును అగు ఆ పరబ్రహ్మ అక్షరమనబడు సూక్ష్మ ప్రకృతి కంటె అధికుడగు జీవ సమష్టి రూపుడగు చతుర్ముఖ బ్రహ్మ కంటె అధికుడు.

నేను: ఇక్కడేనా అక్షరమ్ అంటే ప్రకృతి అని కూడా వచ్చింది, అంతకు ముందంతా పరమాత్మ అని చెప్పి ఇక్కడ అక్షరమ్ అంటే ప్రకృతి అంటే ఎలాగవుతుంది?

మామయ్య: "మహాన్ అవ్యక్తే లీయతే, అవ్యక్తమ్ అక్షరే, అక్షరమ్ తమసి లీయతే, తమః పరే ఏకీ భవతి" అని కదా సుబాలోపనిషత్ చెబుతుంది. అంటే "మహా ప్రళయమున పృధివ్యాది తత్త్వాలు ఒకదానితో ఒకటి క్రమముగా లయమవుతూ, మహత్తత్త్వము అవ్యక్తమునను, అవ్యక్తము అక్షరమునను, అక్షరము తమస్సునను తమస్సు పరమాత్మ యందును లయమొందును" అని అర్థము. ఇక్కడ అవ్యక్త, అక్షర, తమః అన్నవి మూడూ ప్రకృతి అవస్థా భేదాలే. ఇక్కడ అక్షరమంటే గుణ త్రయ సామ్యము కూడ అస్పష్టముగానుండి చేతన వర్గ గర్భితమైన ప్రకృతికి "అక్షరమ"ని పేరు.

ఈ "అక్షరపరబ్రహ్మము"?నుండే సకల భూతాలూ, చంద్ర సూర్యాదులూ, సమస్త లోకాలు, యజ్ఞయాగాదులు, వేద వేదాంగాలూ, ఓషధులూ... పుట్టేయని ఫలాపేక్షరహితమైన కర్మానుష్ఠానముతో బాటు,శ్రద్ధాపూర్వకమైన తదుపాసనే మనకందరకూ మోక్ష మార్గమనీ చెబుతూ, ఇక్కడ అక్షరాత్పరతః పరః అని అక్షరానికంటె అధికుడైన వాడి కంటె అధికుడు అంటే ఇబ్బంది ప్రారంభమయింది. అందుకే భగవద్రామానుజుల వివరణ అవసరమయింది ఈ అధికరణంలో.

అమ్మ: ఏమిటి ఆ అధికరణము మామయ్యా!

**మామయ్య:** అదృశ్యత్వాది గుణకాధికరణము అని, దీనిలో మూడు సూత్రాలున్నాయి.

అందులో మొదటి సూత్రము

## "అదృశ్యత్వాది గుణకో ధర్మోక్తేః....1-2-22"

అంటే

అదృశ్యత్వాది గుణకః అదృశ్యత్వము మొదలగు గుణములు కలిగి యున్నట్లు  శ్రుతి యందు చెప్పబడిన వాడు(పరమాత్మయే ఏలనన)

ధర్మోక్తేః (ఇచ్చట పరమాత్మ యొక్క ) ధర్మములు చెప్పబడుచున్నవి.

అనగా

శ్రుతి యందు అదృశ్యత్వము మొదలైన గుణములున్నట్లు చెప్పబడిన వాడు పరమాత్మయే. ఎందుకంటే ఇచ్చట పరమాత్మ యొక్క అసాధారణ గుణములే చెప్పబడుచున్నవి.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** ఇక్కడ సంశయము ఏమిటంటే ఇందాకా మనము చెప్పుకున్న శ్రుతి వాక్యాలలో "అక్షరాత్ పరతః పరః" అంటే "అక్షర శబ్ద వాచ్యమయిన ప్రకృతి కంటె వేరయిన క్షేత్రజ్ఞుడు అయిన జీవుడు అని అర్థము ఎందుకు చెప్పుకో కూడదు, అని. అంటే ఇక్కడ చెప్పబడిన వారు ప్రకృతి పురుషులు అని అంటారు పూర్వ పక్షములో. ప్రకృతి కంటె వేరయిన వాడు అన్నప్పుడు అతడు సమష్టి పురుషుడయిన జీవాత్మ అని.

ఎందుకంటే అంతకు ముందు శ్లోకములో చెప్పబడిన అదృశ్యమ్, అగ్రాహ్యమ్ మొదలైన గుణాలు జీవాత్మకు వర్తిస్తాయి.

1. జీవాత్మ పృథివ్యాదుల వలె రూపాదులు కలిగినది కాదు, స్థూలమైన రూపముండదు కదా జీవాత్మకు. అందు వలన కళ్ళు, చెవులు లాంటి జ్ఞానేంద్రియాలు కాని, కాళ్ళు, చేతులు లాంటి కర్మేంద్రియాలు కాని ఉండవు. అదే కదా "అచక్షుః శ్రోత్రమ్" అనీ "అపాణి పాదమ్" అనీ చెప్పేరు.

2. దృశ్యత్వము కూడా దీనికి లేదు, కనపడదు కదా.

3. "సుసూక్ష్మమ్" అయినది

4. "అవ్యయమ్" అయినది

5. "సర్వగతమ్" అనగా సమస్త జంతు శరీరాంతర్గతమై ఉంటుంది.

6. "నిత్యమ్" అయినది. భావ వికారాలు లేనిది.

7. అంతట వ్యాపించి యున్నది.

8. "అగోత్రమ్..." అనినట్లు గోత్ర, వర్ణములు లేనిది.

అలాగే "యథోర్ణనాభిః ...." అన్నప్పుడు సాలె పురుగు దారములను కలిగించి తిరిగి వానిని లోనికి తీసుకొని నట్లు , పృథివి యందు ఓషధులు ఉత్పన్నములు అయినట్లు, పురుషుని తలయందు, దేహమునందు రోమములు పుట్టుచున్నట్లు అక్షరము అను అస్పష్టముగా చేతన వర్గ గర్భితమైన ప్రకృతినుండి ఈ జగత్తంతా ఉత్పన్నమవుతోంది.

అందుచేత ఈ ప్రకరణంలో చెప్పబడినది ప్రకృతి జీవుళ్ళు కాని పరమాత్మ ప్రసక్తి లేదు అంటారు పూర్వ పక్షములో.

అమ్మ: మఱి భగవద్రామానుజులు ఏమని చెప్పేరు?

మామయ్య: "ఇక్కడ అదృశ్యత్వము మొదలైన గుణాలున్న వాడు గా చెప్పబడినది పరమాత్మయే" అంటారు భగవద్రామానుజులు.

ఎందుకంటే

1. ఆ అక్షర పరబ్రహ్మము గూర్చి చెబుతూ ఈ ఉపనిషత్ "యః సర్వజ్ఞః సర్వవిత్" అని చెబుతుంది కదా. ఈ గుణాలు కేవలం పరమాత్మ కే వర్తిస్తాయి

2. "అక్షరాత్ సంభవతీహ విశ్వమ్" అని "తస్మాత్ ఏతత్ బ్రహ్మ నామరూపమన్నంచ జాయతే" అనీ ఉంది, అంటే ఈ అక్షర పరబ్రహ్మమే  సమస్త విశ్వము యొక్క ఉత్పత్తి కి కారణము. అంటే ఆయన పరమాత్మే.

3. అద్రేశ్యమ్, అగ్రాహ్యమ్, అగోత్రమ్, అవర్ణమ్, అచక్షుః..." మొదలైన గుణాలన్నీ పరమాత్మకే వర్తిస్తాయి.

4. "ప్రయాంతి యత్రామృతః స పురుషః.." అని బ్రహ్మోపాసన రూప జ్ఞానోపాసనను చేసేవారు పరమ పురుష సాన్నిధ్యమును పొందుదురు అని ఉంది కదా, జీవాత్మకు తన సాన్నిధ్యమని చెప్పబడ లేదు.

5. "బాహ్యాభ్యంతరోహ్యజః ...శుభ్రః..." అని "అంతర్బహిశ్చ తత్సర్వమ్ వ్యాప్య నారాయణ స్థితః" అన్నట్లు లోపల, బయట కూడ వ్యాపించి ఉంటాడనీ, దోషహీనుడనీ చెప్పబడినది. ఈ గుణాలన్నీ పరమాత్మకే చెందుతాయి.

అందువలన "అక్షరాత్ పరతః పరః" అంటే అక్షర అంటే అదృశ్యత్వాది గుణములున్న అక్షరుడని కాదు, ఎందుకంటే అట్టి వాని కంటే పరుడైన వాడు వేరొకడుండడం అసంభవము కదా, అందుచేత "అక్షర శబ్దవాచ్యమగు సూక్ష్మప్రకృతి కంటె అధికుడగు జీవ సమష్టి రూపుడగు చతుర్ముఖ బ్రహ్మ కంటె అధికుడైన పరమాత్మ"  అని దీనికర్థము అని వివరించేరు భగవద్రామానుజులు.

నేను: అంటే మఱి ఈ గుణాలు జీవాత్మకు కుదరవు అంటారా!

మామయ్య: ఇలాంటి విషయాన్ని చెప్పడం ఱెండు రకాలుగా చేయవచ్చును. మొదటిది ఆ పరమాత్మకే ఈ గుణాలన్నీ ఉన్నాయని చెప్పడం. ఱెండవది జీవాత్మకు ఈ గుణాలు కుదరవని చెప్పడం. ఇలా కూడా చెప్పడం వలన ఇంతకుముందు చెప్పుకున్నట్లు పాతిన రాటను బాగా పాతుకోడానికి మళ్ళీ కొంచె కదల్చి మట్టితో దట్టించి నట్లు అవుతుంది, అదే చేస్తున్నారు తరువాతి సూత్రంలో.

అమ్మ: ఏమిటా సూత్రం మామయ్యా!

మామయ్య:

"విశేషణ భేద వ్యపదేశాభ్యామ్ చ....1-2-23"

అంటే

విశేషణ: విశేషణమును బట్టియు

భేద: భేదమును

వ్యపదేశాత్ చ: చెప్పి యుండుటను బట్టియు కూడ

ఇతరౌ: ప్రకృతి పురుషులు

న: కారు

అనగా

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** ఇక్కడ ప్రారంభంలో చతుర్ముఖ బ్రహ్మ తన కుమారునికి ఉపదేశించినది "స బ్రహ్మ విద్యామ్ ...ప్రాహ" అని బ్రహ్మ విద్యని. బ్రహ్మ విద్య అంటే పర బ్రహ్మగురించి ఆయనను పొందే విధానాన్ని గూర్చి చెప్పేదే కదా!

ఇంక తరువాత శౌనకుడు కస్మిన్...విజ్ఞాతే సర్వమిదమ్ విజ్ఞాతమ్ భవతి" అని దేనిని తెలుసుకుంటే ఈ సర్వము తెలియును అని కదా అడిగేడు. అంటే "సద్విద్యా ప్రకరణము" లో చెప్పినట్లు ఆయన అడిగినది కూడా పరబ్రహ్మ గురించే.

దానికి సమాధానముగా అంగిరసుడు "ద్వే విద్యే...।బ్రహ్మవిదో వదంతి" అని బ్రహ్మము విషయమై పరోక్ష, అపరోక్ష జ్ఞానములను సంపాదించుకొన వలెనని, ఒట్టి అపరోక్ష జ్ఞానము పరబ్రహ్మ భక్తిరూపాపన్నమైనదని బ్రహ్మ వేత్తలు చెబుతారని అంటే అది పరమాత్మ గురించే కదా!

తరువాత వాక్యాలలో "యమేవైష వృణుతే తేన లభ్యః" అని పరమాత్మ ఎవరిని ప్రేమించుచున్నాడో వారి చేతనే పొందబడుతాడు అని పరమాత్మ ఎలా పొందబడుతాడో చెప్పబడినది.

విష్ణుపురాణములో కూడా

"తత్ప్రాప్తి హేతుః జ్ఞానమ్ చ కర్మమ్ చ ఉక్తమ్ మహామునే

ఆగమోత్థమ్ వివేకాచ్చ ద్విధా జ్ఞానమ్ తథోచ్యతే"

అని పరమాత్మను పొందుటకు జ్ఞాన, కర్మలు సాధన భూతములు, శాస్త్రముచే కలుగునదియు, వివేకాది నియమానుష్ఠానము వలన కలుగునదియు అని జ్ఞానము రెండు విధములు అని పరమాత్మను పొందే విధానము ఇలాగే చెప్పేరు

"అద్రేశ్యమ్..." అనియు, "యథోర్ణనాభిః ..." అనియు, పరమాత్మ స్వరూపమును తెలిపి, అతడే ఈ సమస్తమునకు కారణ భూతుడు అని చెప్పబడినది.

"తపసా చీయతే బ్రహ్మ...అమృతమ్" అనగా ఈ సకల భోక్తలును అనగా జీవాత్మలు, భోగ్య పదార్థములు అనగా ప్రకృతియు పరమాత్మనుండే కలుగు చున్నవి అని అర్థము.

"యః సర్వజ్ఞః సర్వవిత్" అను గుణాలు పరమాత్మకే వర్తిస్తాయి.

"తదేతత్ సత్యమ్" అను వాక్యమున పరమాత్మ వేరొక నిమిత్తమునపేక్షింపకయే సత్యమైనది అని తెలుస్తున్నది. నిత్య జీవులకు కూడా ఇది వర్తించదు.

"మంత్రేషు...సత్యకామాః" అను వాక్యమున పరమాత్మ సార్వజ్ఞత్వ, సత్యసంకల్పాది గుణాలు తెలుస్తున్నాయి.

"ప్లవాహ్యేతే ...పునరేవాపియంతి"

అని ఫలాపేక్షతోను, జ్ఞానరహితముగాను కర్మలననుష్ఠించువారు తిరిగి ఈ లోకాలకు వస్తారని చెప్పి, అట్లు కాక "తపశ్శ్రద్ధే.." అనుచు కర్మలను శాస్త్రోక్తముగా ఫలాపేక్ష లేక నిర్వర్తించుచూ, బ్రహ్మ జ్ఞానమును పొందుటకు సదాచార్యుని ఆశ్రయించి, పరమాకాశముననుండు వాడును, అనవధికాతిశయ ఆనంద స్వరూపుడునైన ఆ అక్షరుని హృదయ గుహయందు ఉపాసించు విధమును, ఆ ఉపాసన పరభక్తి రూపకమగుటను, అట్లుపాసించు వాని అవిద్య పోయి అనగా కర్మ బంధము వీడి బ్రహ్మ సముద్దై బ్రహ్మమును అనుభవించు విధమును కదా ఉపనిషత్తు చెబుతోంది.

దీని వలన ప్రకృతి, జీవుళ్ళు పరమాత్మ కంటే వేఱని విశేషించి తెలుస్తోంది.

"దివ్యోహ్యమూర్తః ..." అన్న చోట కూడ ఈ ప్రకృతి, జీవులకు లోపల, బయట పరమాత్మ ఉంటాడని, వాటి కంటె వేరయిన వాడనీ ఉపనిషత్తు చెబుతోంది.

**నేను:** అద్రేశ్యమ్..లాంటి గుణాలు జీవాత్మకూ, పరమాత్మకూ కూడా వర్తిస్తాయి కదా!

**మామయ్య:** అందుకే జీవాత్మకు వర్తించని రూపాన్ని కూడా పరమాత్మకు చెప్పేరని చెబుతోంది తరువాత సూత్రము.

**అమ్మ:** ఏమిటి ఆ సూత్రము మామయ్యా!

**మామయ్య:**

## "రూపోపన్యాసాచ్చ....1-2-24

అంటే

రూప: రూపమును

ఉపన్యాసాత్ చ: చెప్పిఉండుట వలన కూడ

అనగా

అట్టి పరమాత్మకు అగ్ని మూర్ధత్వాది రూపము కలదని ఈ శ్రుతి యందు చెప్పబడి యుండుట వలన అట్టి వాడు పరమాత్మయే.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** ఆయన రూపాన్ని వర్ణిస్తూ

"అగ్నిః మూర్ధా చక్షుషీ చంద్ర సూర్యౌ దిశః శ్రోత్రే వాగ్వివృతాశ్చ వేదాః

వాయుః ప్రాణో హృదయమ్ విశ్వమస్య పద్భ్యామ్ పృథివీ ఏష సర్వ భూతాంతరాత్మా"

అని "అగ్ని అతనికి శిరస్సు, సూర్య చంద్రులు నేత్రములు, దిక్కులు శ్రోత్రములు, వాక్కులు వేదములు, వాయువు ప్రాణము, ఆకాశము హృదయము, పృథివి పాదములు, ఇతడు సర్వ భూతాంతరాత్మ అని చెప్పింది.

అంటే ప్రకృతి, జీవములు ఆయన శరీరము, ఆయన వీటికి అంతరాత్మ అని కదా. అలాంటప్పుడు, ఈ అక్షర పరబ్రహ్మము ప్రకృతి, జీవాల కంటె వేరయిన వాడే కదా! ఆయన గుణాలుగా చెప్పబడిన అదృశ్యమ్ లాంటి గుణాలు ఆయనకు మాత్రమే వర్తిస్తాయి కాని ఏవో ఒకటి, రెండు గుణాలు కొంచెం సరి పోతాయేమోనని ఇక్కడ చెప్పబడినది పరమాత్మ కాదని చెప్పలేము కదా!

అందువలన, అదృశ్యాది గుణాలు కలవాడుగా ఇక్కడ చెప్పబడిన వాడు పరమాత్మయే.

అమ్మ: బాగుంది మామయ్యా, "ఈ ముండకోపనిషత్తులో అదృశ్యత్వాది గుణాలు పరమాత్మకే చెందడము వలననూ, పరమాత్మకు తప్ప జీవాత్మకూ, ప్రకృతికి వర్తించకుండుట పోవడం వలననూ, ఈ ఉపనిషత్తులో ఆయన జీవ, ప్రకృతులకు భిన్నమైన విశేషణాలతో వర్ణింప బడడమే కాక ఆయన రూపమును కూడ వర్ణించినప్పుడు ఈ ప్రకృతి, జీవములు ఆయన శరీరమనియును, ఆయన సర్వ భూతాంతరాత్మ అనియును వర్ణించడం చేత ఇక్కడ అదృశ్యత్వాది గుణములతో చెప్పబడిన అక్షర పరబ్రహ్మము పరమాత్మయే" అని ఈ అదృశ్యత్వాది గుణకాధికరణములో చెప్పినట్లు అర్థమయింది.

మామయ్య: బాగా చెప్పేవమ్మా, ఇంతటితో ఈ అధికరణము పూర్తి అయింది. తరువాతి అధికరణము తరువాత చూద్దాము.

అందరూ: "యో నిత్యమచ్యుత పదాంబుజ యుగ్మ రుక్మ....."

---

## 6.వైశ్వానరాధికరణము:

**మామయ్య:** రండమ్మా! ఎలాగున్నారు?

**అమ్మ:** బాగానే ఉన్నాము మామయ్యా, ఇదుగో ఈ ఎండలకే ఇబ్బందిగా ఉంటోంది. లోపలా, బయటా నిప్పులు కురుస్తున్నట్లుంటోంది.

**నేను:** మామయ్యా, మన లోపల నిప్పు అదే మన కడుపులో కూడా నిప్పు ఉంటుందట, దానిని జఠరాగ్ని అంటారట కదా! అదన్నా వైశ్వానరుడు అన్నా ఒకటేనా?

**మామయ్యా:** ఈరోజు పాఠం మనకదే!

**నేను:** అంటే వైశ్వానరుని గురించా!

**మామయ్య:** ఛాందోగ్యోపనిషత్ లో "వైశ్వానర విద్య" అని వస్తుంది. అక్కడ చెప్పబడిన "వైశ్వానర" పదం ఎవరికి వర్తిస్తుంది అని చర్చ అన్నమాట!

**నాన్నగారు:** ఉపనిషత్తులలో అన్నీ బ్రహ్మ విద్యలూ, బ్రహ్మ గురించి చెప్పేవే కదా!

**నేను:** కొంచెం క్లుప్తంగా ఆ సందర్భము చెప్పండి మామయ్యా, అప్పుడు సులభంగా అర్థమవుతుంది.

మామయ్య: ఛాందోగ్యోపనిషత్ లో 5వ ప్రపాఠకములో 11వ ఖండము నుండి ఆ ప్రపాఠకము చివరి వరకు అంటే 24 వ ఖండము దాకా ఈ వివరాలున్నాయి. ఈ వివరాలు సంగ్రహంగా సందర్భం అర్థం చేసుకోవడానికి చెప్పుకుందాం, ఉపనిషత్ అర్థం చేసుకుందికని కాకుండా.

ఉపమన్యు కుమారుడయిన ప్రాచీనశాలుడు, పులుషుని కుమారుడయిన సత్యయజ్ఞుడు, భల్లవుని మనుమడైన ఇంద్రద్యుమ్నుడు, సర్కరక్షుని కుమారుడైన జనుడు, ఆశ్వతరశ్వుని కుమారుడైన బుడిలుడు అను గొప్ప ఋషులు ఒకసారి కలిసి "ఆత్మ" అంటే ఏమిటి? "పరమాత్మ అంటే ఏమిటి? ("కో న ఆత్మా కిమ్ బ్రహ్మేతి") అని చర్చించుకొని ఆ విషయము తెలుసుకుందామని, అరుణుడి కుమారుడైన ఉద్దాలకునికి వైశ్వానురుని గురించి తెలుస్తుందని అతని దగ్గరకు వెళ్ళేరు. అంటే వైశ్వానరుని గురించి తెలిస్తే తమకు కావలసిన విషయం తెలుస్తుందని వారికి అప్పటికి అనిపించిందన్న మాట.

కాని ఉద్దాలకుడు తనకు కూడా పూర్తిగా ఆ విషయం తెలియక  అశ్వపతి అను కేకయ దేశపు రాజు వద్దకు (ఆయనకు తెలుసునని) వారిని కూడా తీసుకొని ఆ విషయం తెలుసుకుందికి వెళ్ళేడు.

అశ్వపతి వారిని తగిన విధంగా సంభావించి ఆ రాత్రి పండు కొని లేచిన తరువాత మరునాడు ప్రొద్దున వారితో తన రాజ్యమునందు తస్కరులు, జారులు, మద్యపానము చేయువారు అలాంటి వారు ఎవ్వరూ లేరని, అందరూ అగ్నిని సంభావించువారు, జ్ఞానులు అని తెలిపి తాను యజ్ఞము చేయుచుండుట చేత, వారికి తగినట్లుగా ధన, కనక, ఐశ్వర్యాలని ఇత్తునని అచటనే నుండుమని పలికేడు.

వారు ముముక్షువులైన కారణంగా దానికంగీకరించక, తమకు వైశ్వానరుని గురించి తెలుపమని పలికేరు. దానికతడు మరునాడు ఆ ఉపదేశము చేసెదనని చెప్పేడు.

సమిత్పాణులై వాళ్ళు మరునాడు అతని వద్దకు రాగా ఆరాజు

వైశ్వానర విద్య వారికి చెప్పనారంభించేడు.

ఆరాజు ప్రాచీన శాలునితో "నీవు దేని గురించి ధ్యానము చేయుదువు" అని అడిగేడు. దాని కతడు "దివమేవ భగవో రాజన్" అనుచూ "ద్యులోకమును వైశ్వానరాత్మగా ధ్యానము చేయుదునని" పలికేడు. అంతట రాజు ద్యులోకమే వైశ్వానరాత్మ యను ఉద్దేశ్యము తొలగించి సుతేజస్సు అనగా నక్షత్రాది తేజస్సు వైశ్వానరాత్మ శిరస్సు. ఎవరు దీనిని ధ్యానిస్తారో వారు భోజనము లోటు లేక వారి కుటుంబముతో బ్రహ్మతో సమానమైన తేజసానందములతో నుందురు.  వైశ్వానరుని శిరమును ధ్యానింపుము అని వైశ్వానర శిరో ధ్యానము మాత్రము ఉపదేశించెను.

అటులనే

సత్యయజ్ఞుడు తాను ధ్యానించునది ఆదిత్యుడు అని తెలుపగా "నీవు ధ్యానము చేయునది వైశ్వానరుని నేత్రము మాత్రము. నీ కుటుంబము ఐశ్వర్యము, రథ, తురగాదులు, సేవకులు కలిగి బ్రహ్మతో సమానమైన ఆనందముతో నుందురు. నీవు వైశ్వానరుని నేత్రమును ధ్యానించుము"

అనియు

ఇంద్రద్యుమ్నుడు తాను ధ్యానించునది వాయువు అని పలుకగా "నీవు ధ్యానించునది వైశ్వానరుని ప్రాణమును. నీవు కుటుంబముతో ఆనందైశ్వర్యములతో బ్రహ్మతో సమానమైన గొప్పదనము కలిగి యుందువు".

అనియును

జనుడు తాను ధ్యానించునది ఆకాశమని తెలుపగా "నీవు వైశ్వానర బహుళము ధ్యానించుచున్నావు. నీవు, నీ కుటుంబమును ఐశ్వర్యమును, ఆనందమును కలిగి బ్రహ్మ సమానమైన గొప్పదనముతో నుందువు

అనియును

బుడిలుడు తాను ధ్యానించునది ఉదకమని తెలుపగా "ఉదకము వేగమును సూచించును. వైశ్వానరుని మూత్ర కోశమను అవయవము. నీవు, నీ కుటుంబము బ్రహ్మతో సమానమైన ఆనంద, ప్రతిష్ఠలతో నుందువు. నీవు వైశ్వానరుని మూత్రకోశముగా ధ్యానించుము.

అనియును

ఉద్దాలకుడు తాను ధ్యానించునది భూమి అని పలుకగా,  నీవు ధ్యానించుచున్నది  వైశ్వానర ప్రతిష్ఠ. అది వైశ్వానర పాద పీఠము మాత్రమే. ఆ ధ్యానము వలన నీవు నీ కుటుంబముతో బ్రహ్మకు సమానమైన ఆనందముతో నుందువు.

అనియును తెలిపి వైశ్వానరుని ఆయా అవయవములు ఉపదేశించెను. తదుపరి,

మీకిప్పుడు పరిమితమైన జ్ఞానము మాత్రము కలిగినది.

వైశ్వానరుని భూనభోంతరాళమంతటా వ్యాపించియుండి, అనేకములుగా అన్ని చేతనాచేతనముల నందు భుజించుచున్నట్లు, అతనిని అంతటా ఉన్నట్లు తెలిసి పూజించవలెను.ఈ రకంగా అశ్వపతి ఈ సమస్త విశ్వము వైశ్వానరుని శరీరాంతర్భాగమనీ, అందులో ఒక్కొక్క భాగమైన ఆదిత్య, పృథివ్యాకాశాదులలో దేనినైనను ధ్యానించినప్పుడు అది ఆ వైశ్వానరుని శరీరాంతర్భాగమని తెలిసియుండవలెనని, ఆ వైశ్వానరుడు సమస్త చేతనాచేతనములకు అంతరాత్మయై యుంటాడన్న విషయము వివరించేడు.

ఈ రకంగా వైశ్వానరుని శిరస్సు సుతేజస్సు అనియు, నేత్రము విశ్వరూపుడని, ప్రాణము వాయువనీ, బహుళము(శరీర భాగము) ఆకాశమనీ, ఉదకము మూత్రాశయమనీ, పాద పీఠము పృథివి అనీ అని తెలియాలి.

ఆయన శరీర మధ్య భాగము యజ్ఞమునకు అగ్ని హోత్రమునుంచెడి వేది, రోమములు కుశగ్రాసము, హృదయము గార్హపత్యాగ్ని, మనస్సు దక్షిణాగ్ని, ముఖము ఆహవనీయాగ్ని అని తెలుసుకోవాలి.

ఇలా భావించబడిన వైశ్వానర అగ్ని హోత్రమునకు ఆహుతులీయడానికి ప్రాణాది ఆహుతులీయడం చేయాలి.

అందుచే మొదట ఆహారమును "ప్రాణాయ స్వాహా" అని ఆహుతి ఈయడం వలన ప్రాణము సంతృప్తి పొందుతుంది.

ప్రాణము సంతృప్తి పొంది తద్వారా  ఆదిత్యుడును, ద్యులోకమును సంతృప్తి పొందుతాయి. అందువలన ఆదిత్య, ద్యులోకముల దిగువనున్న సమస్తము తృప్తి చెందును. అందువలన అతడును సకుటుంబ, సపరివారముగా సంతృప్తి నొంది బ్రహ్మము వలె ప్రకాశించును.

అటులనే "వ్యానాయ స్వాహా" అని ఆహుతి సమర్పించినచో వ్యానము సంతృప్తి చెందును. తద్వారా శ్రోత్రమును, చంద్రుడును, దిశలును సంతృప్తి చెందును. అందువలన అతడును సకుటుంబ, సపరివారముగా సంతృప్తినంది బ్రహ్మము వలె ప్రకాశము కలిగి యుండును.

"అపానాయ స్వాహా" అని అర్పించినప్పుడు వాక్కు, అగ్ని, భూమి తద్వారా వాటి మధ్య సమస్తము తృప్తి చెందుతుంది. అందువలన అతడును సకుటుంబ, సపరివారముగా సంతృప్తి నంది బ్రహ్మ సమాన వర్చస్సుతో ప్రకాశించును.

"సమానాయ స్వాహా" అని అర్పించినప్పుడు మనస్సు, వరుణుడు, మెఱుపు దేవత తద్వారా వాటి మధ్య సమస్తము తృప్తి చెందుతుంది. అందువలన అతడును సకుటుంబ, సపరివారముగా సంతృప్తి చెంది బ్రహ్మ సమాన వర్చస్సుతో ప్రకాశించును.

"ఉదానాయ స్వాహా" అని సమర్పించినప్పుడు చర్మమును, వాయువును, ఆకాశమును, తద్వారా వాటి మధ్య సమస్తమును తృప్తి పొందును. అందువలన అతడును సకుటుంబ, సపరివారముగా సంతృప్తి చెంది బ్రహ్మ సమాన ప్రకాశము పొందును.

ఈ జ్ఞానము లేక అగ్నిహోత్రమునకు అర్పించుట అగ్ని లేని బూడిద కర్పించినట్లు వ్యర్థము.

ఈ జ్ఞానముతో అగ్నిహోత్రమునకు అర్పిస్తే సమస్త విశ్వమునకు, సర్వ భూతములకు, ఆత్మలకు సమర్పించినట్లవుతుంది.

"యస్త్వేత మేవ మభివిమానమాత్మానమ్ వైశ్వానరముపాస్తే స సర్వేషు లోకేషు సర్వేషు భూతేషు సర్వేషు ఆత్మసు అన్నమత్తి" ఎవడంతటను వ్యాపించి యుండువాడును, అవధి లేని వాడును నగు వైశ్వానరాత్మను పైన తెల్పినట్లు పురుషాకారునిగా ఉపాసిస్తారో అతడు సర్వ లోకములందును, సర్వ భూతముల యందును, సర్వ ఆత్మల యందును అనుభవిస్తున్నాడు.

ఇది తెలిసి చేసిన వానికి నిప్పులో వేయబడిన దూది వలె సమస్త పాపములు దగ్ధమై పోతాయి.

ఇది తెలిసి, మిగిలిన ఆహారము చండాలునకు అర్పించిననూ అది వైశ్వానరునకే చెందుతుంది.

అందులకే ఆకలి కొనిన పిల్లలు అమ్మ చుట్టూ చేరినట్లు సర్వ భూతములును అగ్ని హోత్రుని చుట్టూ చేరుతాయి అని ఆర్యోక్తి.

అని ఈ విధముగా వైశ్వానర విద్య అశ్వపతి మహారాజు వారికి ఉపదేశించేడు.

**నేను:** ఉపదేశము అంటే విషయాన్ని చెప్పడమేనా?

**మామయ్య:** ఉపదేశము ముఖ్యంగా మూడురకాలుగా ఉంటుందని పెద్దలు చెబుతారు.

మొదటిది నువ్వన్నట్లు విషయం, విషయార్థం చెప్పడం, దీని కంటే గొప్ప విధానము

హస్త, మస్తక సంయోగము. ఇందులో ఆచార్యుడు తన చేతితో తాకడం ద్వారా జ్ఞానాన్ని శిష్యుడిలో ప్రవేశపెడుతాడుట. ఇంత కంటె గొప్పది మనస్సు ద్వారా జ్ఞానాన్ని ప్రవేశపెట్టడం అంటే ఉపదేశించడం అంటారు.

ఏ ఉపదేశానికైనా ఆచార్యునికి జ్ఞానముతో బాటు ఆచరణ, పరమాత్మ అనుభవము, శిష్య వాత్సల్యము, మనో నైర్మల్యము లాంటివన్నీ అతి ముఖ్యములు. ఇప్పుడు ఆ సందర్భము కాదు కనుక ఈ వివరాలు మరొక సారి ఎప్పుడైనా చూద్దాము.

సంక్షిప్తంగా ఇదీ ఈ ఉపనిషద్భాగము. ఇంక సూత్రాలలోనికి వెళదామా.

**అమ్మ:** చెప్పండి మామయ్యా, ఇంతకీ ఏమిటి అధికరణము పేరు, దీనిలో ఎన్ని సూత్రాలున్నాయి

**మామయ్య:** దీనిని "వైశ్వానరాధికరణము" అని అంటారమ్మా, ఇందులో తొమ్మిది సూత్రాలున్నాయి.

వాటిలో మొదటి సూత్రము

## "వైశ్వానరః సాధారణ శబ్ద విశేషాత్....1-2-25"

అంటే

వైశ్వానర: వైశ్వానర శబ్దవాచ్యుడు (పరమాత్మయే ఏలనన)

సాధారణ శబ్ద విశేషాత్: సామాన్యముగా అగ్న్యాదులను తెలిపెడు వైశ్వానర శబ్దము ప్రకృతమున పరమాత్మ ధర్మములను తెలుపు శబ్దములచే విశేషింపబడుట వలన అనగా పరమాత్మకు మాత్రమే చెందు ధర్మములచే చెప్పబడుట వలన

అనగా

వైశ్వానర శబ్దము సాధారణముగా అగ్ని వంటి ఇతర శబ్దములను తెలుపునదైనను, ఈ వైశ్వానర విద్య సందర్భమున పరమాత్మ యొక్క ధర్మములను తెలుపునట్టి శబ్దములచేత విశేషించి అనగా పరమాత్మకు

మాత్రమే వర్తించు గుణములచే చెప్పబడడం వలన ఛాందోగ్యోపనిషత్ లో ఈ సందర్భములో చెప్పబడుతున్నది పరమాత్మయే.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** వైశ్వానరుడు అనే పదానికి వేర్వేరు అర్థాలున్నాయమ్మా.

ఉదాహరణకు బృహదారణ్యకోపనిషత్తు లో "అయమగ్నిః వైశ్వానరః ఏనేదమన్నమ్ పచ్యతే యదిద మద్యతే తస్యైష ఘోషో భవతి యమేవ త్కర్ణావపిధాయా శ్రుణోతి స యదేత్రమిష్యన్భవతి నైనమ్ ఘోషమ్ శృణోతి" అని వస్తుంది. అంటే "దేనిచే అన్నము పచనము చేయబడుచున్నదో, మరియు దేనిచే అన్నము తినబడుచున్నదో అది వైశ్వానరమనబడు చున్నది. మనము చెవులను గట్టిగా మూసుకున్నచో వైశ్వానరుని శబ్దమునే వినుచున్నాము. ఈ శబ్దము జీవుడు శరీరమునుండి బయల్వెడలు సమయమున వినబడదు"

అని చెబుతూ ఈ సందర్భములో వైశ్వానర శబ్దానికి మనలో ఉండే జఠరాగ్ని అనే అర్థంలో ప్రయోగించేరు. అందువలన వైశ్వానర శబ్దానికి జఠరాగ్ని అనేది ఒక అర్థము.

"విశ్వస్మా అగ్నిమ్ భువనాయ దేవాః వైశ్వానరమ్ కేతుమహ్నామ కృణ్వన్"

అనగా దేవతలు జగదుపకారార్థమై అగ్నిని ఆదిత్యునిగా చేసిరి."

అను వాక్యమున వైశ్వానర శబ్దము మహాభూతములలో మూడవదగు అగ్నిని తెలుపుతుంది. ఇది రెండవ అర్థము.

"వైశ్వానరస్య సుమతౌ శ్యామరాజాహికమ్ భువనానామభిశ్రీః" అనగా "వైశ్వానరునకు మన యెడల బుద్ధి పుట్టుగాక, ఏలననగా అతడు లోకములకు సుఖమునిచ్చు రాజును, ఐశ్వర్య వంతుడును"

అను వాక్యములో వైశ్వానరుడనగా ఒక దేవతా విశేషము అను అర్థములో ఉపయోగింపబడినది.

ఇది మూడవ అర్థము

"తదాత్మన్యేవ హృదయే గ్నౌ వైశ్వానరో ప్రాస్యత్"

అనగా అతడు తనయందే హృదయమునందలి వైశ్వానరాగ్ని యందుంచెను,

" స ఏష వైశ్వానరో విశ్వరూపః ప్రాణేవ హృదయత ఇతి చ"

అనగా "ప్రాణమువలె అన్ని రూపములతో నతడు వైశ్వానరుని వలె ఉదయించుచున్నాడు"

మొదలగు శ్రుతి వాక్యముల యందు పరమాత్మ అను అర్థముతో వైశ్వానర శబ్దము వాడబడినది.

ఇది నాల్గవ అర్థము.

ప్రస్తుత సందర్భములో వైశ్వానర శబ్దానికి ఈ నాలుగు అర్థాలలో దేనిని తీసుకోవాలి అని సందేహము.

అమ్మ: మఱి భగవద్రామానుజుల సమాధానమేమిటి?

మామయ్య: ఈ సందర్భము దేనితో ప్రారంభం అయింది అన్న విషయం ముందు చూడమంటున్నారు.

ఆయా ఋషులు "కో న ఆత్మా కిమ్ బ్రహ్మ" అంటూ "మన యొక్క ఆత్మ ఏది, బ్రహ్మ అంటే ఏమిటి" అని కదా చర్చించడం ప్రారంభించేరు. అది తెలుసుకోవాలని వాళ్ళందరూ ముందు ఉద్దాలకుని వద్దకు వెళ్ళి, తరువాత ఆయనతో కూడా అశ్వపతి మహారాజు వద్దకు వెళ్ళి మాకు వైశ్వానర విద్య చెప్పుమని ప్రార్థించినది జఠరాగ్ని గురించో మరో అగ్ని గురించో కాదు కదా, కేవలము పరబ్రహ్మము గురించి తెలుసుకునేందుకు. అందుచేత ఇక్కడ వైశ్వానరుడు అంటే పరబ్రహ్మమే.

అంతే కాక వారు ఆ రాజు వారలకు తగినట్లు ధన, కనక, ఐశ్వర్యాదులను ఇచ్చెదనన్ననూ ఒప్పుకోకుండా తమకు వైశ్వానరాత్మను తెలుపమని ప్రార్థించడం వారు ఐహిక కామములు లేని ముముక్షువులు అవడం చేత, అందువలన వారికి కావలసినది పరమాత్మ గురించి.

అశ్వపతి మహారాజు వైశ్వానర విషయము చెప్పిన తరువాత "స సర్వేషు లోకేషు సర్వేషు భూతేషు సర్వేషు ఆత్మసు అన్నమత్తి" అనుచు అతడు అన్ని ఆత్మలయందును అన్నమును భుజించు చున్నాడనియు "తద్యథేషీకాతూలమగ్నౌ ప్రోతమ్ ప్రదూయేతైవమ్ హాస్య సర్వే పాప్మానః ప్రదూయంతే" అనుచు "జమ్ము, దూది అగ్ని యందుంచగనే దగ్ధమైపోవునట్లు ఈ వైశ్వానరాత్మను ఉపాసించువాని సమస్త పాపములు నశించుచున్నవని" చెప్పను. ఇట్లు సమస్త పాపములు నశించుట బ్రహ్మ విద్యోపాసనము వలననే కదా!

ఈ పై కారణాలవలన పరమాత్మ విశేషణ ధర్మములు అంటే పరబ్రహ్మకు , పరబ్రహ్మ విద్యకూ చెందే వివరాలు తెలిపే శబ్దాలు బ్రహ్మ అనీ, సమస్త పాప నిర్మూలనమనీ, ఐహిక కామ వైరాగ్యమనీ, సర్వ వ్యాప్యత్వమనీ చెప్పడం వలన ఇక్కడ చెప్పబడినది పరమాత్మయే.

**నేను:** మఱి, శిరస్సు, నేత్రము అంటూ ఆ వైశ్వానరునికి అవయవాలు చెబుతున్నారు కదా. ఎప్పుడయినా అవయవాలు అంటూ ఉంటే అది నిత్యము కాదు, కొన్ని అవయవాలు కలిసి ఉన్నాయి అంటే దానికి పుట్టుక ఉన్నదనీ, అంటే నాశనము ఉండక తప్పదనీ, అలా కలసిన అవయవాలు ఎప్పుడయినా విడి పోవడానికి అవకాశము ఉంటుంది కనుక ఆ అవయవికి మార్పు సంభవము కనుక అవ్యయము కానేరదని అందు వలన అది పరమాత్మ గుణము కాదు కనుక ఇక్కడ చెప్పబడుతున్నది పరమాత్మ కాదని అంటేనో?

**మామయ్య:** దానికే తరువాత సూత్రము

**అమ్మ:** ఏమిటి ఆ సూత్రము మామయ్యా!

మామయ్య:

"స్మర్యమాణమనుమానమ్ స్యాత్ ఇతి....1-2-26"

అంటే

ఇతి:అదే ఇది యని ఇట్లు

స్మర్యమాణమ్:గుర్తింపబడు రూపము

అనుమానమ్:(వైశ్వానరుడు పరమాత్మయని) సూచించునది

స్యాత్: అగును

అనగా

అదే ఇదని గుర్తింపబడునట్టి ద్యులోకాదులు అవయవములుగా కల శరీరము వైశ్వానరుడు పరమాత్మ అని సూచించుచున్నది.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** ఇందాకా రామం అన్నట్లు పరమాత్మకు శరీరము ఉన్నదంటే

1. ఉత్పత్తి వినాశాలు కూడా ఉంటాయా, ఎందుకంటే శరీరానికి షడ్భావ వికారాలైన పుట్టుక, నాశము, ఉండు, మారు, పెరుగు, తరుగు అనెడివి ఉంటాయి కదా!

2. అవయవాలు, శరీరమూ అంటే ఆరంభమూ, అంతమూ ఉంటాయన్నమాట, అంటే పరమాత్మ పరిమితమైనదని అర్థము.

3. పరమాత్మకు విభుత్వము లాంటి గుణాలు చెప్పలేము.

ఈ కారణాల వలన శరీరమున్నవాడుగా చెప్పబడిన వాడు పరమాత్మ ఎలాగవుతాడు అని ప్రశ్న!

**అమ్మ:** మఱి భగవద్రామానుజుల సమాధానము!

## మామయ్య:

1.ఇక్కడ శరీరముగాను, అవయవాలు గాను చెప్పబడినవి ద్యులోకము మొదలైనవి. శ్రుతుల యందు, స్మృతుల, ఇతిహాసాదులయందు పరమాత్మ గురించి ఈ విషయము చెప్పబడినది.

ముండకోపనిషత్ నందు "అగ్నిః మూర్ధా చక్షుషీ చంద్ర సూర్యౌ దిశః శ్రోత్రే వాగ్వివృతాశ్చ వేదాః

వాయుః ప్రాణో హృదయమ్ విశ్వమస్య పద్భ్యామ్ పృథివీహ్యేష సర్వ భూతాంతరాత్మా" అనుచు ద్యులోకము పరమాత్మ యొక్క శిరస్సు, సూర్య చంద్రులతని నేత్రములు, దిక్కులతని శ్రోత్రములు, వేదములతని వచనములు, వాయువతని ప్రాణము, విశ్వమతని హృదయము, పృథివి అతని పాదములు అనుచు సమస్త విశ్వము పరమాత్మ శరీరముగా తెలుపబడినది కదా. ఇక్కడ అగ్ని అంటే ద్యులోకము అని అర్థం చెప్పుకోవాలి. (అసౌ వై లోకో అగ్నిః).

"ద్యామ్ మూర్ధానమ్ యస్య విప్రా వదంతి ఖమ్ వై నాభిమ్ చంద్ర సూర్యౌ చ నేత్రే

దిశః శ్రోత్రే విద్ధి పాదౌ క్షితిమ్ చ సః అచింత్యాత్మా సర్వ భూతప్రణేతా"

అనగా ద్యులోకము ఎవ్వని శిరస్సుగను ఆకాశమెవ్వని నాభిగను, సూర్య చంద్రులు ఎవరి నేత్రములుగను, దిక్కులు ఎవరి శ్రోత్రములుగను, భూమి ఎవరి పాదముగను బ్రహ్మవేత్తలు చెప్పుచున్నారో అతడు మనస్సుచే నింత యని ఊహింపరాని రూపము కలవాడు, సకల ప్రాణులను ప్రవర్తింప చేయువాడు.

"యస్యాగ్నిరాస్యమ్ ద్యౌః మూర్ధా ఖమ్ నాభిః చరణౌ క్షితిః

సూర్యః చక్షుః దిశః శ్రోత్రమ్ తస్మై లోకాత్మనే నమః"

అనగా "అగ్ని ఎవని ముఖమో ద్యులోకము ఎవని శిరస్సో ఆకాశమెవని నాభియో, భూమి ఎవని పాదములో, సూర్యుడెవ్వని నేత్రమో, దిక్కులెవ్వరి శ్రోత్రములో లోకాత్మ యగునట్టి వానికి నమస్కరిస్తున్నాను."

అని మహా భారతము లో భీష్మ పితామహుడు స్తుతిస్తాడు.

శ్రీమద్రామాయణము లో కూడా "జగత్సర్వమ్ శరీరమ్ తే" అని రావణ వధ తరువాత చతుర్ముఖ బ్రహ్మ శ్రీరాముడిని స్తుతిస్తాడు.

ప్రస్తుత సందర్భంలో కూడా ద్యులోకాదులు వైశ్వానరుని శిరస్సు మొదలైన అవయవాలు అని చెప్పడం పైన చెప్పబడిన శ్రుతుల ప్రకారమే ఉన్నది తప్ప వేరు కాదు.

ఔపమన్యుడు మొదలగు మహర్షులు అశ్వపతిని "నీవిప్పుడు వైశ్వానరాత్మను ఉపాసించుచున్నావు, దానిని గూర్చి మాకు తెల్పుము" అని ప్రార్థించేరు. అశ్వపతి వారికి కొంత తెలిసి, కొంత తెలియక యున్నదనీ గ్రహించి, వారి నొక్కొక్కరిని "ఇపుడు నీవు దేనిని వైశ్వానరాత్మగా ఉపాసించుచున్నావు" అని ప్రశ్నించి, వారు ఉపాసించు చున్న ద్యులోకాదులు వైశ్వానరాత్మకు ఆయా అవయవములగుట ఉపదేశించెను.

పిదప వైశ్వానరుని సంపూర్ణ విభూతిని, తదుపాసన వలన కలుగు ఫలమును ఉపదేశించెను.

ఇక్కడ ఈ సమస్త విశ్వము పరమాత్మ శరీరమనీ, ఆయన ఈ చేతనా చేతనాలకన్నిటికీ అంతరాత్మ అయి ఉంటాడని, ఆయన శరీరమునందలి ఆయా భాగములను ఉపాసన చేసినప్పుడు ఆయన విశేషమే అని తెలిసికొని ఉపాసన చేయవలెననీ, ఒక్కొక్క విశేషమునే కాక ఆయన సంపూర్ణ విభూతి తెలిసికొని ఉపాసించుట శ్రేష్ఠమనీ చెప్పబడుతున్నది.

నువ్వు చెప్పినట్లు ఆయన శరీర భాగాలయిన ద్యులోకాదులు, చేతనా చేతనాలు మార్పులు అదే భావ వికారాలు పొందడం, ఆయనలో లయమవడం, మళ్ళీ సృజింప బడడం మనకు తెలిసినదే. కాని ఆయనకు మాత్రం ఆ వికారాలు వర్తించవు అని మనం ఇంతకు ముందు చాలా సార్లు చెప్పుకున్నాము.

నేను: "అగ్నిః వైశ్వానరః" అని అంటే అగ్నియే వైశ్వానరుడు అని కదా, వ్యాకరణం ప్రకారము కూడా, అక్కడ అగ్నిః, వైశ్వానరః అన్న రెండు పదాలూ, ఒకే విభక్తి, వచనమూ, లింగము లో నుండి ఒకే వస్తువును సూచించినట్లు కదా! మరి వైశ్వానరుడు అంటే అగ్ని అని కాక పరమాత్మ అని ఎలా చెబుతాము?

మామయ్య: అందుకోసం తరువాత సూత్రము చూడాలి.

అమ్మ: ఏమిటి ఆ సూత్రము మామయ్యా!

మామయ్య:

"శబ్దాదిభ్యః అంతఃప్రతిష్ఠానాచ్చ నేతి చేన్న తథా దృష్ట్యుపదేశాదసంభవాత్పురుషమపి చైవమధీయతే.....1-2-27"

అంటే

శబ్దాదిభ్యః: అగ్ని శబ్దము వైశ్వానర శబ్దముతో రెండు శబ్దములు ఒక్కరినే చెబుతున్నట్లు ఉపయోగింప బడుట మొదలగు కారణముల చేత

అంతః ప్రతిష్ఠానాత్ చ: వైశ్వానరునకు "పురుషే అంతః ప్రతిష్ఠితమ్ వేద" అని  వైశ్వానరుని పురుషుని లోపల యుండుట వంటి స్థితులు కూడ చెప్పబడుట వలన కూడ

చేత్: (వైశ్వానరుడు పరమాత్మ కాదని)అనినచో

న: అది సరి కాదు

తథా:అట్లు

దృష్ట్యుపదేశాత్: ఉపాసనమును ఉపదేశించి యుండుట వలన

అసంభవాత్: (కేవల జాఠరాగ్నికి ద్యుమూర్ధత్వాదులు ఉండుట) అసంభవము అగుట వలన(వైశ్వానరుడు జాఠరాగ్ని కాదు మఱియు)

ఏనమ్: ఇతనిని

పురుషమ్ అపి చ:పురుషునిగాను కూడ

అధీయతే: పఠించుచున్నారు

అనగా

శ్రుతి యందు వైశ్వానర అను పదము, అగ్ని యను పదము ఒక్కరినే  చెబుతున్నట్లు ఉపయోగించబడడం వలననూ, వైశ్వానరుడు పురుషుని లోపల నుండువానిగా "పురుష అంతః ప్రతిష్ఠితమ్ వేద" మొదలగు వాక్యములు చెప్పడం వలననూ వైశ్వానరుడు పరమాత్మ కాదని చెప్పరాదు. ఎందుకంటే వైశ్వానరుని జాఠరాగ్ని శరీరునిగా ఉపాసించ వలెనని ఉపదేశింప బడుట వలననూ, జాఠరాగ్నికి ద్యులోకాదులు మూర్ధాది అవయవములగుట అసంభవమగుట చేతను, వాజసనేయ సంహిత యందువైశ్వానరుని "పురుషు"ని గా పఠింపబడుట చేతనూ వైశ్వానరుడంటే పరమాత్మయే

అమ్మ: కొంచెం వివరించండి మామయ్యా!

అసలు ఈ సూత్రంలోనే ఉన్నాయమ్మా సందేహాలు, సమాధానాలూను.

1. సందేహము: "వైశ్వానరోపాసన సందర్భంలో "స ఏషః అగ్నిః వైశ్వానరః" అని ప్రయోగించినప్పుడు, ఆ రెండు పదాలూ ఒకే లింగమూ, ఒకే వచనమూ, ఒకే విభక్తి కలిగి "దాశరథి రాముడు" అన్నట్లు ఆ రెండు పదాలూ ఒకరికే వర్తిస్తాయి తప్ప అగ్ని అంటే ఒకడూ, వైశ్వానరుడంటే వేరొకడూ అని అర్థం చెప్పుకోకూడదు కదా!

సమాధానము: అలా చెప్పుకో కూడదు. ఇక్కడ వైశ్వానరుడు త్రిలోక శరీరుడుగా చెప్పబడినాడు . జఠరాగ్నిని త్రిలోక శరీరునిగా చెప్పుకోలేము. అందువలన ఇక్కడ "అగ్నిః వైశ్వానరః" అంటే అగ్ని శరీరుడైన వైశ్వానరుడు అని అర్థము. భగవద్గీతలో పరమాత్మ

"అహమ్ వైశ్వానరో భూత్వా ప్రాణినామ్ దేహమాశ్రితః

ప్రాణాపాన సమాయుక్తో పచామ్యన్నమ్ చతుర్విధమ్"

అని ఉదరమునందు జాఠరాగ్ని శరీరుడై ప్రాణుల దేహముల నాశ్రయించి యుండి, ప్రాణాపాన వాయువులతో గూడియున్నవాడై నాల్గు విధముల అన్నమును పచనము చేయుచున్నాను" అని తానే చెప్పుకున్నాడు కదా! కనుక జాఠరాగ్ని విశిష్టుడైన పరమాత్మ ఉపాసనమే ఇక్కడ చెప్పబడుతోంది.

2. సందేహము: ఇక్కడ "హృదయమ్ గార్హపత్యః, మనః అన్వాహార్య పచనః, ఆస్యమాహవనీయః"

అని వైశ్వానరుని హృదయము గార్హపత్యాగ్ని, మనస్సు దక్షిణాగ్ని, ముఖము ఆహవనీయాగ్ని అనుచు వైశ్వానరుని హృదయాది స్థానాలు అగ్ని త్రయము అని చెబుతున్నారు. అలాగే

"తద్యద్భక్తమ్ ప్రథమమాగచ్ఛేత్తద్ధోమీయమ్ సయామ్ ప్రథమామాహుతిమ్ జుహుయాత్తామ్ జుహుయాత్ప్రాణేతి స్వాహా ఇతి" మొదలైన వాక్యాలలో "ఏ అన్నము మొదట లోనికి పోవునో అది ప్రాణాహుతి. మొదట ఆహుతిని "ప్రాణాయ స్వాహా" అను మంత్రముతో ఆహుతి నీయవలెను".

అనుటచే వైశ్వానరుడు ప్రాణాహుతుల నుంచు స్థానముగా తెలియవస్తున్నాడు.

అలాగే "స యో గా తమేవ అగ్నిమ్ వైశ్వానరమ్ పురుష విదమ్ పురుషే అంతః ప్రతిష్ఠితమ్ వేద" అనగా "ఎవడీ వైశ్వానరుని పురుషుని వంటి వానిగను, పురుషుని లోపల నుంచబడిన వానిగను ఉపాసించుచున్నాడో" అను వాక్యమున వైశ్వానరుని పురుషుని లోపలనుండువానిగ చెబుతున్నారు.

అంటే ఈ వైశ్వానరుని శరీరము అగ్ని త్రయము అని ఒక చోట, ప్రాణాహుతుల కాధారమని మరొక చోట, పురుషుని లోపల నుండు జాఠరాగ్నిగా ఇంకొక చోట చెప్పడం జరిగింది. ఈ మూడు పరమాత్మకు ఎలా వర్తిస్తాయి!

సమాధానము: ఇంతకు ముందు అనుకున్నట్లు అగ్ని త్రయము శరీరముగా కలవాడు పరమాత్మయే. "ప్రాణాపాన సమాయుక్తః" అని భగవానుడే చెప్పుకొని నట్లు ప్రాణాహుతులకాధారమైనవాడును పరమాత్మయే.

"అహమ్ వైశ్వానరో భూత్వా" అనినట్లు పురుషుల లోపల వైశ్వానరుడుగా పరమాత్మ చేరి యుండును కనుక ఇక్కడ చెప్పబడిన వాడు పరమాత్మయే

3. "స ఏషః అగ్నిః వైశ్వానరః పురుషః" అంటే ఇతడు అగ్ని, వైశ్వానరుడు, పురుషుడు అనగా ఈ పురుషుడు ఎవడు?

సమాధానము: "సహస్ర శీర్షా పురుషః" అనియును పురుష ఏవేదమ్ సర్వమ్" అనియును "వేదాహమేతమ్ పురుషమ్ మహాంతమ్" అనియును చాలా చోట్ల పురుష శబ్దవాచ్యుడు భగవానుడే అని శ్రుతి చెబుతోంది కదా.

ఈ సందర్భంలో కూడా ద్యులోకాదులు మూర్ధాది అవయవములుగా వర్తించేది పరమాత్మకు తప్ప జఠరాగ్నికి కాదు.

కనుక ఇక్కడ వైశ్వానరునిగా చెప్పబడుతున్నది పరమాత్మయే

**నేను:** అయితే వైశ్వానర అంటే మరియొక దేవతా విశేషమో, పంచ భూతములలో ఒకటో కూడా కాదా!

**మామయ్య:** ఆ విషయము తరువాతి సూత్రములో వివరిస్తున్నారు

**అమ్మ:** ఏమిటా సూత్రము మామయ్యా!

**మామయ్య:**

## "అత ఏవ న దేవతా భూతమ్ చ....1-2-28"

అంటే

అత ఏవ: అందువలననే(వైశ్వానరుడు)

దేవతా: ఇంద్రాది దేవతలలో ఒక్కటి వలె మరియొక దేవతా విశేషమో

భూతమ్ చ: పంచ భూతములలో ఒక్కటయిన అగ్నియో

న: కాదు

అనగా

అందు వలననే వైశ్వానరుడు ఒక ఇంద్రాదులలో ఒకడైన మరియొక దేవతా విశేషమో, పంచ భూతములలో ఒక్కటయిన అగ్నియో కాదు.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** ఇంతకు ముందు చెప్పిన కారణాలే వైశ్వానర శబ్దము పరమాత్మను తప్ప, మరియొక దేవతా విశేషాన్నో, పంచ భూతాలలో ఒకటిగా ఉండే కాదు అని చెప్పడానికీ వర్తిస్తాయి. సాక్షాత్తూ కృష్ణ పరమాత్మ "అహమ్ వైశ్వానరో భూత్వా.." అని చెప్పిన తరువాత మఱి సందేహమేముంది. అయినా ఈ సందర్భము పరబ్రహ్మ గురించీ, బ్రహ్మవిద్య అయిన వైశ్వానర విద్య గురించీ, తత్ఫలితముగా సమస్త పాపక్షయమయి, ఉత్తమ పదాన్ని పొందడం గురించీ కదా!

అందువలన ఇక్కడ వైశ్వానరుడంటే పరమాత్మ తప్ప దేవతా విశేషము, పంచ భూతాలలో ఒకటీ అని కాదు.

**నేను:**అంటే ఇక్కడ వైశ్వానర పదము అగ్నిని చెప్పడం లేదంటారా!

**మామయ్య:** వైశ్వానర శబ్దము అగ్ని అని చెప్పినా విరోధము లేదంటున్నారు తరువాత సూత్రములో.

**అమ్మ:** ఏమిటి ఆ సూత్రము మామయ్య!

**మామయ్య:**

## "సాక్షాదపి అవిరోధమ్ జైమిని....1-2-29"

అంటే

సాక్షాదపి: అగ్ని శబ్దము సాక్షాత్తూ పరమాత్మ అని చెప్పినా

అవిరోధమ్: విరోధము లేదని

జైమిని: జైమిని తలంచుచున్నాడు

అనగా

సాక్షాత్తుగా అగ్ని శబ్దము పరమాత్మ అని అర్థము చెప్పుకున్నా విరోధము లేదని జైమిని ఆచార్యుడు(అభిప్రాయము)

**అమ్మ:** ఇక్కడ జైమిని అంటే బాదరాయణుని శిష్యులయిన జైమిని యేనా! అలా అయితే తన శిష్యుని అభిప్రాయాన్ని ప్రమాణంగా చూపిస్తున్నారా వ్యాసుల వారు?

**మామయ్య:** ఇక్కడ జైమిని అంటే బాదరాయణుల శిష్యులే. అదే వారి గొప్పదనము. తన శిష్యులే అని చులకన భావముండదు గొప్ప వారికి. సత్యాన్ని సత్యముగా అంగీకరించి, ఆదరించగల వారు, వారు.

ఇంతకు ముందు వైశ్వానరుడు అంటే జాఠరాగ్ని శరీరుడని అందువలన తద్విశిష్టుడయిన పరమాత్మ అని చెప్పేరు. ఇంక, వైశ్వానర శబ్దము, సాక్షాత్తూ అగ్ని శబ్ద వాచ్యుని సూచించినా అందులో విరోధము లేదని జైమిని అంటున్నట్లు చెబుతున్నారు ఇక్కడ.

"అగ్రే నయతీతి అగ్నిః" అను వ్యుత్పత్తి ప్రకారము "ముందుకు తీసుకొని పోవునది/ పోవువాడు" లేదా "సన్మార్గమున చివరి వరకు అనగా పరమ పదము వరకు తీసుకొని పోవువాడు లేదా సమస్త నరులను పాలించువాడు" అని అర్థము కదా. అట్టివాడు పరమాత్మయే కదా.

"అగ్నే సుపథా రాయే అస్మాన్

విశ్వాని దేవ! వయునాని విద్వాన్..."

అని ఈశావాస్యోపనిషత్ లో ఓ పరమాత్మా! మమ్ములను సన్మార్గముతో నిన్నర్చించుటకు, అనుకూలమగు ఐశ్వర్యము పొందుటకు ప్రవర్తింప చేయుము" అని అన్నచోట అగ్ని అనగా పరమాత్మయే కదా.

వైశ్వానర శబ్దమునకు వ్యుత్పత్తి బట్టి "విశ్వాన్ నరాన్ నయతీతి విశ్వానరః " "విశ్వమును, నరులను ముందుకు సన్మార్గములో నడిపించేది" అని అదే అర్థము.

సమస్త నరులకు సన్మార్గము ప్రసాదించి, ప్రకృష్టపదము నీయుట గాని, పాలించుట గాని ఆ పరమాత్మకే చెందుతుంది.

ఈ కారణము వలన వైశ్వానర శబ్దము అగ్నిని సూచించినా దానికి పరమాత్మ అనే అర్థము.

**నేను:** ఇందాకా ఒక ప్రశ్నకు సమాధానము చెప్పలేదు మామయ్యా, ఇలా అవయవాలతో ఉన్న శరీరము కలవాడు అంటే పరబ్రహ్మ పరిమితం, పరిచ్ఛిన్నం అయిపోతుంది కదా, పరమాత్మ పరిచ్ఛిన్నుడని ఎలా చెబుతాము?

మామయ్య: దానికి తరువాత సూత్రము చూడాలి మరి.

**అమ్మ:** ఏమిటి ఆసూత్రము మామయ్యా!

## మామయ్య:

## "అభివ్యక్తేః ఇతి ఆశ్మరథ్యః...1-2-30"

అంటే

అభివ్యక్తేః(పరబ్రహ్మము ద్యులోకాదులతో సంబంధించినదని ద్యులోకాదులు అవయవములుగా కలిగినదని చెప్పుట ఉపాసకునికి) తెలియ వచ్చుటకు,

అశ్మరథ్యః (అని) అశ్మరథ్యుడు(అభిప్రాయము).

అనగా

"ఉపాసకునికి ధ్యాన సౌకర్యము కల్గించుటకు పరమాత్మకు ద్యులోకాదులు శరీరావయవాలుగా శ్రుతి యందు చెప్పబడినవి" అనునది అశ్మరథ్యాచార్యుల వారి అభిప్రాయము.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** ఇప్పుడు సందేహము ఏమిటంటే, ఈ విశ్వంలో చేతనా, చేతనాలు గాని, ద్యులోకాదులు కాని పరమాత్మ అవయవాలు, శరీరము అంటే అవి అన్నీ ఒకప్పుడు సృష్టించబడినవి, అంటే కాల సంబంధమున్నవి, అంతే కాక, పరిచ్ఛిన్నమైనవి, అంటే అనంతత్వము వీటికి చెప్పలేము. "సత్యమ్, అనంతమ్ బ్రహ్మ " అనబడే పరబ్రహ్మ కు ఈ గుణాలు ఇక్కడ వర్తింప చేయలేము.

దీనికి అశ్మరథ్యాచార్యుల వారి సమాధానము, పరమాత్మ యొక్క ఉపాసకుల సౌలభ్యము కొరకు శ్రుతి యందు ఆ విధంగా చెప్పబడినది అని. అనంతము, అవ్యయము అంటే మనస్సు తో కూడా ఊహింప శక్యము కానిది కదా, అలాంటి దానిని ఎలా ధ్యానిస్తాము. ధ్యానించడానికి ఆలంబనమైన శుభాశ్రయమైన దివ్య మంగళ విగ్రహము కావాలి కదా. భగవానుడు తన దివ్య మంగళ విగ్రహాన్ని మునులు, యోగులు కూడా దర్శించలేరు, కాని నీకోసం చూపిస్తాను అని తన విశ్వరూపాన్ని చూపించేడు, దాని అర్థము ఆయన స్వరూపము పరిమితమైనదీ, పరిచ్ఛిన్నమైనదీ అని కాదు.

నువ్వు గంగా నదికో, సముద్రానికో స్నానానకి వెళ్ళి లోతు లేని ఒక చిన్న పాయలో స్నానం చేసి వచ్చి, గంగానది అన్నా సముద్రమన్నా నాకు తెలిసిపోయింది, ఇంతంత మాత్రమేనని, అని అంటే సబబు కాదు కదా. కాని ఆ లోతు ఎక్కువ లేని చిన్న పాయ నువ్వు స్నానము చేయడానికి కావాలి. అలాగే ఉపాసన చేయడానికి పరిమితమైన మన బుద్ధి సౌకర్యార్థము మనము ఊహించుకోగల దివ్య మంగళ విగ్రహము కావాలి. అందుకోసం శ్రుతి అలా చెప్పడం జరిగింది అంటారు అశ్మరథ్యాచార్యులవారు.

నేను: మఱి ప్రహ్లాదుడు, ఆళ్వార్లు వాళ్ళూ పరమాత్మను  అనుభవించేరు అంటే?

మామయ్య: వాళ్ళకీ అంతే. నువ్వు హరిద్వార్ లో గంగా స్నానము చేస్తే నీ అనుభవము ఒకలాగు, నేను కాశీలో చేస్తే నా అనుభవము ఒకలాగు ఉండవచ్చును కదా, కొంచెం స్థూలమైన ఉదాహరణమనుకో. అలా ఆయా భక్తులకు, ఆయా సందర్భాలలో అనుభవాలు వేరుగా ఉండవచ్చును, కాని పరమాత్మ యొక్క స్వరూప, రూప,  గుణ, వైభవ, ఐశ్వర్యాదులు మొత్తం తెలియడం అసంభవము అన్నమాట కూడా శ్రుతే చెప్పింది కదా, "యతో వాచః నివర్తంతే అప్రాప్య మనసా సహ" అని.

అందువలన ఇక్కడ పరమాత్మకు ద్యులోకాదుల సంబంధము చెప్పడం ఉపాసక సౌలభ్యానికని అశ్మరథ్యాచార్యుల అభిప్రాయము.

నేను: "యస్త్వేతమేవమ్" అని ఏతమేవమ్ అని "ఇతనిని ఇట్లు" అంటే పురుషునిగా చెప్పి అతనిని సర్వ లోకాలలో, భూతాలలో ఉపాసకుడు "అన్నమత్తి" అని అన్నము తినుచున్నాడు" అని చెప్పడానికి అర్థం ఏమిటి?

మామయ్య: ఆ వివరాలకు తరువాత సూత్రము చూడాలి.

**అమ్మ:** ఏమిటి ఆ సూత్రము మామయ్యా!

**మామయ్య:**

## "అనుస్మృతేః బాదరిః....1-2-32"

అంటే

అనుస్మృతేః: ఇట్లు భావించి ఉపాసించుటకని

బాదరిః: బాదరాచార్యుడు

(తలచుచున్నాడు)

అనగా

ఉపాసనమునకు పరబ్రహ్మము అట్టిదని చెప్పినట్లు శ్రీ బాదరాచార్యులు తలచుచున్నారు.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** అశ్మరథ్యాచార్యుల వారి వలెనే శ్రీ బాదరా చార్యులు కూడా ఉపాసనా సౌలభ్యము కొఱకే పరబ్రహ్మను శ్రుతులు పురుషాకారునిగా వర్ణించినదని అభిప్రాయ పడినారు.

"యస్త్వేతమేవమ్ ప్రాదేశ మాత్రమ్ అభివిమానమాత్మానమ్ వైశ్వానరమ్ ఉపాస్తే స సర్వేషు లోకేషు సర్వేషు భూతేషు సర్వేషు ఆత్మసు అన్నమ్ అత్తి"

అనగా "ఎవడంతటను వ్యాపించియుండువాడును, అవధి లేనివాడును అగు వైశ్వానరాత్మను ఇంతకు ముందు తెల్పినట్లు పురుషాకారునిగా ఉపాసించుచున్నాడో అతడు సర్వలోకములందును, సర్వ

భూతములయందును, సర్వాత్మల యందును, అన్నమును తినుచున్నాడు" అంటే ఆ అనవధికానందాద్యతిశయము కల వైశ్వానరుని ఎవడు పురుషాకారునిగా ఉపాసించుచున్నాడో అతడు సర్వ లోకములయందు, సర్వ భూతములయందు, సర్వఆత్మలయందు పరమాత్మనే అనుభవించుచున్నాడు" అంటే ఆ ఉపాసకుడు సమస్త విశ్వమునందు, చేతనాచేతనముల యందు ఆత్మగా చేరి యున్న పరమాత్మనే అనుభవించుచుండును అని అర్థము. ఇక్కడ "అన్నము" అంటే ముముక్షువులకు త్యాజ్యమైన ఐహికానుభవాలు కాక పరమాత్మానుభవము అని తెలుసుకోవాలి.

**నేను:** నాకు వైశ్వానరుడంటే పరమాత్మే, ఉపాసనా సౌలభ్యంకోసమే శరీరంతో చెప్పేరు అని అర్థమయింది. కాని ఒక విషయం అర్థం కాలేదు. అతని వక్షస్థలాన్ని అగ్ని గుండముగా భావించడం, శరీర భాగాలు అగ్నులుగా భావించడం అదీని. అంటే యజ్ఞం చేస్తున్నప్పుడు ఆయన గుండె వేది అనుకొని చేయాలా?

**మామయ్య:** ఆ వివరాలకు తరువాతి సూత్రము తెలుసుకోవాలి

**అమ్మ:** ఏమిటా సూత్రము మామయ్యా

**మామయ్య:**

## "సంపత్తేః ఇతి జైమినిః తథా హి దర్శయతి....1-2-32"

అంటే

సంపత్తేః:అగ్నిహోత్ర భావము కలుగ చేయుటకు

ఇతి:వక్షఃస్థలము మొదలగునవి అగ్నిగుండము మొదలగునవిగా చెప్పబడెనని

జైమినిః జైమిని ముని(తలచు చున్నాడు)

తథాహి:అట్లే కదా

దర్శయతి:(శ్రుతియు) తెలుపుచున్నది

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

## మామయ్య:

## "సంపత్తేః ఇతి జైమినిః తథా హి దర్శయతి....1-2-32"

అంటే

సంపత్తేః:అగ్నిహోత్ర భావము కలుగ చేయుటకు

ఇతి:వక్షఃస్థలము మొదలగునవి అగ్నిగుండము మొదలగునవిగా చెప్పబడెనని

జైమినిః జైమిని ముని(తలచు చున్నాడు)

తథాహి:అట్లే కదా

దర్శయతి:(శ్రుతియు) తెలుపుచున్నది

అనగా

వైశ్వానరునికి అగ్ని భావము కలుగ జేయుటకుగా అతని వక్షఃస్థలము మొదలగునవి అగ్ని గుండము మొదలగునవిగా చెప్పబడెను. శ్రుతి కూడ అట్లే తెలుపుచున్నది.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

మామయ్య: బ్రహ్మ విద్య అంటే యజ్ఞము లాంటిదేనమ్మా. "యజ దేవ పూజాయామ్" అని కదా. ఇవి ఆంతర యజ్ఞాలు, ఉపాసనా పూర్వకమైనవి.

ఒక విధమైన యజ్ఞాల వర్గీకరణములో యజ్ఞాలు స్వాధ్యాయ యజ్ఞము, జప యజ్ఞము, కర్మ యజ్ఞము, మానస యజ్ఞము అని నాలుగు రకాలు. అందులో కర్మ యజ్ఞముగృహ్య యజ్ఞాలు, శ్రౌత యజ్ఞాలు అని ఱెండు రకాలు. గృహ్య యజ్ఞాలు మనకు, మన కుటుంబ సంక్షేమానికి చేసేవి. భగవద్గీతలో చెప్పబడిన పంచ మహా యజ్ఞాలు ఇంకా పాక యజ్ఞము, హవిర్యజ్ఞము ...ఇవన్నీ గృహ్య యజ్ఞాలు. శ్రౌత యజ్ఞాలు విశ్వ క్షేమము కోసం చేసేవి. స్వాధ్యాయ యజ్ఞము అంటే వేదాధ్యయనము, వేదాలను బోధించడం అదీని. జప యజ్ఞము మంత్రజపం చేయడం, మానస యజ్ఞము అంటే ధ్యానము చేయడం అని మనకు తెలుసును. ఇంక ద్రవ్య, యజ్ఞాలూ, తపో యజ్ఞాలు అంటూ వేర్వేరు రకాలు కూడా చెబుతారు కొంత మంది అవీ వీటిలో భాగమే అంటారు, మరి కొంత మంది అవి వేరు అని అంటారు.

ఇదంతా ఎందుకు చెబుతున్నాను అంటే మనకు మన శాస్త్రాలు మనం నిత్యం ఆచరించే కర్మలను కూడా యజ్ఞ విధానంలో ఎలా ఆచరించాలో నేర్పింది. మనం రోజూ చేసే సాపాటు అదే ఆహార స్వీకారము కూడా ఒక యజ్ఞమే. మఱి దానికి ఉపాసన చేయబడే దైవము, యజ్ఞ ద్రవ్యాలు, అగ్నులు, విధానము అన్నీ కావాలి కదా. అదే చెబుతున్నారు ఇక్కడ. దానికి ఉపాసన చేయ బడే దైవము పరమాత్మ అయిన వైశ్వానరుడు. వక్షఃస్థలము వేదిక, ముఖము ఆహవనీయాగ్ని, హృదయము గార్హపత్యాగ్ని, మనస్సు దక్షిణాగ్ని... ఇలా వివిధ అవయవాలే ఆయా అగ్నులూ, పరికరాలూ అవీని. మనము తీసుకొనే ప్రాణాహుతులే అర్పించబడే ఆహుతులు.

తైత్తిరీయ ఉపనిషత్ లో కూడా ఇలాగే "తస్య ఏవమ్ విదుషః యజ్ఞస్య.." అని ప్రారంభించి "ఆత్మా యజమానమ్, శ్రద్ధా పత్నీః, శరీరమ్ ఇధ్మమ్, తపః అగ్నిః, వాక్ దక్షిణా...." అని ఇదే  రకంగా చెబుతుంది.

ఈ రకంగా మన నిత్య కర్మలను జ్ఞానమార్గంతో ముడి వేసి, తద్వారా భక్తిని, పరమాత్మానుగ్రహాన్ని చేకూర్చే పద్ధతులు మన శాస్త్రాలు మనకు చెబుతున్నాయి.

**నేను:** కర్మ, జ్ఞానము వేరు కాదా, వాటికి ముడి వేయడం సబబేనా?

**మామయ్య:** మన సిద్ధాంతము చెప్పేది కర్మ, జ్ఞాన సముచ్చయము, తద్వారా భక్తి. ఇవి అంగాంగీ సంబంధముతో ఉంటాయి. అంటే మనం కర్మలను యజ్ఞములుగా అంటే దేవ పూజలుగా సంభావించి, వాటికి ఉపాసన అనే పరమాత్మ ధ్యానము ముడి వేయాలన్నమాట. అందుకే ఈశావస్యోపనిషత్ "విద్యాంచ అవిద్యాంచ ....ఉభయమ్ సహ" అని కర్మ, జ్ఞానము కూడా కావాలి అని చెబుతుంది.

ఇంక ప్రస్తుత విషయానికి వస్తే "ద్యులోకము మొదలైనవన్నీ శరీరముగా కలవాడయిన పరమాత్మయే అగు వైశ్వానరుని ఆరాధించుటకు ఉపాసకులచే దినదినము అనుష్ఠింపబడునట్టి ప్రాణాహుతులకు అగ్నిహోత్ర కర్మత్వము కలుగ జేయుటకు వక్షఃస్థలము మొదలగునవి అగ్ని గుండము మొదలగునవిగా ఇక్కడ ఉపదేశింపబడినది" అని జైమిన్యాచార్యులు తలచుచున్నారు అని అర్థము. ఇట్టి భావనము, ధ్యానము లేకుండా చేస్తే నష్టము ఏమిటి అంటే "అది నిప్పు లేకుండా ఉన్న బూడిదలో హోమము చేసినట్లు నిరుపయోగమనిన్నీ" చేస్తే వచ్చే లాభము ఏమిటంటే "పాపాలన్నీ నిప్పులో వేసిన దూదిలా భస్మమై పోయి, అట్టి ఉపాసకుడు సమస్త లోకముల యందు, భూతములయందు, ఆత్మలయందు పరమాత్మను దర్శించి అనుభవించి, ఆనందిస్తూంటాడు అనిన్నీ" చెప్పేరు. భగవద్గీతలో కూడా చెబుతారు కదా సర్వమూ బ్రహ్మాత్మకమే అని.నేను: అంటే మనము తీసుకొనే ప్రాణాహుతులను మనలో పరమాత్మ వైశ్వానరుడుగా ఉన్నాడనే జ్ఞానంతో ఆయనకు ఆహుతులుగా తీసుకోవాలన్నమాట.

**మామయ్య:** ఈ విషయాన్నే ఇంకా వివరిస్తున్నారు తరువాతి సూత్రంలో.

**అమ్మ:** ఏమిటా సూత్రం మామయ్యా!

**మామయ్య:**

## "ఆమనంతి చైనమస్మిన్...1-2-33"

అంటే

అస్మిన్: ఈ ఉపాసకుని శరీరమున

ఆమనంతి: (వైశ్వానరుని ప్రాణాహుత్యాధారముగా) చెప్పబడినది.

అనగా

వైశ్వానరుని ఉపాసకుని శరీరము ప్రాణాహుతులకాధారముగా నుండు వానినిగా చెప్పబడుతోంది.

**అమ్మ:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** ఈ వాక్యాలలో పరమ పురుషుడును, ద్యులోకాదులతో కూడి యున్న వైశ్వానరుని యొక్క ఉపాసకునికి వైశ్వానరుని ఉపాసనము విధించి, బ్రహ్మ ప్రాప్తిని తత్ఫలముగా నుపదేశించేరు. ఇట్టి వైశ్వానరోపాసనకు అంగ భూతమైన వస్తువుగా ఉపదేశింపబడిన వైశ్వానరుని కవయవభూతములు, సుతేజస్సు, విశ్వరూపుడు మొదలగు పేర్లు గల అగ్ని, ఆదిత్యుడు మొదలైనవాటిని ఉపాసకుని శిరస్సు మొదలగు అవయవముల యందు ఆపాదించుచున్నారు. ఇట్లు ఉపాసకుడు త్రైలోక్య శరీరుడును, పరమాత్మయు నగు వైశ్వానరుని తన శరీరమునందుంచబడిన వానినిగా అనుసంధించుకొని తన వక్షఃస్థలము, రోమములు, హృదయము, మనస్సు, ముఖము ఇవి క్రమేణ వైశ్వానరునియొక్క వేదిక, బర్హి,

గార్హపత్యము, దక్షిణాగ్ని, ఆహవనీయాగ్ని అనబడు అగ్నిహోత్రోపకరణములుగ భావించి ప్రాణాహుతులను అగ్ని హోత్ర కర్మముగా భావించి దానితో పరమాత్మయగు వైశ్వానరుని ఉపాసించ వలెనని ఈ శ్రుతి వాక్యాలు ఉపదేశిస్తున్నాయి. కనుక పరమాత్మయే వైశ్వానరుడని తెలిసి ప్రాణాహుతులతో అగ్నిహోత్ర కర్మము నిర్వర్తించ వలెనని దీని సారాంశము.

**అమ్మ:** మనం రోజూ చేసే సాపాటుకి అంతటి పరమార్థము ఉన్నదన్నమాట.

బాగుంది మామయ్యా, ఈ అధికరణములో ఛాందోగ్యోపనిషత్ లో వైశ్వానర విద్యలో చెప్పబడిన వైశ్వానరశబ్ద వాచ్యునికి పరమాత్మ ధర్మములు చెప్పి యుండుట వలన పంచ భూతాలలో ఒకటైన అగ్నియో, మరొక దేవతా విశేషమో, జఠరాగ్నియో కాక ఈ వైశ్వానర శబ్ద వాచ్యుడు పరమాత్మయే అనిన్నీ, ద్యులోకాదులు ఆయన శరీరము అని చెప్పడం వలన కూడా అతడు పరమాత్మ అనే తెలుస్తోందనీ, "అగ్నిఃవైశ్వానరః " అని చెప్పినప్పుడు ద్యులోకాదులు అవయవములుగా కల త్రైలోక్య శరీరత్వము జఠరాగ్నికి అసంభవము కనుక జఠర అగ్ని శరీరుడైన వైశ్వానరుడు పరమాత్మ అనే ఇక్కడ అర్థము చెప్పుకోవాలని, ఇదే కారణాల వలన వైశ్వానర శబ్ద వాచ్యుడు మరొక దేవతా విశేషమో, పంచ భూతాలలో ఒకటో కాదని, ఒక వేళ వైశ్వానర శబ్ద వాచ్యుడు అగ్ని అనుకున్నా, "అగ్రే నయతి" అను వ్యుత్పత్తి అర్థము ప్రకారమూ, ఇక్కడ అగ్ని పరమాత్మే కనుక విరోధము లేదని జైమిని ఆచార్యుని అభిప్రాయమనీ, ఆశ్మరథ్యుని అభిప్రాయము "ద్యులోకాదులు వైశ్వానరుని అవయవాలు అని శ్రుతి మన ఉపాసనా సౌలభ్యము కోసం చెబుతుందనీ", బాదరి కూడ అదే అభిప్రాయముతో "అట్టి వైశ్వానరుని ఉపాసకుడు సమస్త లోకములయందు, భూతములయందు,ఆత్మల యందు పరమాత్మనే అనుభవించునని అర్థం చెప్పేడని", అట్టి వైశ్వానరుని ఆరాధనయందు అగ్ని హోత్ర కర్మ భావమును కలుగ చేయుటకు అతని వక్షఃస్థలము అగ్ని గుండము అనుచు ఆయా యజ్ఞ పరికరాలను శరీరావయవాలుగా ఆపాదించేరనీ, శ్రుతి యందు ఆ విధానమే చెప్పేరని, అట్లు అగ్నిహోత్ర రూపమున ఉపాసన చేయుచు ప్రాణాహుతులు చేయు ఉపాసకునికి సమస్త పాప క్షయమై, అతడు సకల విశ్వమును

పరబ్రహ్మ శరీరముగా దర్శించుచూ, ఎల్లెడలా పరమాత్మానుభవము పొందుతూ ఉంటాడని, ఈ కారణాల వలన వైశ్వానర విద్యలో చెప్పబడిన వైశ్వానర శబ్ద వాచ్యుడు పరమాత్మే అని ఈ అధికరణ సారాంశముగా అర్థం అయింది.

మామయ్య: బాగా చెప్పేవమ్మా,

ఇంతటితో శ్రీభాష్యము మొదటి అధ్యాయము రెండవ పాదము భగవద్రామానుజుల దయ వలన ముగిసింది. రామం, ఈ పాదం సారాంశము నువ్వు చెప్పు.

నేను: మొదటి అధ్యాయంలో చేతనాచేతనాలని గురించి అతి స్పష్టత లేని చిహ్నాలను చెప్పే శ్రుతి వాక్యాలను పరిశీలించి పరబ్రహ్మ నిరూపణము చేసేరు.

ఇంక రెండవ పాదంలో కొంచెం స్పష్టత లేని చిహ్నాలను చెప్పే వాక్యాలను పరిశీలించి పరబ్రహ్మ నిరూపణము చేస్తున్నారు. ఆ రకంగా ఈ పాదంలో ఆక్షేపాలకు బలమెక్కువ ఉండడానికి అవకాశము ఎక్కువ ఉండడం వలన భగవద్రామానుజులు తన సిద్ధాంతాన్ని అంతకంటే బలంగా ప్రతిపాదించి ఆయా పూర్వ పక్ష వాదాలను సమన్వయం చేసేరు.

ఇంతకు ముందు జగత్కారణత్వము, ముముక్షుపాస్యత్యము మొదలైనవి చైతన్యము గల పరబ్రహ్మమునకే కుదురుతుంది అని చెప్పేరు. ఇప్పుడు చైతన్యము గల జీవునికి ఈ సామర్థ్యము కుదరదని మళ్ళీ నొక్కి వక్కాణిస్తున్నారు.

సర్వత్రప్రసిద్ధ్యధికరణములో ఛాందోగ్యోపనిషత్ లో "సర్వమ్ ఖల్విదమ్ బ్రహ్మ..." అన్న శ్రుతిలో బ్రహ్మము పరమాత్మయే తప్ప జీవుడు కాడనీ, అక్కడ చెప్పబడిన మనో మయునిగను, ప్రాణ శరీరునిగను, భారూపునిగాను ఇత్యాది ధర్మాలతో చెప్పబడినవాడు పరమాత్మయే అనిన్నీ ఈ గుణాలు జీవునికి కుదరవు

అనిన్నీ, అత్రధికరణము లో స్థావర జంగమ పదార్థములన్నిటినీ భుజించువాడుగ కఠోపనిషత్తులో చెప్పబడిన వాడు పరమాత్మయే అనిన్నీ, అంతరాధికరణములో ఛాందోగ్యోపనిషత్ లో నేత్రమున నుండు అమృతమును, అభయము ను నగు పురుషుడు పరమాత్మయే అనిన్నీ ఇక్కడ చెప్ప బడిన ఆయా గుణాలు జీవునకు వర్తించవు అనిన్నీ పరమాత్మోపాసకునికి పరమాత్మ అనుగ్రహము వలననే అర్చిరాది మార్గ మున మఱి తిరిగిరాని పరమపదమునకు వెళ్ళగల అవకాశముంటుందని, అంతర్యామ్యధికరణము లో బృహదారణ్యకోపనిషత్తు లో అంతర్యామి బ్రాహ్మణమునందు పృథివ్యాది వివిధ చేతనాచేతనములయందు అంతర్యామిగా చెప్పబడిన వాడు పరమాత్మయే అనిన్నీ, అదృశ్యత్వాది గుణకాధికరణము లో ముండకోపనిషత్ లో అక్షర పరబ్రహ్మముగా అదృశ్యత్వాది గుణములతో నున్నట్లు నున్నట్లు చెప్పబడిన వాడు సర్వజ్ఞుడు, సర్వవిత్ అయిన త్రిలోక శరీరుడైన పరమాత్మయే అనిన్నీ, ఛాందోగ్యోపనిషత్ లో వైశ్వానర విద్య సందర్భమున ఉపాస్యుడైన వైశ్వానరుడుగా చెప్పబడినవాడు పరమాత్మయే తప్ప వేరొక దేవతా విశేషమో, భూతాగ్నియో, జఠరాగ్నియో కాదని వారెవ్వరికీ సమస్త విశ్వమూ శరీరముగా కలిగి యుండుట, తదుపాసకులకు సమస్త పాపాలను దగ్ధం చేసి, బ్రహ్మానుభవము కలుగ జేయుట మొదలైన గుణాలు కుదరవనీ, "అహమ్ వైశ్వానరో భూత్వా.." మొదలైన వాక్యములు కూడా ఈ విషయాన్నే చెబుతున్నాయనీ ఈ సందర్భములో వైశ్వానర శబ్దానికీ, అగ్ని శబ్దానికీ వాచ్యునిగా వ్యుత్పత్త్యర్థము ప్రకారము సన్మార్గములో పరమపదానికి తీసుకొని వెళ్ళేవానిగా పరమాత్మ అనే చెప్పుకోవలెననీ ఈ శ్రీభాష్య ప్రథమాధ్యాయ ద్వితీయ పాద సారాంశము అని నాకు అర్థం అయింది

**మామయ్య**:కొంచెం క్లుప్తంగా చెప్పేసేవు కాని బాగానే ఉంది. ఇంక ఈ రోజుకు ఆపి మరొక సారి చూద్దామా.

**అమ్మ**: మళ్ళీ వారం నుండీ కాలేజీలు తెరుస్తారు మామయ్యా, మావాడికీ, మా ఆయనకు కూడా ఆదివారాలు కూడా క్లాసులే. అందుచేత మళ్ళీవారం నుండీ కొన్ని రోజులు రావడానికి కుదరదు.

మామయ్య: అవునమ్మా, మళ్ళీ వారం నుండీ మాకూ కాలేజీలే కాని మరీ మీఆయనంత తీరుబాటు ఉండకపోదనుకో. కాని, మనకు మళ్ళీ భగవద్రామానుజుల అనుగ్రహము ఎప్పుడు కలుగుతే అప్పుడే ప్రారంభిద్దాం. ఇంక ఇప్పటితో ముగిద్దాము.

అందరూ:

యోనిత్యమచ్యుత పదాంబుజ యుగ్మ రుక్మ వ్యామోహతః తదితరాణి తృణాయ మేనే

అస్మత్ గురోః భగవతోస్య దయైకసింధోః

రామానుజస్య చరణౌ శరణమ్ ప్రపద్యే

లక్ష్మీనాథ సమారంభామ్ నాథయామున మధ్యమామ్

అస్మదాచార్య పర్యంతామ్

వందే గురుపరంపరామ్

అఖిల భువన జన్మ స్థేమ భంగాది లీలే

వివిధ వినత వ్రాత రక్షైక దీక్షే

శ్రుతి శిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే

భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా.

కౌండిన్యాన్వయ భాష్యకార తనయమ్ శ్రీఅప్పలార్యాశ్రితమ్

నాథ ద్వంద్వ పదార్చితమ్ చ సతతమ్ సంసేవ్య లక్ష్మీ సఖమ్

ఆంగ్ల ద్రావిడ సంస్కృతాంధ్ర బహు భాషా కోవిదమ్ ధీనిధిమ్

వేదాంతద్వయ తత్త్వ శాస్త్ర విదుషమ్ శ్రీశ్రీనివాసమ్ భజే